ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-9-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 225 పేజీలు: 10+4 వెల: 8.00

గ్లోబల్ సౌత్ బలమైన వాణి వినిపించాలి: ప్రధాని
సముద్రం ఎండిపోయిందంటూ అర్జెంటీనాలో హల్‌చల్ 5


భారత్ మండపంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోడీ

## కలిసి నడుద్దాం 2

### ప్రధాని మోడీతో భేటీలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

వాణిజ్యం, పెట్టుబడులు, పలు ద్వైపాక్షిక అంశాలపై ఉభయుల చర్చలు

ఏడు సంవత్సరాల తర్వాత భారత్‌కు వచ్చిన చైనా అధినేత

వాస్తవాధీన రేఖ వివాదంపై కూడా చర్చించిన మోడీ, జిన్‌పింగ్

# 'క్యూర్'కు ఓకే

### అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదం

విశ్వనగరంగా హైదరాబాద్

సామాన్యులపై ఆస్తిపన్నుభారం లేదు

మేయర్, కౌన్సిలర్ల అధికారాలు యధాతథం

30 యేళ్ల అవసరాలకు తగినట్లుగా బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్,సెప్టెంబరు 12,ప్రభాతవార్త:** భాగ్యనగరాన్ని పర్యావరణహితంగా డిజిటల్ మానవవనరులు డిజిటల్ పరిపాలనతో తెలంగాణకు ఆర్థిక వెన్నెముకగా మలిచేందుకు లైడార్ సర్వే, త్రీడి మ్యాపింగ్‌తో రాష్ట్రప్రభుత్వం పరిపాలన వికేంద్రీకరణ అభివృద్ధి చేపట్టడానికి పూనుకొందని శాసనసభ వ్యవహారాలు, ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు తెలిపారు. శనివారం తెలంగాణ శాసనసభలో హైదరాబాద్ మహానగర భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక, సమగ్ర, సమన్వయ పాలనా వ్యవస్థను ఏర్పాటుచేసే లక్ష్యంతో కోర్‌అర్బన్ రీజియన్ (సమగ్రపాలన) బిల్లు, 2026ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రవేశపెట్టగా, సభా చర్చించి ఆమోదించింది. తర్వాత శాసనమండలి కూడా ఆమోదించింది. శాసనసభలో మంత్రి మాట్లాడుతూ 1955లో రూపొందించిన గ్రేటర్‌హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టానికి 14 ఫిబ్రవరి 1956న రాష్ట్రపతి ఆమోదం లభించిందనీ గుర్తుచేశారు. పదిహేను లక్షల జనాభాను దృష్టిలో ఉంచుకుని ఆరోజుల్లో రూపొందించిన ఈ చట్టం, నేడు ఒకకోటి ముప్పైలక్షల జనాభా కలిగిన విస్తృత మహానగర అవసరాలకు తగిన విధంగా లేదనీ అభిప్రాయపడ్డారు. క్యూర్ ప్రాంతంలోని ప్రాంతం రాష్ట్ర జనాభాలో దాదాపు >>2

### అసెంబ్లీ 16న మళ్లీ భేటీ

ఒక్కరోజు పొడిగింపు

కౌన్సిల్ నిరవధిక వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలను రాష్ట్ర ప్రభుత్వం మరో >>7

# ట్రంప్ టారిఫ్‌లతో ముప్పు

ప్రపంచ వాణిజ్యానికి ప్రమాదం వాటిల్లే అవకాశం

పశ్చిమాసియా ఉద్రిక్తతలను నివారించాలి

యుఎన్ ఛార్టర్‌కు అనుగుణంగా రక్షణ కల్పించాలి

శాంతి, స్థిరత్వాలు దౌత్యమార్గంలో సాగాలి

ఏకాభిప్రాయంతో బ్రిక్స్ డిక్లరేషన్‌కు ఆమోదం


న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోడీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తదితర దేశాధినేతలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** భారత్‌కు కీలకమైన దౌత్య విజయంగా నిలిచే పరిణామంలో బ్రిక్స్ దేశాలు శనివారం ఢిల్లీ డిక్లరేషన్‌ను ఏకాభిప్రాయంతో ఆమోదించాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణల నేపథ్యంలో ఇరాన్, యూఏఈ మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొన్నప్పటికీ తెరవెనుక జరిగిన వరుస చర్చల అనంతరం ఉమ్మడి ప్రకటనపై అంగీకారం కుదిరింది. భారత్ ఆతిథ్యమిస్తున్న రెండు రోజుల బ్రిక్స్ సదస్సు తొలి రోజు చర్చలు ముగిసిన అనంతరం >>2

### ఏ దేశానికి వ్యతిరేకం కాదు

-ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 12:** ప్రపంచ వృద్ధికి చోదక శక్తులుగా ఉన్న దేశాలకు ప్రపంచ పాలనలో మరింత కీలక పాత్ర దక్కాలన్న >>2

బ్రిక్స్ కూటమికి గ్రోత్ ఇంజిన్‌గా భారత్ 5


గమనిక
ఆదివారం అనుబంధం బదులుగా నేటి సంచికతో 'వినాయక వ్రతకల్పం' పుస్తకం ఉచితంగా అందుకోండి.
-ఎడిటర్

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు వేగంగా అడుగులు

# దేశ రక్షణ సామర్థ్యాలు మరింత బలోపేతం

ప్రాజెక్టు కోసం వారంలోగా నోడల్ అధికారుల నియామకం

రక్షణమంత్రి రాజ్‌నాథ్ సమక్షంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు సమీక్ష


శనివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ అయిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఆదిలాబాద్ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి అడుగులు వేగంగా ముందుకు పడుతున్నాయని, ఈ మేరకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి శనివారం రక్షణ మంత్రిత్వ శాఖ రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో కలిసి సమావేశమైనట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో.. ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించామని, ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు అమలును వేగవంతం చేయడంతో పాటుగా ఈ కార్యాచరణను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు రక్షణ శాఖ, పౌరవిమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్కో నోడల్ ఆఫీసర్‌ను వచ్చే వారంలోగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో పాటుగా జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డిపిఆర్), మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించామన్నారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయం కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు.. వరుస సమావేశాలు, లేఖలు, నిరంతర సమన్వయం చేస్తున్నామని, శనివారం ఒక తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటుగా ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష సాకారమయ్యే దిశగా ఇప్పుడు కీలక ముందడుగు పడింది. శనివారం రాజ్‌నాథ్ సమక్షంలో జరిగిన సమావేశంలో రెండు మంత్రిత్వ శాఖల అధికారులు కూడా పాల్గొన్నారు. ఉత్తర తెలంగాణ కనెక్టివిటీ విషయంలో, దేశ రక్షణపరంగా వ్యూహాత్మక ప్రాంతమైన ఆదిలాబాద్ లో విమానాశ్రయం ఏర్పాటు, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు అవసరాన్ని వివరిస్తూ.. >>7



### కేసులను కోర్టుల్లో ఎదుర్కొంటాం

పోలీసులు నిందితులను కాపాడుతున్నారా?: కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** అసెంబ్లీ ప్రాంగణంలో ఇటీవల జరిగిన గందరగోళం నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు >>7

# రాజీనామా ఎవరు చేయాలి?

### రూపాయి జీతం తీసుకొనే నేను చేయాలా?

### రూ. 21 కోట్లు తీసుకొని అసెంబ్లీకి రాని కెసిఆరా?

మాజీ మంత్రి హరీష్ రావును ప్రశ్నించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు12:** 22ఏ భూముల అంశాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయ ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజల భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే.. అసత్య ప్రచారాలతో ప్రభుత్వాన్ని, తనను లక్ష్యంగా చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. చీము, నెత్తురు, సిగ్గు, శరం ఉంటే రాజీనామా చేయాలని నన్ను అడుగుతున్నారు. మరి ప్రజాధనంతో ఇన్నేళ్లు అధికారాన్ని అనుభవించి.. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన వారు రాజీనామా చేయాల్సింది కాదా? అని మంత్రి ప్రశ్నించారు. అసెంబ్లీలో సాయంత్రం >>2




# ఆ హామీలు ఏ వంద రోజుల్లో?

### క్యాసెక్కులా? బ్యాంకు చెక్కులా!

సిఎం పాత్రలో తలసాని, ఇరిగేషన్ మంత్రిగా పల్లా

స్పీకర్ పాత్రలో మాణిక్‌రావు.. బిఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ మాక్ అసెంబ్లీలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్ర పోషించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు శాసన సభ స్పీకర్‌గా వ్యవహరించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ సభ్యులు సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఎం పాత్ర పోషించిన తలసాని శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, హామీల అమలుపై వ్యంగ్యాలు సంధించారు. ఎన్నికల సమయంలో 100 రోజుల్లో హామీలు అమలు >>2


శనివారం బిఆర్ఎస్ మాక్ అసెంబ్లీలో సిఎం పాత్రలో ఎమ్మెల్యే తలసాని

# 'క్యూర్'కు ఓకే

మూడవ వంతు కలిగి ఉంది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన ప్రజాలికారా ఉంది.ప్రస్తుత ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం, పట్టణ వరదలు, చెరువులు-నాలాల ఆక్రమణలు, మూసీ కాలుష్యం, నీటి కొరత, వ్యర్థాల నిర్వహణ, అనధికార నిర్మాణాలు, అగ్ని భద్రత, ప్రజా రవాణా, అందుబాటు గృహాలు, వారసత్వ పరిరక్షణ మహిళలు, భద్రత, దివ్యాంగులకు వంటి అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నాయని అన్నారు. అనేక సంస్థల మధ్య అధికార పరిధులు సమన్వయ లోపానికి కారణమవుతున్నాయని ఈ నేపథ్యంలో క్యూర్ స్థాయిలో సమగ్ర పాలనకు బిల్లు ప్రతిపాదిస్తోందని తెలిపారు. వార్డు స్థాయి వికేంద్రీకరణను కొనసాగిస్తూ, విపత్తుల నిర్వహణ, ట్రాఫిక్-రోడ్డు భద్రత, యుటిలిటీ సమన్వయం, చెరువుల పరిరక్షణ, వాతావరణ చర్యలు, వారసత్వ పరిరక్షణ, ఆహార భద్రత, లింగ సమానత్వం, పట్టణ జీవవైవిధ్యం వంటి రంగాలకు ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేస్తుంది.డిజిటల్ గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్, ఒకే సదుపాయ పోర్టల్, సమగ్ర బిల్లింగ్, డిజిటల్ బిల్డింగ్ పర్మిషన్, డీమ్డ్ అప్రూవల్, ఒకే సమగ్ర ట్రేడ్ లైసెన్స్, నైట్ ఎకానమీ జోన్లు, సివిల్ పెనాల్టీ రిజిమ్ వంటి ఆధునిక సంస్కరణలను ప్రవేశపెడుతుందని తెలిపారు. క్యూర్ స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్ ద్వారా రియల్‌టైమ్ పర్యవేక్షణ, సమన్వయం, వేగవంతమైన స్పందనకు అవకాశం కల్పిస్తుంది. అదేవిధంగా కాలానుగుణంగా అనవసరమైన నిబంధనలను తొలగిస్తూ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీను నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణకు ఏకైక ప్రాధికారంగా నిర్ధారిస్తుందని తెలిపారు. మొత్తంగా, రాష్ట్ర ప్రభుత్వం, కార్పొరేషన్లు, క్యూర్ పరిధిలోని అన్ని సంస్థలను ఒకే చట్టబద్ధ వేదికపైకి తీసుకువచ్చి, సమన్వయంతో ప్రణాళిక, సమిష్టి నిర్ణయాలు, ప్రజలకు సురక్షిత సేవలు అందించడం ఈ బిల్లు లక్ష్యంగా పెట్టుకుంది. వేగంగా ఎదుగుతున్న హైదరాబాద్‌ను మరో మూప్పై ఏళ్ల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నగర పాలనను మార్చాల్సి ఉందన్నారు.ప్రజలకు మరింత చేరువగా, సమర్థవంతంగా, సమన్వయంతో పరిపాలన అందించాలని తెలిపారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా నగర పాలనను తీర్చిదిద్దాలని చెప్పారు.400 ఏళ్ల చరిత్ర కలిగిన భాగ్యనగరంలో అనేక రాజ వంశాలు, సంస్కృతులను కలుపుకుని ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగిందని గుర్తు చేశారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుండి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు హైదరాబాద్ ప్రయాణం గొప్ప పరిణామానికి నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం రూపొందించి ప్రజల ముందు ఉంచిందని వివరించారు.మూసీ పునర్జీవనం తొలిదశకు రూ.7345కోట్లు అనుమతులు ఇచ్చామని 20టీఎంసీల గోదావరి జలాలు తీసుకొచ్చి బ్లూ,గ్రీన్‌సిటీగా భాగ్యనగరాన్ని రూపుదిద్దుతామనితెలిపారు. 2034 నాటికి తెలంగాణను ఒ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఈ లక్ష్యాలను సాధించాలంటే హైదరాబాద్ మరింత ఆధునాతనంగా అంతర్జాతీయ స్థాయికి చేరాలని వివరించారు. హైదరాబాద్‌కు భారీగా పెట్టుబడులు రావడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు రావాలని ఆకాంక్ష వ్యక్తంచేశారు. క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు రాష్ట్ర ఆర్థిక ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయని 2025 -26లో తెలంగాణ రాష్ట్ర స్థూల ఆదాయం సుమారు రూ.17.82 లక్షల కోట్లు కు చేరిందని గత ఏడాది రూ.16.09 లక్షల కోట్లతో పోలిస్తే 10.7 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు. సేవా రంగం, పెట్టుబడులు, ఉద్యోగాలకు హైదరాబాద్ మహానగరం ప్రధాన కేంద్రంగా ఉందని గుర్తు చేశారు. నీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ, రవాణా, ట్రాఫిక్, వరదల నియంత్రణ, చెత్త నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై సమన్వయంతో పని చేసే వ్యవస్థ అవసరమని అన్నారు. క్యూర్ ప్రాంతానికి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన నగర పాలన అందించడానికి బిల్లు తెచ్చామని తెలిపారు.

# టారిఫ్‌లతో ముప్పు

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ డిక్లరేషన్ ఆమోదమైనట్లు ప్రకటించారు. పశ్చిమాసియాపై తీవ్ర ఆందోళపశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రతరం కావడంపై ఢిల్లీ డిక్లరేషన్‌లో బ్రిక్స్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. పరిస్థితులు మరింత దిగజారకుండా గరిష్ఠ సంయమనం పాటించాలని అన్ని పక్షాలకు పిలుపునిచ్చాయి. ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని సూత్రాలకు అనుగుణంగా పౌరులు, పౌర మౌలిక సదుపాయాలకు రక్షణ కల్పించాలని సభ్య దేశాలు కోరాయి. దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని స్పష్టం చేశాయి.దీర్ఘకాలిక అవగాహన, శాశ్వత శాంతి, భద్రత, ప్రాంతీయ స్థిరత్వం కోసం చర్చలు, దౌత్యపరమైన ప్రయత్నాలను మరింత పెంచాలని పిలుపునిచ్చాయి. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ప్రపంచ వాణిజ్యం, సరఫరా గొలుసులు, ఇంధన సరఫరా సజావుగా కొనసాగేందుకు సమష్టిగా కృషి చేయాల్సి న అవసరాన్ని నొక్కిచెప్పాయి.

**ఏకపక్ష టారిఫ్‌లపై బ్రిక్స్ ఆందోళన**

ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో పెరుగుతున్న ఏకపక్ష టారిఫ్‌లు, నాన్ టారిఫ్ చర్యలు వాణిజ్యాన్ని వక్రీకరిస్తున్నాయని బ్రిక్స్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంది.టారిఫ్‌లు, నాన్ టారిఫ్ చర్యలను విచక్షణారహితంగా పెంచడం, పర్యావరణ లక్ష్యాల పేరుతో రక్షణాత్మక వాణిజ్య విధానాలను అమలు చేయడం వల్ల ప్రపంచవాణిజ్యం మరింత తగ్గే ప్రమాదం ఉందని తెలిపింది.ఇలాంటి చర్యలు ప్రపంచ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగించడంతో పాటు అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాల్లో అనిశ్చితిని పెంచుతాయని పేర్కొంది. ఇప్పటికే ఉన్న ఆర్థిక అసమానతలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని, ప్రపంచ ఆర్థిక అభివృద్ధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించింది.డబ్ల్యుటిఒ మరింత స్పందించేలా కలిసి పనిచేస్తామని, వాణిజ్య అంతరాయాలు, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల అవసరాలకు అనుగుణంగా సంస్థను బలోపేతం చేయాలని బ్రిక్స్ దేశాలు నిర్ణయించాయి. ఢిల్లీ డిక్లరేషన్ ముసాయిదాపై చర్చలు చివరి నిమిషం వరకు కొనసాగాయి. ప్రారంభంలో ఇరాన్, యూఏఈ తమ తమ వైఖరులపై గట్టిగా నిలబడటంతో ఏకాభిప్రాయం సాధించడం సవాలుగా మారింది. బ్రిక్స్ ఒక ఏకాభిప్రాయ ఆధారిత కూటమి కావడంతో ఏ ఒక్క సభ్య దేశమైనా తుది ఉమ్మడి ప్రకటనను అడ్డుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో జరిగిన వరుస చర్చల అనంతరం డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం కుదిరింది.

**జిన్‌పింగ్‌తో మోడీ కరచాలనం**

సదస్సు ప్రారంభ సెషన్ ముగిసిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కరచాలనం చేశారు.ముగింపు ప్రసంగంలో మోడీ మాట్లాడుతూ.. మారుతున్న ప్రపంచాన్ని పాతకాలపు సంస్థలతో నడిపించడం సాధ్యం కాదని అన్నారు. సంస్థల్లో ప్రాతినిధ్యం, స్పందన, నియమాల రూపకల్పన విషయంలో సంస్కరణలు అత్యవసరమని పేర్కొన్నారు.

భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధిలో, వాటిని నియంత్రించే నియమాల రూపకల్పనలో గ్లోబల్ సౌత్‌కు సమాన భాగస్వామ్యం ఉండాలని మోడీ స్పష్టం చేశారు. నిర్ణయాలకు, వాటి అమలు ఫలితాలకు మధ్య ఉన్న అంతరాన్ని భాగస్వామ్యం, సమష్టి చర్యల ద్వారా తగ్గించాల్సి న అవసరం ఉందని ప్రధాని అన్నారు.

ఈ రోజు ఆమోదించిన న్యూఢిల్లీ డిక్లరేషన్ మన ఉమ్మడి సంకల్పానికి స్పష్టమైన దిశను చూపుతోంది. ఈ తీర్మానాలను స్పష్టమైన ఫలితాలుగా మార్చడం ఇప్పుడు మన బాధ్యత'అని మోడీ పేర్కొన్నారు.

# ఏ దేశానికి వ్యతిరేకం కాదు

ఏకాభిప్రాయంతోనే బ్రిక్స్ కూటమి ముందుకు సాగుతుందని, ఏ దేశానికీ వ్యతిరేకంగా పనిచేయదని ప్రధాని నరేంద్రమోడీ స్పష్టం చేశారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాన్ని ప్రధానమంత్రి శనివారం న్యూఢిల్లీలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అనేక అంతర్జాతీయ సంస్థలలో గ్లోబల్ సౌత్ దేశాలు ముందు వరుసలో ఉంటున్నప్పటికీ, నిర్ణయాధికారంలో మాత్రం వెనుకబడే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అధికారాల పిరమిడ్‌ను ప్రతి దేశానికీ గళం వినిపించే, ప్రతి సభ్యునికీ భాగస్వామ్యం ఉండే భాగస్వామ్య వేదిక గా మార్చాలని పిలుపునిచ్చారు. మానవాళి పురోగతే దీనికి కేంద్రంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధన కోసం బ్రిక్స్ సంస్కరణల రోడ్ మ్యాప్‌ను రూపొందించాలని మోడీప్రతిపాదించారు. ప్రాతినిధ్యం, ప్రతిస్పందన, నియమనిర్మాణం అనే మూడు స్తంభాలపై ఈ రోడ్‌మ్యాప్ దృష్టి సారించాలని సూచించారు. ప్రాతినిధ్యం గురించి వివరిస్తూ, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇకపై వాయిదా వేయరాదని, స్పష్టమైన కాలపరిమితితో కూడిన లక్ష్యాలతో చర్చలు జరగాలని ఆయన నొక్కిచెప్పారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలలో ఓటింగ్ హక్కులు, నాయకత్వ పాత్రలు, విధాన ప్రాధాన్యతలను కూడా ప్రస్తుత ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా మార్చాల్సి న అవసరం ఉందని ఉద్ఘాటించారు. గత 20 ఏళ్లలో బ్రిక్స్ కూటమి ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకుందని ప్రధాని మోడీ అన్నారు. సభ్య దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. "మేము ఎవరికీ వ్యతిరేకం కాదు. ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు వెళ్లే విధానంతోనే పనిచేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. భారత్ అధ్యక్షతన స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. ఈ అజెండాను సామాన్య ప్రజలతో అనుసంధానం చేసేందుకు దేశవ్యాప్తంగా దాదాపు 30 నగరాల్లో 350కి పైగా సమావేశాలు నిర్వహించినట్లు ఆయన వివరించారు.

## వారం - వర్జ్యం

**13-09-2026, ఆదివారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం,**
**వర్ష ఋతువు, శుక్లపక్షం, పుబ్బ కార్తె,**
తి.విదియ ఉ.7.29, న.హస్త మ.1.10
వ.రా.9.26 - రా.11.06
దు.సా.4.29 - సా.5.18
రాహు సా.4.30 - సా.6.00,
శుభ స. ఉ.8.00 - ఉ.9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రభుత్వపరమైన పనులు సానుకూల పడతాయి. బహుముఖంగా మీ ప్రతిభా పాటవాలు వెలుగు చూస్తాయి.

**వృషభం :** ఆర్థిక మార్గాలు మెరుగ్గా ఉంటాయి. రాజకీయపరమైన చర్చలు సాగిస్తారు. క్రయవిక్రయాలు.

**మిథునం :** గతంలో ఆత్మీయులతో ఏర్పడి నటువంటి తగాదాలు నేడు సమసి పోతాయి. వ్యాపారస్తులకు అనుకూలం.

**కర్కాటకం :** విలువైన ఆస్తుల తాలూకా పత్రాల భద్రతా విషయమై విశేషమైన జాగ్రత్తలు పాటించాలి.

**సింహం :** ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. ఉన్నత స్థానంలోని వారు మీ నుండి సలహాలను స్వీకరిస్తారు.

**కన్య :** మిత్రబృందాలను మరింతగా విస్తరింప చేయాలనే ఆలోచనలు బలపడతాయి. శుభ ప్రదమైన చర్చలలో పాల్గొంటారు.

**తుల :** ఆర్థిక విషయ వ్యవహారాలలో తగు జాగ్రత్తలు అవసరం. క్రమశిక్షణకు ప్రాధాన్యతనిచ్చి లాభపడతారు.

**వృశ్చికం :** వృత్తి, ఉద్యోగాల పరంగా ఉపకరించే సంఘటనలు చోటు చేసుకుంటాయి. మరుపు ఎక్కువగా ఉంటుంది.

**ధనుస్సు :** మీ మాటల చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకో గలుగుతారు. విలాస వంతమైన వస్తువులను కొనుగోలు చేస్తారు.

**మకరం :** వాహనం కొనుగోలు చేసే సూచనలు గోచరిస్తున్నాయి. ప్రతి విషయంలోనూ ఆచితూచి నేర్పుగా వ్యవహరిస్తారు.

**కుంభం :** ఆర్థికపరమైన సర్దుబాట్లు నేర్పుగా చేయగలుగుతారు. కారణంలేని చికాకులు చోటు చేసుకుంటాయి. ధనలాభ సూచన.

**మీనం :** ఉచిత సలహాలు ఇచ్చేవారి వలన విసుగు కలుగుతుంది. కాంట్రాక్టుదారులకు లాభసాటిగా ఉంటుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




న్యూఢిల్లీలోని భారత మండపం ఎదుట మొక్కలు నాటుతున్న ప్రధాని మోడీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

# కలిసి నడుద్దాం

## ప్రధాని మోడీతో భేటీలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

### వాణిజ్యం, పెట్టుబడులు, పలు ద్వైపాక్షిక అంశాలపై ఉభయుల చర్చలు

### ఏడు సంవత్సరాల తర్వాత భారత్‌కు వచ్చిన చైనా అధినేత

### వాస్తవాధీన రేఖ వివాదంపై కూడా చర్చించిన మోడీ, జిన్‌పింగ్

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 12:** బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీతో జరిగిన భేటీలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, చైనా రెండు దేశాలు పరస్పరం తమ బలాల నుంచి పూర్తిస్థాయిలో నేర్చుకోవడంతో పాటు ఒకరికొకరు సహకరించుకోవాలని అన్నారు. ఏడు సంవత్సరాల తర్వాత తొలిసారిగా భారత్‌కు వచ్చిన జిన్‌పింగ్ ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా జరిగిన ఈ భేటీలో సరిహద్దు అంశాలు, వాణిజ్యం, పెట్టుబడులు తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తన పుట్టినరోజు జూన్ 15న భారత్‌కు రావాలంటూ ఆహ్వానం అందిందని జిన్‌పింగ్ తెలిపారు. ఇప్పటివరకు తాను, ప్రధాని మోడీ 21 సార్లు సమావేశమయ్యామని, ఈ సమావేశాల ద్వారా భారత్-చైనా సంబంధాలను స్థిరమైన అభివృద్ధి దిశగా నడిపేందుకు పలు కీలక ఏకాభిప్రాయాలు కుదిరాయని చెప్పారు.చైనా ఎప్పుడూ భారత్‌తో సంబంధాలను వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో చూస్తుంది. రెండు దేశాల జాతీయ పరిస్థితులు భిన్నంగా ఉన్నప్పటికీ పరస్పరం ఒకరి బలాల నుంచి మరొకరం పూర్తిస్థాయిలో నేర్చుకోవచ్చు. ఒకరికొకరం మద్దతు ఇచ్చుకుంటూ, కలిసి విజయాలు సాధించి, ఉమ్మడి అభివృద్ధిని కొనసాగించాలని జిన్‌పింగ్ పేర్కొన్నారు.

ప్రపంచ శాంతికి కలిసి పనిచేయాలి

శతాబ్ద కాలంలో ఎన్నడూ చూడని విధంగా ప్రపంచంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయని జిన్‌పింగ్ అన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో కీలక సభ్యులుగా భారత్, చైనాలపై గణనీయమైన బాధ్యత ఉందన్నారు. మానవాళి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ రెండు దేశాలు కలిసి పనిచేయాలి. ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధి, సుసంపన్నతకు మరింత సానుకూల శక్తిని అందించాలి. సమానత్వంతో కూడిన, క్రమబద్ధమైన బహుళ ధ్రువ ప్రపంచాన్ని ప్రోత్సహించాలని జిన్‌పింగ్ అన్నారు. మోడీ-జిన్‌పింగ్ భేటీలో భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాలపై సమగ్ర సమీక్ష జరిగింది. ముఖ్యంగా వాస్తవాధీన రేఖ అంశం చర్చల్లో కీలకంగా ఉంది. సరిహద్దులో శాంతి, ప్రశాంతత నెలకొనడం భారత్-చైనా సంబంధాల విస్తృత అభివృద్ధికి అత్యంత అవసరమని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. మరోవైపు, సరిహద్దు వివాదాన్ని ద్వైపాక్షిక సంబంధాల్లోని ఇతర అంశాల నుంచి వేరుగా పరిష్కరించాలన్నది చైనా సంప్రదాయ వైఖరిగా ఉంది.

అజిత్ దోవల్-వాంగ్ యీ చర్చలు

మోడీ-జిన్‌పింగ్ సమావేశానికి ముందు ఇరు దేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు కూడా జరిగాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ గత నెల చివర్లో బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు.ఈ చర్చల్లో సరిహద్దు విభజన, సరిహద్దు ప్రాంతాల్లో పరస్పర సహకారం, వాస్తవాధీన రేఖ వెంబడి శాంతి, ప్రశాంతతను కొనసాగించాల్సి న అవసరం వంటి అంశాలు చర్చకు వచ్చాయి.భారత్-చైనా సరిహద్దు చర్చలకు అజిత్ దోవల్, వాంగ్ యీ ప్రత్యేక ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. 2003లో ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇరు దేశాల మధ్య సుమారు 3,488 కిలోమీటర్ల సరిహద్దు వివాదానికి పరిష్కారం కనుగొనడం ఈ చర్చల ప్రధాన లక్ష్యం.



శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బిఆర్ఎస్ మాక్ అసెంబ్లీలో కెటిఆర్, తలసాని తదితరులు

# ఏ వంద రోజుల్లో?

చేస్తామని చెప్పామని, అయితే ఏ 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పలేదంటూ తలసాని వ్యాఖ్యానించారు.ఐదేళ్లు కాదు.. 25 ఏళ్లు మేమే ఉంటాం. ఎప్పుడో ఒకప్పుడు హామీలు అమలు చేస్తాం అంటూ మాక్ అసెంబ్లీలో తలసాని వ్యంగ్యంగా మాట్లాడారు. సభలో సభ్యులు సబ్జెక్ట్ తప్ప ఏమైనా మాట్లాడుకోవాలని సూచించారు. నాకు చాలా సమస్యలు ఉన్నాయి. ఢిల్లీతో సమస్య, పార్టీలో సమస్య, ఆఖరికి బీఆర్ఎస్‌తో కూడా ప్రశాంతత లేదు అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో ఒకటైన కాళేశ్వరం ప్రాజెక్టును ఇందిరాగాంధీ నిర్మించారని చెప్పడం ద్వారా తలసాని శ్రీనివాస్ సభలో నవ్వులు పూయించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీలో ఇరిగేషన్ శాఖ మంత్రి పాత్రలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మాకు బ్యాంకు చెక్కులు అంటే అర్థం అవుతుంది.. క్యూసెక్కులు అంటే మాకు అర్థం కాదు" అంటూ సాగునీటి శాఖ పనితీరుపై సెటైర్ వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని, అందుకే తాము ఆ పని చేయబోమని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సబ్జెక్ట్ నేను ప్రిపేర్ అయి సభకు రాలేదు. సలహాదారుడు ఆదిత్యనాథ్ దాస్ చెప్పినట్లు నేను మాట్లాడుతాను. బ్యాంకు చెక్కులు అంటే అర్థం అవుతుంది.. క్యూసెక్కులు అంటే మాకు అర్థం కాదు అంటూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తాను ఆర్మీలో పనిచేసినందున డిసిప్లిన్ గురించి తెలుసునని పేర్కొన్న పల్లా.. ముఖ్యమంత్రి బూతుల ప్రభావం ఎక్కువైందంటూ సెటైర్ వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పేరు వస్తుందని, కేసీఆర్‌కు పేరు వచ్చే పనులు తాము చేయబోమని పల్లా వ్యాఖ్యానించారు. అలాగే మేడిగడ్డ బ్యారేజీని కూడా తాము బాగు చేయబోమంటూ వ్యంగ్యంగా అన్నారు. తమ్మిడిహట్టి ప్రాజెక్టును 2004లోనే నిర్మించాలని అనుకున్నామని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అయితే మహారాష్ట్రలో తమ ప్రభుత్వమే ఉన్నప్పటికీ అనుమతి ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. దశాబ్దం ఆలస్యమైన తమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మిస్తామని పేర్కొన్నారు. కెఆర్ఎంబి, జిఆర్ఎంబీ సమావేశాల్లో సలహాదారుడు ఆదిత్యనాథ్ దాస్ ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ సంతకం పెడతానని పల్లా వ్యంగ్యంగా అన్నారు. దిజూది సమావేశాన్ని కాంగ్రెస్ సమావేశంగా భావించానని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి చంద్రబాబు కారణమని పల్లా పేర్కొన్నారు."చంద్రబాబు నాయుడు రుణం మేము తీర్చుకోవద్దా?" అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు. కర్ణాటకలో 40 శాతం కమిషన్ తీసుకుంటే.. తెలంగాణలో 30 శాతం కమిషన్ తీసుకుంటున్నామని, అందులో తప్పేముందని పల్లా సెటైర్ వేశారు. కాంగ్రెస్ అంటేనే ఫ్యామిలీలా కూటమి అని వ్యాఖ్యానించారు. చివరగా మాకు సోనియా గాంధీ సర్టిఫికెట్ ఉంటే చాలు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో రెండు కోట్ల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌దేనని జగదీశ్‌రెడ్డి అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను నింపామని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించిన ఘనత కూడా కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి తొమ్మిది జిల్లాలకు నీరు అందిందని జగదీశ్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ మినహా మిగిలిన ఉమ్మడి జిల్లాలకు కాళేశ్వరం నీళ్లు పారాయని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాల్లో కాళేశ్వరం నీళ్లు పొంగిపొర్లాయని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్లోరైడ్‌ను తరిమికొట్టామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కాలువల నిర్వహణపైనా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఎడమ కాలువ గేట్లను తెరిచిన తర్వాత కుడి కాలువ గేట్లు తెరిచేవారని.. ప్రస్తుతం కుడి కాలువ గేట్లు తెరిచిన తర్వాత ఎడమ కాలువ గేట్లు తెరుస్తున్నారని అన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి వెలుగొండ ద్వారా ఆంధ్రప్రదేశ్ అక్రమంగా నీటిని తరలించుకుపోతోందని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. కన్నెపల్లి నుండి వేల క్యూసెక్కుల నీరు సముద్రంలో కలిసిందని, ఇప్పటికే 150 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిందని పేర్కొన్నారు.



గంగా నది ఉప్పొంగడంతో శనివారం జలమయమైన కోల్‌కతాలోని కాళీఘాట్ ప్రాంతం

# రాజీనామా ఎవరు చేయాలి?

22ఏ నిషేధిత భూములపై స్వల్పకాలిక చర్చలో సమాధానం చెబుతూ తాను ప్రతి నెల ఒక్క రూపాయి జీతం మాత్రమే తీసుకుంటూ, పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. ప్రజల కోసం పనిచేస్తున్న నన్ను రాజీనామా చేయమంటారా? అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి 21 కోట్ల రూపాయలు పొంది అసెంబ్లీకి ప్రజలకు మొఖం చాటేసిన కేసీఆర్. రాజీనామా చేయాలా? అని హరీష్ రావును ప్రశించారు.అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్. ఇప్పుడు చేస్తున్నది కూడా అదే. మీ బ్లాక్‌మెయిల్‌కు, తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రభుత్వం ఇది కాదు అని స్పష్టం చేశారు. పొంగులేటి.. పొంగు అంటూ ఎందుకు భయపడుతున్నారు? అని ప్రశ్నించారు. తన పేరును పదేపదే ప్రస్తావిస్తూ పొంగులేటి.. పొంగు అంటూ ప్రతిపక్ష నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి ఘాటుగా స్పందించారు. రాష్ట్ర శాసనసభలో శనివారం 22ఎపై జరిగిన చర్చలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తనదైన శైలిలో ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చారు. ప్రతిపక్షా నాయకులు హరీష్ రావు, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు చేసిన వ్యాఖ్యలను వీడియో క్లిప్పింగ్ లో చూపించి ప్రతీ అంశానికి ఆధారాలతో సహా సమాధానం ఇచ్చారు. 22ఏ లో పెట్టి రిజిస్ట్రేషన్లు నిలిపి వేసారని చేసిన ఆరోపణలు రిజిస్ట్రేషన్ జరిగిన తేదీలను చదివి వినిపించారు. అలాగే, గత ప్రభుత్వంలో 22ఏ లో భూమికి జిహెచ్ఎంసి/ హెచ్ఎండిఏ / డిటిసిపి లే అఔట్ లకు ఇచ్చిన అనుమతులకు సంబంధించి రంగారెడ్డి సంగారెడ్డి జిల్లాల్లో ఉదాహరణలు ఇచ్చారు. 22ఏ వల్ల గడిచిన 3 మాసాలల్లో రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గిందనే ప్రచారానికి గత ఏడాదికి ఈ ఏడాదికి ఏప్రిల్ నుంచి ఆగష్టు వరకు 1,359 కోట్ల రూపాయలు పెరిగిందని నెలల వారీగా పెరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలను సభ ముందుంచారు. అలాగే, 22ఏ అనేది ఈ రోజు పుట్టింది కాదు. 2007 నుండి ఉమ్మడి రాష్ట్రంలో వచ్చిందని అదే వ్యవస్థను బి.ఆర్.ఎస్. ప్రభుత్వం కూడా కొనసాగించిందని అన్నారు. ధరణి వచ్చిన తరువాత తయారుచేసిన 22ఏ జాబితనే హై కోర్ట్ ఆదేశాల మేరకు డిసెంబర్ 3, 2025న ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసే సమయములో పొరపాటు జరిగింది. దాన్ని సరిదిద్దడం జరిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఉన్న 22ఏ సమస్యను పదేండ్లు అధికారంలో ఉన్నవాళ్ళు పరిష్కరించి ఉంటే ఈ రోజు ఈ సమస్య వచ్చి ఉండేది కాదన్నారు. దొంగే పోలీస్ ను పట్టుకొని దొంగా... దొంగా... అని అరిచినట్టుగా ఉందంటూ బీఆర్ఎస్ నేతలను దుయ్యబట్టారు. సిఎస్ 7, ఎస్ 14లపై కూకట్ పల్లి ఎం.ఎల్.ఏ. మాధవరం కృష్ణ రావు, మాజీ ఎంఎల్ఏ జయప్రకాశ్ నారాయణ, మాజీ మంత్రి హరీష్ రావు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేసారని వాటిని వీడియో లో వివరిస్తూ ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తే హరీష్ రావు మాత్రం ఈ సమస్యను వక్రీకరిస్తున్నారని ఈ ప్రభుత్వమే 22ఏ లో పెట్టిందని చేసిన ఆరోపణలకు ఆధారాలతో సహా 2013 నుంచి 22ఏ లో ఉన్నాయని గజిట్ నోటిఫికేషన్ ను చూపించారు. హైదర్‌నగర్, శంషాగుడ గ్రామాలలోని భూములను నిషేధిత ఆస్తుల జాబితాలో కొత్తగా చేర్చారంటూ వచ్చిన కథనాలు, ఆరోపణలపై వాస్తవాలు ఇవేనంటూ వివరించారు. హైదర్‌నగర్ సర్వే నెం. 145 (220.18 ఎకరాలు): సిబిసిఐడి, వసంతనగర్, భగత్ సింగ్ నగర్, పటేల్ నగర్ మొదలైన కాలనీలు ఉన్న ఈ భూమి సిఎస్ 14 పరిధిలోకి వస్తుంది. ఇవి పాత రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభు త్వ/పైగా భూములు. సుప్రీంకోర్టులో సివిల్ అప్పీల్ నెం. 1867/2023 పెండింగ్‌లో ఉన్నందున, 2013 నుండి ఇవి పిఒబి జాబితాలోనే ఉన్నాయి. హైదర్‌నగర్ సర్వే నెం. 163 (175.06 ఎకరాలు): దుర్గామాత సొసైటీ, డ్రీమ్ వ్యాలీ, రామ్ నరేష్ కాలనీలు ఉన్న ఈ భూములు కూడా సిఎస్ 14 కింద ప్రభుత్వ భూములే. ఈ సర్వే నంబరు 2013 నుండి ఆన్‌లైన్ 22ఎ జాబితాలోనే కొనసాగుతోంది. హైదర్‌నగర్ సర్వే నెం. 172 (196.20 ఎకరాలు): త్రివేణి, శ్రీనివాస్, సిటిజన్ కాలనీ, జయ నగర్, బృందావన్ ఎస్టేట్స్ ఉన్న ఈ భూమి కూడా సిఎస్ 14 పరిధిలోనిదే. ప్రభుత్వ ప్రయోజనాలు, భూముల పరిరక్షణార్థం పాత 22ఎ రిజిస్టర్ ప్రకా రమే జాబితాలో కొనసాగుతోంది. శంషాగుడ సర్వే నెం. 57 (274.33 ఎకరాలు): జన్మభూమి కాలనీ, ఇందిరా హిల్స్, వివేకానంద నగర్ ఉన్న ఈ భూమి సిఎస్ 7 పరిధిలోకి వస్తుంది. సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పి కేసులు పెండింగ్‌లో ఉన్నందున 2013 నుండి ఈ సర్వే నంబరు పిఒబి జాబితాలోనే ఉంది. కూకట్‌పల్లి మండలం పరిధిలో ఏ ఒక్క పట్టా భూమిని కూడా 22ఎ నిషేధిత జాబితాలో కొత్తగా చేర్చలేదు. రికార్డుల నవీకరణలో భాగంగా పాత ఆంక్షలను మాత్రమే ఆన్‌లైన్ 22ఎ యాక్టివ్ లిస్ట్‌లో పునరుద్ధరించారు తప్ప కొత్తగా ఎలాంటి మార్పులు చేయలేదు. 22ఏ పై వాస్తవాలు:-2023 డిసెంబర్ 7 తేదిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి వివిధ రకాల భూములు కలుపుకొని 22ఏలో 1,02,52,690 ఎకరాలు ఉండగా, ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 1,02,05,250 ఎకరాలు ఉంది.

అంటే 47,440 ఎకరాలు తగ్గింది. వాస్తవం ఇలా ఉంటే 22ఏ లక్ష కోట్ల ఎకరాలు చేర్చారంటు విషప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశించారు. మిడిమిడి జ్ఞానంతో మాట్లాడి ప్రజలను అనవసరమైన ఆందోళనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 40 వేల ఇంటి స్థలాలు 22తి లో చేర్చామనడం నిజం కాదని స్పష్టం చేశారు. ఇక్కడ సమస్య 40 వేల ఎకరాలు కాదని, 40 వేల ఇంటి స్థలాలు మాత్రమేనని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025 డిసెంబర్‌లో జరిగిన డేటా అప్‌డేషన్ సమయంలో ఇంటి నంబర్‌తో పాటు లబ్ధిదారుడి పేరును కూడా రికార్డులో చేర్చడం వల్ల సాంకేతిక సమస్య తలెత్తిందని వివరించారు.



## మధుయాష్కితో ఎఐపిసి రాష్ట్ర ప్రతినిధుల భేటీ

హైదరాబాద్,సెప్టెంబరు 12,ప్రభాతవార్త: ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌చైర్మన్ గా నియమితులైన మాజీ పార్లమెంట్ సభ్యులు మధు యాష్కిగౌడ్‌ని తెలంగాణ స్టేట్ యూనిట్ ప్రతినిధులు శనివారం బంజారా హిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మధు యాష్కికి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెషనల్ కాంగ్రెస్ ను బలోపేతం చేయడం, రాష్ట్రస్థాయిలోని వివిధ రంగాల్లోని వృత్తి నిపుణులు, మేధావులను కాంగ్రెస్ పార్టీకి అనుసంధానం చేసే విషయాలపై వారికి మధుయాష్కి సూచనలు, సలహాలు అందించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతాన్ని అడ్డుపెట్టుకొని చేస్తున్న విభజన రాజకీయాలను అడ్డుకట్ట వేసేలా మేధావి వర్గాలను ఒకే వేదికపై తీసుకురావాలని సూచించారు.

## వచ్చే వారం తెలంగాణ భవన్‌కు కెసిఆర్

హైదరాబాద్,సెప్టెంబరు 12,ప్రభాతవార్త: తెలంగాణ భవన్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. అసెంబ్లీ సమావేశాలు జరిగిన తీరుపై చర్చించారు. వచ్చే వారం తెలంగాణ భవన్‌కు కేసీఆర్ వచ్చి రాష్ట్ర కమిటీ సమావేశానికి హాజరుకానున్నారు.

## గాంధీభవన్‌లో అందుబాటులో ఉండనున్న అధికార ప్రతినిధులు : పిసిసి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త: టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ సూచనల మేరకు గాంధీభవన్‌లో నలుగురు అధికార ప్రతినిధులు ఉండేలా ఏర్పాటు చేశారు. ఈమేరకు టిపిసిసి మీడియాకమిటీ చైర్మన్ చామలకిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు నలుగురు డ్యూటీలో ఉండేలా పనివిభజన చేస్తూ జాబితాను వారి ఫోన్‌నెంబర్‌లను విడుదల చేశారు. సోమవారం కె.రవళిరెడ్డి, ,బండారు శ్రీకాంత్.అవేలి దామోదర్,శ్రీరంగం సత్యం, మంగళవారం ధరావత్‌వెంకన్న నాయక్, బొజ్జసంధ్య, మేడ రవిచంద్ర, మానవతరాయ్, బుధవారం కృష్ణతేజ, కల్వల సుజత, లింగంయాదవ్, జహీర్ అక్తర్, గురువారం చీటిఉమేష్‌రావు, ఇందిరాశోభన్, యోగేష్‌రెడ్డి, కొనగల్‌మహేష్, శుక్రవారం మేనేని రోహిత్‌రావు, జ్ఞానసందర్,నూక కిరన్‌యదవ్, లోకేష్‌యాదవ్ శనివారం రామిశెట్టి నరేందర్, సయ్యద్ నిజామోద్దిన్,చలగాని దయాకర్, మద్ది శ్రీనివాస్‌రెడ్డి.

## జాతీయ లోక్‌అదాలత్‌లో 4.20 లక్షల పెండింగ్ కేసులకు మోక్షం

హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శుక్రవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టులో పెండింగ్ కే సుల పరిష్కారం కోసం చేబట్టిన చర్యల్లో నాలుగు లక్షల 20 వేల 626 కేసులకు మోక్షం లభించింది. లక్షా 40 వేల 565 పెండింగ్ కేసుల కుగానూ ఈ కేసులు పరిష్కారం అయ్యాయని డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి, మెంబర్ కార్యదర్శి పంచాక్షరి ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఈ లోక్ అదాలత్ జరిగిందని ఆయన తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కౌన్సిల్‌లో మాట్లాడా

### ప్రభుత్వం మూడేళ్లలో ఎంతమేర ఫీజు బకాయిలను విడుదల చేసింది: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

### బిజెపిలో చేరిన పలువురు



బిజెపిలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న పార్టీ రాష్ట్ర చీఫ్ ఎన్.రాంచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త: అసెంబ్లీ సమావేశాలలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాట్లాడారని అయితే బిజెపి చేస్తున్న ఉద్యమానికి ప్రభుత్వం స్పందించడంతో.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఎందుకు మాట్లాడలేదని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించడం పొరపాటు అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. శనివారం సూర్యాపేట, హైదరాబాద్ నుంచి పెద్దఎత్తున భారతీయ జనతా పార్టీలో చేరికలు జరిగాయి. ఇటీవలే రిటైర్డ్ డిసిపి శ్రీనివాస్‌తో పాటు సూర్యాపేట జిల్లా నుంచి డాక్టర్లు, యువత పెద్దఎత్తున చేరారని తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గతంలో తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలోనే విద్యార్థుల సమస్యలపై మండలిలో మాట్లాడానని, 2017 జనవరి 4న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలో విద్యార్థుల పక్షాన నేను మాట్లాడిన విషయం అసెంబ్లీ, మండలి రికార్డుల్లో ఉందన్నారు గతంలో బిజెపి మాట్లాడలేదని సిఎం చెప్పడం సరికాదన్నారు. రాజశేఖర్ రెడ్డి ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకుని వచ్చిన తరువాత, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉంటూనే ఉన్నాయన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉంటే.. మొదటి ఎనిమిదేళ్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి, చివరి రెండేళ్లలో సుమారు రూ.5 వేల కోట్ల బకాయిలు పెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్ల అవుతుందని, పాత బకాయిలను అలాగే పెండింగ్‌లో ఉంచి.. కొత్త బకాయిలను కూడా కలిపి ఇప్పుడు మొత్తం సుమారు రూ.15 వేల కోట్ల వరకు బకాయిలు చేరుకున్నాయన్నారు. విద్యార్థులకు న్యాయం జరగాలన్నదే మా డిమాండ్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారో స్పష్టంగా చెప్పకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం అసలు సమస్యను పక్కదారి పట్టిస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై విచారణ చేయండి. మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. విద్యాశాఖను కూడా సిఎం రేవంత్ రెడ్డే తన దగ్గర పెట్టుకున్నారన్నారు. కానీ తెలంగాణ విద్యావ్యవస్థను మాత్రం పూర్తిగా ధ్వంసం చేశారన్నారు. తెలంగాణకు నూతన విద్యావిధానం తీసుకొస్తామని చెప్పి ఒక కమిటీ వేశారని, ఆ తర్వాత ఆ కమిటీ చైర్మనే రాజీనామ చేశారన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో చెల్లించకపోతే తెలంగాణ విద్యావ్యవస్థ బాగుపడదన్నారు.

# గణేశ ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం కలగకూడదు

### మండపాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నాం

### కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

### గణేశ్ ఉత్సవంపై మండలిహాల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త: హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గణేశ్ ఉత్సవాలు పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. శనివారం శాసనసభ ఆవరణలోని మండలి సమావేశ మందిరంలో హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షి ంచారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, నగర ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), హైడ్రా కమిషనర్లు, పోలీసు ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగేందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలని కోరారు. ఈ ఉత్సవాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని నిర్వాహకులకు తెలిపారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామని చెప్పారు. నిర్వాహకుల సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి తానే సమీక్ష నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. గణేశ్ మండపాలకు అతిథులను ఆహ్వానించిన సందర్భాల్లో ఆ వివరాలను నిర్వాహకులు స్థానిక కమిషనరేట్‌కు అందించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు అనుకోని పరిణామాలు జరిగినప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు నిర్వాహకులు అందించే సమాచారం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని, అయితే, మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని చెప్పారు.

ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని అన్నారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నిమజ్జన ప్రక్రియ సాఫీగా సాగడానికి చెరువుల వద్ద చుట్టూ క్రేన్లను ఏర్పాటు చేయడానికి అనుగుణంగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



శనివారం మండలి సమావేశ మందిరంలో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్ తదితరులు

# అసెంబ్లీ ముట్టడికి స్వచ్ఛ ఆటో కార్మికుల యత్నం

హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త: తమ డిమాండ్ల సాధనకోసం స్వచ్ఛ ఆటో కార్మికులు శనివారం నాడు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. మూడు నెలలుగా సర్కారు తమకు వేతనాలు చెల్లించడం లేదని ఆరోపిస్తూ స్వచ్ఛ ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో అసెంబ్లీ ముట్డడికి బషీర్‌బాగ్ నుంచి ర్యాలీగా బయలుదేరగా ఎల్‌బి స్టేడియం వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆటో కార్మికులు, పోలీసుల మధ్య తోపు లాట జరిగింది. పోలీసులను దాటుకుని అసెంబ్లీ వైపు వెళ్లేందుకు స్వచ్ఛ ఆటో కార్మికులు చేసిన ప్రయత్నాలను భద్రతా సి బ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆటో కార్మికులు మాట్లాడుతూ మూడు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. వేతనాలు ఇవ్వకుంటే తాము ఎలా బతకాలని వారు సర్కారును కోరారు.

బస్తీలలో చెత్త సేకరణ అంటే సామాన్య విషయం కాదని, నిత్యం దుర్వాసన మధ్య వుండాల్సి వుంటుందని, ఈ క్రమంలో తమలో చాలా మంది అనారోగ్యం పాలై, ఆసుపత్రుల్లో చేరాల్సి వస్తోందని వారు తెలిపారు. అయినప్పటికీ ప్రజారోగ్యం కోసం తాము కష్టపడుతున్నామని వారు తెలిపారు. తమ కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి వెంటనే ఆగిపోయిన వేతనాల ను విడుదల చేయాలని స్వచ్ఛ ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. దీంతో పాటు గ్రేటర్ పరిధిలో చెత్త తీసే కాంట్రాక్ట్‌ను రాంకీ సంస్థకు అప్పగి ంచాలని సర్కారు యోచిస్తోందని, ఇది అన్యాయమని, దీనివల్ల తమ బతుకులు వీధినపడతాయనివ వారు అన్నారు. ఇప్పుడున్నట్లుగానే తమతో నే చెత్త ఏరివేత పనులను చేబట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# పోలీసుల పిల్లలను డ్రగ్స్‌కు దూరంగా తీర్చిదిద్దడం లక్ష్యం

### గ్రేహౌండ్స్ విభాగంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అకడమిక్ బ్లాక్ శంకుస్థాపనలో డిజిపి ఆనంద్



శనివారం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అకాడమిక్ బ్లాక్-1 నిర్మాణానికి భూమి పూజ చేసిన తర్వాత ప్రసంగిస్తున్న డిజిపి సివి ఆనంద్

హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త: పోలీసు సిబ్బంది తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు డ్రగ్స్‌కు దూరంగా వుంచి, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడం పోలీసు సంక్షేమంలో భాగమని డిజిపి ఆనంద్ అన్నారు. మంచిరేవులలో గల గ్రేహౌండ్స్ విభాగంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అకాడమిక్ బ్లాక్ 1 నిర్మాణానికి డిజిపి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఉన్నత ఆశయాలతో ఏర్పా టవుతున్న విద్యా సంస్థగా తెలిపారు. ఇందులో చదివిన వారు గొప్పవారు కావాల్సి న అవసరం వుందని, భవిష్యత్తులో ఈ విద్యా సంస్థ దేశానికే ఒక రోల్ మాడల్‌గా నిలు స్తుందని డిజిపి తెలిపారు. అంతర్జాతీయ ప్రమా ణాలతో రూపు దిద్దుకుంటున్న ఈ పాఠశాల మొదటి దశలో 120 మంది విద్యార్థులతో ప్రారంభమమై ప్రస్తుతం 360 మందికి చేరిందని ఆయన తెలిపారు. వచ్చే ఏడాదికి ఈ స్కూల్‌లో 700 నుంచి 720 మంది వరకు చేరే అవకాశం వుందని డిజిపి తెలిపారు. ఈ పాఠశాలలో చ దివే విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాల్లో చురుకుగా వుండేలా చూడాలని అధ్యాపకులను ఆయన కోరా రు. విద్యార్థులను డ్రగ్స్ తో పాటు ఎలాంటి వ్యస నాలను దరిచేరకుండా చూడాలని ఆయన తెలిపారు. పోలీసుల పిల్లలతో పాటు సామాన్యుల పి ల్లలకు కూడా ఇందులో అవకాశం వుంటుందని డిజిపి తెలిపారు. 50 శాతం సీట్లు సాధారణ విద్యార్థులకు కేటాయిస్తామని ఆయన తెలిపారు. కాగా ఈ స్కూల్ ప్రత్యేకత గురించి డిజిపి వివరిస్తూ ఒకే ప్రాంగణంలో ఇంటర్ వరకు చదువుకునే అవకాశం వుండడమని తెలిపారు. రానున్న రెండు, మూడేళ్లలో ఈ విద్యా సంస్థ అత్యున్నత ప్రమాణాలతో వున్నదిగా నిలుస్తుందని డిజిపి అన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల డి జి మహేష్ భగవత్, గ్రే హౌండ్స్ డిజి అనిల్ కుమార్, సైబరాబాద్ కొత్వాల్ రమేష్, పి అండ్ ఎల్ ఐజి గజారావు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 1980 రెట్రో ఫొటో ఎడిటింగ్ ట్రెండ్‌పై అప్రమత్తంగా ఉండాలి

### టిజిసిఎస్‌బి హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా వైరల్‌గా మారుతున 1980 రెట్రో ఫోటో ఎడిటింగ్" ట్రెండ్‌పై ప్రజలు అప్రమత్తం గా వుండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) హెచ్చరించింది. ఈ నెపంతో సైబర్ నేరగాళ్ల సైబర్ నేరాలకు పాల్పడే అవ కాశం వుందని టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

సాధారణ ఫోటోలను 1980 నాటి రె ట్రో ఫోటోలుగా మారుస్తామంటూ ఆకర్షణీయమైన ప్రకటనలు, వాట్సాప్ సహా సోషల్ మీడియా ద్వారా ప్ర కటనలు ఇస్తూ లింకులు పంపుతున్నారని ఆమె తెలిపారు. వీటిని క్లిక్ చేయాలని కోరుతున్నారని టిజిసిఎస్‌బి డైరక్టర్ తెలిపారు. ఇలాంటి లింకులను క్లిక్ చేస్తే వెంటనే ఫోన్‌ల లో వున్న సమాచారం అంతా నేరగాళ్ల చేతికి వెళ్లిపోతుందని, బ్యాంకుల్లో వున్న నగదు ఖాళీ అవుతుందని ఆమె తెలిపారు. దీంతో పాటు ఎలాంటి ఓటిపిలు వచ్చినా ఎవరితోనూ పంచుకోవద్దని ఆమె తెలిపారు. ఇదే సమయంలో అనుమానాస్పద యాప్‌లకు, ఎపికె ఫైల్స్‌కు దూరంగా వుండాలని ఆమె సూచించారు. దొరికిన ప్రతీ అవకాశాన్ని సైబర్ నేరగాళ్ల తమకు అనుకూలంగా మార్చుకుంటున్న తరుణంలో అప్రమత్తంగా వుండడం ఒక్కటే నివారణ మార్గమని శిఖా గోయల్ తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద సమాచారం వచ్చినా వెంటనే 1930 లేదా నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ లేదా సైబర్ క్రైమ్ వాట్సాప్ నంబర్ 8712672222కు వెంటనే ఫిర్యాదు చేయాలని శిఖా గోయల్ కోరారు.

## డిగ్రీ కాలేజీల పోస్టులకు సంబంధించి టిజిపిఎస్ నోటిఫికేషన్‌లు రద్దు

హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిగ్రీ కాలేజీల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి సంబంధించి 2022 డిసెంబర్ నెలలో విడుదల చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్‌ని కమిషన్ రద్దు చేసింది. 33/2022 నెంబర్‌తో 2022 డిసెంబరు 31న జారీచేసి ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై కమిషన్ సమగ్రంగా చర్చించి, అన్ని పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత 544 ఖాళీల కోసం ఇచ్చిన ఈ బ్రీఫ్ నోటిఫికేషన న్ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది.ఈ నిర్ణయానికి అనుగుణంగా కొత్త రోస్టర్ ద్వారా త్వరలోనే సరికొత్త నోటిఫికేషన్ విడుదల చేయబడుతుందని అభ్యర్థులందరికీ టిజిపిఎస్‌సి తెలియజేసింది. ఈ సమాచారాన్ని టిజిపి ఎస్ సి కార్యదర్శి వెబ్ నోట్ ద్వారా తెలియజేశారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ సందర్శించి తెలుసుకోవచ్చు.

# త్వరలో బిసి రక్షణ చట్టం రూపకల్పన

### 100 కొత్త కాలేజీ హాస్టళ్ల మంజూరుకు ఆమోదం

### విడతలవారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు


### బిసి సంక్షేమానికి సిఎం రేవంత్ కీలక హామీలు

### ఎంపి ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో సిఎంతో బిసి నేతల భేటీ

హైదరాబాద్,సెప్టెంబరు 12,ప్రభాతవార్త: రాష్ట్రంలో బీసీ విద్యార్థులు, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో బీసీ సంఘాల నాయకులు అసెంబ్లీ ఛాంబర్‌లో ముఖ్యమంత్రిని కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. బీసీ నేతలు కోరిన డిమాండ్లపై సీఎం సానుకూలంగా స్పందిస్తూ తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ తరహాలోనే తెలంగాణలోనూ బలమైన ఖీబీసీ రక్షణ చట్టంఖీ తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సీఎం ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ విద్యార్థుల వసతి కొరతను తీర్చేందుకు కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్లను తక్షణమే మంజూరు చేయడానికి ఆమోదం తెలిపారు. హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించేందుకు వీలుగా హైడ్రా ద్వారా స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ, ఖాళీ స్థలాలను గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను సూచించారు.

**ఫీజు బకాయిల విడుదల**

కాలేజీల్లో నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను త్వరలోనే దశలవారీగా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. బీసీలలోని అత్యంత వెనుకబడిన, సంచార జాతుల హక్కుల రక్షణతో పాటు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల దాదాపు 4 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికేట్లు కాలేజీల్లో నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆర్.కృష్ణయ్య ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మల్లేష్ యాదవ్, నీలా వెంకటేష్, జిల్లాపల్లి అంజి, సి. రాజేందర్, పర్లగోళ్ల మోడీరాందేవ్, కాంగ్రెస్ నాయకులు రాములు యాదవ్, మణికంఠ, రాజు నేత, శివకుమార్ యాదవ్, నిఖిల్ పటేల్, నరేష్ గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.



శనివారం అసెంబ్లీ ఛాంబర్‌లో సిఎం రేవంత్‌రెడ్డి కలిసి వినతిపత్రం ఇస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య ఇతర బిసి నేతలు

## మిలటరీ ఆయుధాల చోరీ కేసు నిందితుడికి రిమాండు.. చంచల్‌గూడ జైలుకు తరలింపు

హైదరాబాద్,సెప్టెంబరు 12,ప్రభాతవార్త: కంటోన్మెంట్‌లోని మిలటరీ విభాగం మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి దొంగి లించిన మాజీ సైనికుడు మల్లేష్ అలియాస్ రాజును శనివారం రిమాండుకు తరలించారు. శుక్రవారం అతన్ని అరెస్టు చేయడం తెలిసిందే. ఇదే మద్రాస్ రెజిమెంట్‌లో గతంలో హవల్దార్‌గా పనిచేసిన రాజును క్రమశిక్షణారాహిత్యం కింద ఈ రిజిమెంట్ ఉన్నతాధికారులు గత జూన్ నెలలో బలవంతంగా ఉద్యోగం నుంచి తొలగించారు. 37 ఏళ్ల వయస్సు న్న తాను మరో 15 ఏళ్ల పాటు పనిచేసే అవకాశం వున్నా అనా య్యంగా పదవీ విరమణ చేయించినందుకు ఉన్నతాధికారులపై కక్ష పెంచుకున్న రాజు పక్కాగా వ్యవహరించి ఆయుధాలు, మందుగుండు సామా గ్రిని దొంగిలించడం తెలిసిందే. వీటిని నాగర్‌కర్నూలులోని తన ఇంటి ఆవరణలో గొయ్యితీసి దాచి వుంచడం విదితమే. పది రోజుల విచారణ తరువాత ఈ నేరానికి పాల్పడింది మల్లేష్ అని నిర్ధారణ అవడంతో అతన్ని భిన్న కోణాల్లో విచారించిన పోలీసులు నిజాన్ని అతని చేత అంగీక రింపచేశారు. దీని తరువాత శుక్రవారం ఆయుధాలను, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. రాజు అరెస్టు విషయాన్ని డి జిపి ఆనంద్ మీడియాకు వెల్లడించారు. కాగా రాజును శనివారం ఉదయం మేడ్చల్ కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన న్యాయ మూర్తి నిందితుడికి రెండు వారాల రిమాండు విధించారు. అనంతరం అతన్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా రాజు వద్ద స్వాధీనం చేసుకున్న మిలటరీ ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని పోలీసులు కోర్టులో డిపాజిట్ చేశారు. అక్కడి నుంచి మిలటరీ అధికారులు తగిన ఉత్తర్వులు పొందాక పోలీసులు వాటిని మద్రాస్ రెజిమెంట్ అధికారులకు అప్పగిస్తారు.

## డేటింగ్ యాప్‌లో లాభాలంటూ హైదరాబాద్‌వాసికి రూ.3.5 కోట్ల టోకరా

హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త: సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా వుండాలని పోలీసులు పదే పదే హెచ్చరిస్తున్నా మోసపోతున్న వా రి సంఖ్య పెరుగుతూనే వుంది. హైదరాబాద్‌కు చెందిన ఓ మధ్య వయస్కుడిని గుర్తు తెలియని మహిళ డేటింగ్ యాప్ పేరిట నమ్మించి మూ డు కోట్ల 35 లక్షల రూపాయలు కాజేసింది. మొదట సదరు మహిళ ఫేస్ బుక్, మెటాకు సంబంధించిన ప్రకటనలతో అమాయకులకు ఎరవేసి ంది. దీనిని నమ్మిన నగర వాసి ఒకతను ఆమెతో మాట్లాడగా తీయటి మాటలతో సదరు మహిళ బురిడి కొట్టించింది. తాను సూచించిన డేటిం గ్ యాప్‌లో పెట్టుబడులు పెడితే దండిగా లాభాలు వస్తాయని నమ్మించింది. మొదట్లో లక్షల రూపాయల నుంచి ఐదు లక్షల రూపాయల వర కు సదరు వ్యక్తి నుంచి తీసుకుని ఐదు వేల రూపాయలు, పది వేల రూపాయలు లాభాలు ఇచ్చిన ఆ మహిళ ఆ తరువాత మరింత లాభాల పే రిట 55 రోజుల వ్యవధిలో మూడు కోట్ల 35 లక్షల రూపాయలను వసూలు చేసింది. లాభాల కోసం అడిగితే మరింత డిపాజిట్ చేయాలని చెప్పింది. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు దీనిపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన టిజిసిఎస్‌బి అధికారులు బాధితుడి ఖాతా నుంచి నగదు ఏ ఖాతాకు వెళ్లిందనే దానిపై విచారణ చేబట్టారు.

## సినిమా అవకాశాల పేరుతో మోసం

### ఢీ-10 విన్నర్ రాజు అరెస్ట్

హైదరాబాద్ (మియాపూర్), సెప్టెంబరు 12, ప్రభాతవార్త: తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన ఢీ10 డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. లైంగికంగా వేధించాడని, సినిమా అవకాశాల పేరుతో మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నెల 9న కేసు నమోదు అయ్యింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితుడు రాజును అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అయితే రాజుపై కేసు నమోదు చేసిన విషయాన్ని మియాపూర్ పోలీసులు ఇన్ని రోజులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ విషయం వెలుగులోకి రావడంతో డ్యాన్స్ షో వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.



రాజు (ఫైల్)

## రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

### రాష్ట్రంలో 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు

హైదరాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త: ప్రస్తుత ఖరీఫ్ సీజనుకు సంబంధించి ఉత్పత్తి అయిన వరి ధాన్యాన్ని రైతులు సకాలంలో అమ్ముకునేలా ప్రభుత్వం పటిష్ట మైన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా తమ ఉత్పత్తులను విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు వచ్చే తెలంగాణలోని ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించాలని సర్కార్ నిర్ణయించింది. అంతేకాకుండా ధాన్యం అమ్మకాలకు సంబంధించి సొమ్ములను చెల్లింపుల నిమిత్తం ఉపయోగించే బ్యాంకు ఖాతాలతో రైతుల ఆధార్ వివరాలను అనుసంధానించే ప్రక్రియను సక్రమంగా అమలు చేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో ధాన్యం రాకకు ముందే వీటి ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను సర్కార్ ఆదేశించింది. ధాన్యం సేకరణ, రవాణా, నిల్వ, చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా రైతులకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలను అందించనున్నారు. కాగా రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, తద్వారా దాదాపు 119.57 లక్షల మెట్రిక్ టన్నుల మేర దిగుబడి అవుతుందని అంచనా. ఇందులో 65 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# మూడు దశాబ్దాల కలకు సాకారం వెలిగొండ!

సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో తానంటూ ఈ ప్రాంతానికి చరిత్రలో నిలిచిపోవాలన్న సంకల్పంతో వెలిగొండ ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో భావోద్వేగానికి గురయ్యారు. ఇన్ని పరిణామాల అనంతరం తిరిగి ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయడంతో మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలికారు. శంకుస్థాపన చేసిన నాయకుడే ప్రాజెక్టు పూర్తి చేసి ప్రారంభించడం వెలిగొండ చరిత్రలో ప్రత్యేకఘట్టంగా నిలి చింది. కృష్ణా జలాలు సొరంగాల ద్వారా నల్లమల సాగరకు చేరడంతో ఒకప్పుడు కరవుతో అల్లాడిన ప్రాంతాలు సాగునీటి ఆశలు చిగురించాయి. తాగునీటి సమస్య కూడా పరిష్కారం లభించే అవకాశం ఏర్పడింది. రైతుల పొలా లకు నీళ్లు చేరి పంటలతో పచ్చబడితే గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని ఆశాభావం ప్రజల్లోనెలకొంది. వెలిగొండ ఇక ఒక తాగునీటి ప్రాజెక్టు కాదు. మూడు దశాబ్దాల రైతు కలకు ప్రతిరూపం. కరవు నేలపై కృష్ణమ్మ జలదారలను పారించిన అభివృద్ధి చరిత్రకు ప్రతీకగా నిలిచింది. వెలిగొండ ప్రాజెక్టు ప్రత్యేక టన్నల్ బోరింగ్ మిషన్లతో 19 కిలోమీటర్ల సొరంగాల నిర్మాణం. ఆధునిక సాంకేతికతకు ప్రతీకగా వెలిగొండ ప్రాజెక్ట్ నిలిచింది. మూడు దశాబ్దాలుగా పశ్చిమ ప్రకాశం రైతాంగం ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు అనేక ప్రత్యేకతల సమాహారంగా ఆవిర్భ వించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భూగర్భంలో భారీ సొరంగాలను నిర్మించడం నుంచి కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు తరలించే విధానం వరకు ప్రాజెక్టులో అడుగడుగునా ఇంజినీరింగ్ అద్భుతాలు కనిపిస్తాయి. వెలిగొండ ప్రాజెక్టులో ప్రధాన ఆకర్షణగా నిలిచింది భారీ టన్నల్ బోరింగ్ మిషన్ల (టియంబి) వినియోగం.

మూల అల్లూరిరెడ్డి

వ్యవసాయానికే కాదు కనీసం తాగునీటికి కూడా పనికిరాని ప్రాంతాలను సస్యశ్యామలం చేసింది వెలిగొండ ప్రాజెక్ట్. ప్రారంభం నుంచి అనేక అవాంతరాలు, అడ్డంకులు, నిర్మాణంలో ఎన్నో సవాళ్లు అన్నింటినీ మించి చివరకు ప్రారంభోత్సవానికి నోచుకుంది. ఇది కలల సాకారం మాత్రమే కాదు కొన్ని తరాల ఎదురుచూపులకు అద్దంపట్టింది. పశ్చిమ ప్రాంత ప్రజలను కరవు దుర్భిక్షం, ఫ్లోరైడ్ కబళిస్తుంటాయి. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టించినా ప్రకృతి సహకరించక, తాగే గుక్కెడు మంచినీరు విషమని తెలిసినా తాగక తప్పని పరిస్థితి. నిన్నటి వరకు ఈ ప్రాంత ప్రజలది మూడు దశాబ్దాల పోరాట సాకారం కావడం, సొరంగ మార్గాల ద్వారా చిమ్ముకుంటూ కరవు నేలపై కృష్ణమ్మ పరుగులు పెడుతుంటే ఈ ప్రాంత ప్రజలు ఆనందడోలికల్లో తేలియాడుతున్నారు. కన్నీరు తప్ప.. సాగునీరు ఇరగని ఇక ప్రాంత అభాగ్యులకు కృష్ణమ్మ జలధారలు ఆనందభాష్పాలుగా మారాయి. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ కృష్ణమ్మ నీటిని నల్లమల సాగర్‌కు చేర్చే మహత్తర ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చింది. సుమారు4.70 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగు నీరు అందించే బృహత్తర పథకంగా వెలిగొండ ప్రాజెక్టు ఈ ప్రాంత ప్రజలకు వర ప్రదాయినిగా మారింది. పశ్చిమ ప్రాంతంలో కరవు దుర్భిక్షం, ఫ్లోరైడ్ సమస్య నుంచి విముక్తి కల్పించాలన్న సంకల్పం, అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ పూల సుబ్బయ్య నేతృత్వంలో నిర్వహించిన ఉద్యమాలను నెమరవేసుకున్న ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1996 మార్చి 5వ వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కొద్ది పాటి పనులతో సరిపెట్టి ఆ తర్వాత ప్రాజెక్టు పనులు ముందుకు సాగకపోవడంతో 2005లో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వెలిగొండ ప్రాజెక్టుకు భూమి పూజ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టుకు కూడా అప్పట్లో రూ. 4,000 కోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయించి పనులకు శ్రీకారం చుట్టారు. గొట్టిపడియ, కాకర్ల, సుంకేసుల డ్యామ్‌లతోపాటు రెండు సొరంగ నిర్మాణాలకు డిజైన్ చేసి జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో సొరంగ నిర్మాణ పనులు చేపట్టారు. నిర్ణీత వ్యవధిలోపు డ్యాములు పూర్తయిన సొరంగాల నిర్మాణాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. 2009 వరకు వెలిగొండ ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగాయి. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు నామమాత్రంగానే పనులతో సరిపెట్టాయి. 2019 నుంచి 24 మధ్యలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రాజెక్టు పూర్తయితుందని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్న



ఆవిరి అయిపోయాయి. 2024లో అధికారంలోకి వచ్చిన కోటమి ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి శరవేగంగా పూర్తి చేశారు. రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు దగ్గరుండి సొరంగాల నిర్మాణ మార్గాలను శరవేగంగా పూర్తి చేయించేలా నిరంతరం కృషి చేశారు. ఒకవైపు గుత్తేదారులను, మరోవైపు అధికారులతో వరస సమీక్షా సమావేశాలు నిర్వహించి చెప్పిన గడువులోపు నీర్చి మాట నిలుపుకున్న కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. గుక్కెడు నీటి కోసం వందలాది అడుగులు తవ్విన అందుకొని దుస్థితి నుంచి జలజల పారుతున్న కృష్ణమ్మను చూసి మురిసిపోతున్నారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో తానంటూ ఈ ప్రాంతానికి చరిత్రలో నిలిచిపోవాలన్న సంకల్పంతో వెలిగొండ ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో భావోద్వేగానికి గురయ్యారు. ఇన్ని పరిణామాల అనంతరం తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయడంతో మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలికారు. శంకుస్థాపన చేసిన నాయకుడే ప్రాజెక్టు పూర్తి చేసి ప్రారంభించడం వెలిగొండ చరిత్రలో ప్రత్యేకఘట్టంగా నిలిచింది. కృష్ణా జలాలు సొరంగాల ద్వారా నల్లమల సాగరకు చేరడంతో ఒకప్పుడు కరవుతో అల్లాడిన ప్రాంతాలు సాగునీటి ఆశలు చిగురించాయి. తాగునీటి సమస్య కూడా పరిష్కారం లభించే అవకాశం ఏర్పడింది. రైతుల పొలాలకు నీళ్లు చేరి పంటలతో పచ్చబడితే గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని ఆశాభావం ప్రజల్లోనెలకొంది. వెలిగొండ ఇక ఒక తాగునీటి ప్రాజెక్టు కాదు. మూడు దశాబ్దాల రైతు కలకు ప్రతిరూపం. కరవు నేలపై కృష్ణమ్మ జలదారలను పారించిన అభివృద్ధి చరిత్రకు ప్రతీకగా నిలిచింది. వెలిగొండ ప్రాజెక్టు ప్రత్యేక టన్నల్ బోరింగ్ మిషన్లతో 19 కిలోమీటర్ల సొరంగాల నిర్మాణం. ఆధునిక సాంకేతికతకు ప్రతీకగా వెలిగొండ ప్రాజెక్ట్ నిలిచింది. మూడు దశాబ్దాలుగా పశ్చిమ ప్రకాశం రైతాంగం ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు అనేక ప్రత్యేకతల సమాహారంగా ఆవిర్భవించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భూగర్భంలో భారీ సొరంగాలను నిర్మించడం నుంచి కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు తరలించే విధానం వరకు ప్రాజెక్టులో అడుగడుగునా ఇంజినీరింగ్ అద్భుతాలు కనిపిస్తాయి. వెలిగొండ ప్రాజెక్టులో ప్రధాన ఆకర్షణగా నిలిచింది భారీ టన్నల్ బోరింగ్ మిషన్ల (టియంబి) వినియోగం. భూగర్భంలో సుదీర్ఘ దూరం వరకు సొరంగాలను అత్యాధునిక యంత్రాలతో తవ్వడం ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కీలక ఘట్టంగా నిలిచింది. దాదాపు 19కిలోమీటర్ల మేర సొరంగాల నిర్మాణం ప్రాజెక్టు సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. అంతేకాదు మెతక నేలకు కెమికల్ ఫోమింగ్ వేశారు. సొరంగాల తవ్వకంలో ఎదురయ్యే మెతకనేల, బలహీన భూభాగాలను గట్టిపరిచేందుకు ప్రత్యేక ఆధునిక సాంకేతిక విధానాలను వినియోగించారు. ముఖ్యంగా కెమికల్ ఫోమింగ్ విధానం ద్వారా నేల స్వభావాన్ని నియంత్రిస్తూ టన్నల్ బోరింగ్ మిషన్ల పనితీరుకు అనుకూల పరిస్థితులు కల్పించారు. భూగర్భంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంలో ఈ సాంకేతికత కీలకంగానిలిచింది. సొరంగం తవ్విన వెంటనే దాని చుట్టూ ప్రత్యేక సిమెంట్ సెగ్మెంట్లను అమర్చడం మరోప్రత్యేకత. ఈ సెగ్మెంట్లు సొరంగ గోడలకు బలమైన రక్షణ కల్పిస్తూ నిర్మాణ స్థిరత్వాన్ని పెంచుతాయి. భూ గర్భంలో దీర్ఘకాలం సురక్షితంగా నీటిరవాణా జరిగేలా సొరంగ నిర్మాణాన్ని పటిష్ఠం చేయడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. సుంకేసుల, గొట్టిపడియ, కాకర్ల గ్యాపుల అనుసంధానంతో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం రూపకల్పన ప్రత్యేకతను సంతరించుకుంది. భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా సొరంగాలు, గ్యాపులు, కాలువల వ్యవస్థను సమన్వయం చేస్తూ కృష్ణా జలాలను నల్లమల్ల సాగరకు షేర్‌చేసేలా ప్రాజెక్టును తీర్చిద్దారు. వెలిగొండ ప్రాజెక్టులో మరోప్రధాన ప్రత్యేకత సొరంగాల ద్వారా కృష్ణా జలాలు నల్లమల సాగరకు చేరే విధానం. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో పనిచేసే సమయంలో, నీటి ప్రవాహం సొరంగాల ద్వారా నల్లమల సాగర్‌కు చేరేందుకు ప్రత్యేక పంపింగ్‌పై ఆధారపడకుండా రూపొందించిన వ్యవస్థవెలిగొండ ప్రాజెక్ట్. అదే గ్రామంలో కృష్ణా జలాలు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కొల్లంవాగు నుండి కరెంటు అవసరం లేకుండా నేరుగా నల్లమల సాగర్ రిజర్వాయర్‌లోకి నీళ్లుచేరడం ప్రత్యేకత. ఈ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం అత్యంతం అద్భుతాలే అద్భుతాలు. 1996లో శంకుస్థాపన చేయబడిన ఈ వెలిగొండప్రాజెక్టు మూడు దశాబ్దాలు గా కొనసాగి చివరికి 2026 ఆగస్టు31న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగడం ఓ ప్రత్యేకత. వెనుకబడిన ప్రాంతాల వరప్రసాదని,రైతుల ఆశాజ్యోతి వెలిగొండ ప్రాజెక్ట్ ఆచరణకు రావడం అరుదైనఅద్భుతంగా రైతులు అభివర్ణిస్తున్నారు. ●

# 'కెప్టెన్' వైపు చూపు!

శ్లేష - పంజాబ్

ఎ.వి.వి ప్రసాద్

ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు ముదరడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఐదేళ్ళుగా అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ( ఆప్) ప్రజల అసంతృప్తిని బాగానే మూటకట్టుకొంది. రాజకీయంగా ఆ పార్టీ స్థానాన్ని భర్తీచేయడానికి ఏ పార్టీ తన బలాన్ని నిరూపించుకొంటుందన్నదే ప్రస్తుతం అందరిలో ఉన్న ప్రశ్న. ఆప్ ప్రభుత్వం పట్ల ప్రజలలో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకొనడానికి అటు బిజెపి, ఇటు ఆకాలీలు యధాశక్తి ప్రయత్నిస్తుండగా, మరో ప్రధాన పార్టీ కాంగ్రెస్ మాత్రం అంతర్గత కలహాలతోనే ఇంకా కునారిల్లుతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న అమరిందర్ సింగ్ రాజా వారింగ్‌ను ఆ స్థానం నుంచి తొలగించాలనే డిమాండ్ చాలా కాలం నుంచే ఉన్నా తగిన ప్రత్యామ్నాయం దొరకని కారణంగా ఆయన నాయకత్వం లోనే ఎన్నికలకు వెళ్లాలని రెండు నెలల క్రితం పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. ఆ తర్వాత పార్టీలో అంతర్గత కలహాలు మరింత అధికమయ్యాయి. ఈ కారణంగా కెప్టెన్ అమరిందర్ సింగ్‌ను తిరిగి పార్టీలోకి రప్పించే యత్నాలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఆయన గతంలో పార్టీని అధికారంలోకి తేవడమేగాక రాష్ట్రంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడానికి గట్టి కృషినే చేశారు. అయితే గత ఎన్నికలకు ముందు ఆయన కాంగ్రెస్‌ను వీడడంతో అధికారం కూడా చేతులు మారింది. మరో మాజీ సిఎం చరణ్ జిత్ సింగ్ చన్నీని ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించడానికి అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం పార్టీలో అసంతృప్తిని ఎగదోసింది. ఈ నేపథ్యంలో గతవారం సచిన్ పైలట్‌ను పంజాబ్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియమించడం, అంతవరకు ఆ బాధ్యతలు నిర్వహించిన భూపేష్ భగేల్‌ను అసోం ఇన్చార్జిగా మార్చడం కూడా పార్టీ నేతలలో అసంతృప్తిని పెంచినట్లు కనిపిస్తోంది. ఫిబ్రవరి మార్చిలో జరిగే ఎన్నికలకు చన్నీని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని ఆయనమద్దతు దారులు కోరుతున్నారు. చన్నీ, వారింగ్ మధ్య వర్గపోరాటం తీవ్రమవుతున్న దశలో కెప్టెన్ అమరిందర్‌ను తిరిగి రప్పించడానికి జరుగుతున్న ప్రయత్నాలు ఫలిస్తేనే కాంగ్రెస్‌కు విజయావకాశాలు మెరుగుపడతాయనిపిస్తుంది. జులై 31 నుంచి ఆగస్టు 8వరకు జరిగిన పార్టీ'హర్‌బూత్, కాంగ్రెస్ మజ్బూత్' ప్రచార కార్యక్రమంలో అంతర్గత కలహాలు మరింతగా ప్రస్ఫుటమయ్యాయి. మూడు నాలుగు వర్గాలుగా విడి పోయిన రాష్ట్ర కాంగ్రెస్ ను ఏకం చేయడానికి గతవారం సచిన్ పైలట్‌ను ఇన్చార్జిగా నియమించినట్లు అధిష్ఠానం చెబుతోంది. అయితే ఆయననియామకాన్ని కూడా పార్టీలోని కొన్ని వర్గాలు వ్యతిరేకించడం ఇప్పుడు అధిష్ఠానానికి కొత్త సమస్యగా మారింది. రాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి అయిన పైలట్‌కు సంక్షోభ పరిష్కర్తగా పేరున్నా, పంజాబ్‌లోని వర్గాలను ఏకతాటిపైకి తేవడంలో ఎంతవరకు కృతకృత్యులవుతారన్నదిసందేహమే.



కెప్టెన్ అమరిందర్ సింగ్

2017లో కాంగ్రెస్ చివరిసారి అధికారంలోకి వచ్చినపుడు కెప్టెన్ అమరిందర్ సింగ్‌ను ముఖ్య మంత్రి అభ్యర్థిగా పార్టీ ప్రకటించింది. అయితే ఈసారి సిఎం అభ్యర్థిపై నిర్ణయం ఎన్నికల ఫలితాల తర్వాతే ఉంటుందని పైలట్ అంటున్నారు. రాష్ట్రంలో అకాలీదళ్ ఇప్పుడు చాలా బలహీనపడింది. ప్రకాష్ బాదల్ ఉన్నప్పుడు బిజెపి అకాలీదళ్‌తో పొత్తు కుదుర్చుకుంది. కానీ ఆ తర్వాత ప్రజలు వారిని అధికారం నుంచి తొలగించారు. ఇప్పుడు ఆ రెండుపార్టీలు కలిసిపోటీ చేసే వాతావరణం కనిపిస్తోంది. 2022 ఎన్నికల్లో ఆప్ 92సీట్లతో అధి కారం కైవసం చేసుకొంది. కాంగ్రెస్ 18 సీట్లకే పరిమితమైంది. ఈ పరిస్థితిలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావాలంటే చాలా గట్టిప్రయత్నమే చేయవలసి ఉంటుంది. తాజా సర్వే ప్రకారం ఆప్ సీట్లు 92 నుంచి 40, 50కి తగ్గవచ్చనీ, కాంగ్రెస్‌కు 18 నుంచి 35, 45కు పెరగవచ్చనీ విశ్లేషకులు అంటున్నారు. ఆప్‌కు 34 శాతం, కాంగ్రెస్‌కు 30 శాతం మద్దతు లభించవచ్చని అంచనా వేస్తున్నారు. ఆప్‌కు క్రమంగా మద్దతు తగ్గుతున్నదనీ, అయినా ఆ మేరకు కాంగ్రెస్ పెంచుకోలేకపోతున్నదనీ అంటున్నారు. ఈ పరిస్థితిలో కెప్టెన్ అమరిందర్ సింగ్‌ను మళ్లీ పార్టీలోకి తేవడమే తగిన చర్యగా పార్టీభావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆయన 2021లో కాంగ్రెస్‌ను వీడి పంజాబ్ లోక్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసుకొన్నారు. 22 ఆ పార్టీ బిజెపితో కలిసి పోటీ చేసింది. తర్వాత కొద్దిరోజులకే అమరిందర్ తన పార్టీని బిజెపిలో విలీనం చేసి దానిలో చేరారు. అయితే అక్కడ ఆయనకు తగిన ప్రాధాన్యత లభించకపోవడంతో కొంతకాలం నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. బిజెపిలో ఇమడలేని పరిస్థితిలో ఆయన కాలక్షేపం చేస్తున్నారనీ, అందువల్ల ఆయనను తిరిగి కాంగ్రెస్‌లోకి తేవడం తేలికనీ అంటున్నారు. అమరీందర్ పార్టీలోకి తిరిగి వస్తే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఉన్న సిక్కు ఇమేజ్ పెరిగే అవకాశం ఉంది. గతంలో రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న అనుభవంరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రతిష్టను మళ్లీ పెంచవచ్చు. ముఖ్యంగా పాటియాలా, మాల్వా ప్రాంతాల్లో అమరీందర్‌కు ఇప్పటికీ చక్కనిమద్దతు ఉన్నదనే చెబుతున్నారు. బిజెపికి వెళ్లిన కాంగ్రెస్‌అనుకూల ఓట్లను తిరిగి ఆకర్షించే అవకాశం కూడా ఉం టుంది. చరణ్ జిత్ సింగ్ చన్నీ, రాజా వారింగ్ వంటి నేతల మధ్య విభేదాలు ఉండడంతో మధ్యేమార్గంగా అమరీందర్‌ను తిరిగి బరిలోకి తెస్తే సమస్య పరిష్కారమవుతుందని కాంగ్రెస్ అగ్రనాయకులు భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఆయన కాంగ్రెస్ లో చేరితే పార్టీ సీట్లు 60 దాటవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే చన్నీ, వారింగ్,అమరీందర్ మధ్య సమన్వయం సాధించడంలో పార్టీ ఎంత వరకు సఫలం కాగలదనే అంశం పైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయి. కాంగ్రెస్ వ్యూహం ఎలా ఉంటుందో చూడాలి. ●

# వారసత్వ పోరు షురూ!

విశ్లేష - అమెరికా

గన్ని మోహన్

అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అనూహ్య ధోరణులు, ప్రపంచదేశాలపై ఆయన పోకడలతో మధ్యంతర ఎన్నికల్లోనే ఆయనకు చుక్కెదురయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రత్యేకించి మధ్యప్రాచ్యంలో యుద్ధంపై అటు సెనేటర్లు, రిపబ్లికన్లు, ప్రతినిధుల సభలో సైతం ఆయనపట్ల విముఖత వ్యక్తం అవుతోంది. ఇటీవలి జరిగిన సర్వేల్లో ట్రంప్‌నకు రేటింగ్ కూడా పడిపోయింది. దీనికితోడు ఇప్పుడు వస్తున్న మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించాలంటే ట్రంప్ సైతం డాలర్లు ఎరవేస్తున్నారు. మిడ్‌టర్మ్ కోసమే అనట్లుగా ట్రంప్ ఐదువేల డాలర్లను 'ట్రంప్ డివిడెండ్' పేరిట ప్రకటించి ఓట్ల కొనుగోలు వ్యూహాలను ప్రారంభించారు. ఇతర దేశాల్లో అనుసరిస్తున్నట్లుగానే ఇప్పుడు అమెరికాలో కూడా ఓట్ల కొనుగోళ్లు ప్రారంభం అయినట్లు ఈ ట్రంప్ డివిడెండ్ స్పష్టంచేస్తోంది. కోర్టుల్లో మొట్టికాయలు, వీసా ఆంక్షలు వంటి వాటితో ట్రంప్‌రేటింగ్ మరింత క్షీణించింది. ఈ నేపథ్యంలో రిపబ్లికన్ పార్టీలో వారసత్వపోరుపై అప్పుడే చర్చలు మొదలయ్యాయి. రూబియో, డిసాంటిస్, క్రూజ్‌ల పేర్లు రేసులోకి వచ్చేసాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తర్వాత రిపబ్లికన్ పార్టీని నడిపించే నాయకుడు ఎవరనే దానిపై ఇప్పటి నుంచే చర్చలు మొదలయ్యాయి. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ 2028 అధ్యక్ష ఎన్నికలకు తొలి బలమైన పోటీదారుగా కనిపిస్తున్నారు. అయితే రిపబ్లికన్ ఓటర్లు,ప్రతినిధుల నుంచి స్పష్టమైన ఏకాభిప్రాయం రావాల్సి ఉంది. డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ మధ్యంతర ఎన్నికల కన్వెన్షన్‌లో వాన్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఆయన ప్రసంగం సందర్భంగా జేడీ జేడీ జేడీ' అంటూ నినాదాలు భారీ ఎత్తున వినిపించాయి. జెడి48.. జెడి48.. అంటూ నినాదాలుచేయడం ద్వారా తదుపరి అమెరికా అధ్యక్షుడిగా వాన్స్‌ను చూడాలనే ఆకాంక్ష బలంగా వినిపించింది. అనంతరం ట్రంప్ కూడా తన ఉపాధ్యక్షుడిని ప్రశంసిస్తూ ఆయన చాలా ప్రతిభావంతుడని, చాలా మంచి పనిచేశాడని పేర్కొన్నారు. అయితే2028 ఎన్నికలపై వాన్స్ మాత్రం నేరుగా మాట్లాడేందుకు నిరాకరించారు. తన ప్రసంగం సమయంలో ఓ మద్దతుదారు జేడీ 48 అని నినదించగా వాన్స్ చిరునవ్వుతో స్పందిస్తూ ముందుగా ఈ నవంబర్లో మన బాధ్యతను పూర్తి చేయాలి. ఆ తర్వాత ఏం జరుగుతుందో ఆలోచిద్దాం అంటూ మధ్యంతర ఎన్నికల ప్రస్తావనతో అభిమానులను నిరాశపరిచారు. ట్రంప్ కేబినెట్‌లో ఉపాధ్యక్షుడిగా పనిచేస్తుండటం, ఆయనకు అత్యంత సన్నిహితంగా ఉండటం వాన్స్ ప్రధాన బలంగా మారినట్లు రిపబ్లికన్ ప్రతినిధులనుంచి వినిపిస్తోంది. వాన్స్‌ను ట్రంప్ భవిష్యత్ నాయకత్వం కోసం సిద్ధం చేస్తున్నట్లు వారు భావిస్తున్నారు. అందుకే ట్రంప్ వాన్స్‌ను ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఆయన ట్రంప్‌లా కాదు. ట్రంప్‌కు ఎవరూ సాటిరారు. కానీ వాన్స్ మెజార్టీ వర్గానికి చాలా ఇష్టం అని చెపుతున్నారు.



జెడివాన్స్

అయితే వాన్స్ ఒక్కరే రేసులో ఉన్ననాయకుడు కాదు. విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్, టెక్సాస్ సెనేటర్ టెడ్ క్రూజ్ పేర్లు కూడా రిపబ్లికన్ వర్గాల్లో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వాన్స్‌కు ప్రత్యామ్నాయంగా మార్కో రూబియోకు కొందరు రిపబ్లికన్ నేతలు, కార్యకర్తలు బలమైన మద్దతు ఇస్తున్నారు. హ్యూస్టన్‌కు చెందిన పెగ్గీ స్టాంటన్ రూబియో భవిష్యత్తులో అధ్యక్షుడు అవుతారని తాను చాలాకాలంగా భావిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ముప్పులు, కమ్యూనిజం వంటి అంశాలపై రూబియోకు మంచి అవగాహన ఉందని, ఆయనకు మంచి వాక్చాతుర్యం, ఆకర్షణీయమైన వ్యక్తిత్వం ఉన్నాయని అధ్యక్షుడిగా రూబియో సమర్థుడని అభిప్రాయపడ్డారు. 2024లో రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ట్రంప్తో పోటీ పడిన ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్‌కు కూడా పార్టీలో మద్దతు కొనసాగుతోంది. ఫ్లోరిడాలో ఆయన అమలు చేసిన విధానాలు అమెరికాకు ఒక మార్గదర్శకంగా నిలుస్తాయని చెపుతున్నారు. కొంతమంది రిపబ్లికన్ ఓటర్లు మాత్రం 2028లో ఎవరికి మద్దతు ఇవ్వాలన్నది చివరకు ట్రంప్ ఎవరిని సమర్థిస్తారనే దానిపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. కొందరు రిపబ్లికన్లు అయితే వాన్స్,రూబియో మధ్య తేల్చుకోలేకపోతున్నామని ట్రంప్ ఎవరిని బలపరుస్తారో చూసి తన నిర్ణయం తీసుకునే అవకాశంఉందని తెలిపారు. ఇంకా చాలా సమయం ఉన్నందున ఇప్పుడే ఎవరికీ మద్దతు ప్రకటించడం తొందర పాటు నిర్ణయమని కొందరు అభిప్రాయపడుతున్నారు. పెన్సిల్వేనియాకు చెందిన స్టెఫానీ డోనోఫ్రీ మాట్లాడుతూ వాన్స్,రూబియో ఇద్దరూ నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని, ఇద్దరూ సమర్థులేనని అన్నారు. రిపబ్లికన్ పార్టీలో చర్చకు వస్తున్న పేర్ల జాబితా చూస్తే 2028 అధ్యక్ష రేసు ఎంతవరకు ఓపెన్‌గా ఉందో స్పష్టమవుతోంది. ప్రస్తుతం ట్రంప్ పార్టీలో అత్యంత ప్రభావశీల నాయకుడిగా కొనసాగుతున్నారు. 2028 అధ్యక్ష ఎన్నికల బరిలోకి ఇప్పటివరకు ఏ నాయకుడూ అధికారికంగా ప్రవేశించలేదు. కొంతమంది రిపబ్లికన్ కార్యకర్తలు టెక్సాస్ ప్రతినిధి బ్రాండన్ గిల్ పేరును కూడా ప్రస్తావిస్తున్నారు. కెంటకీ ప్రతినిధి థామస్ మాసీకి కూడా కొందరు మద్దతు తెలిపారు. టెక్సాస్ సెనేటర్ టెడ్ క్రూజ్‌కు సైతం మద్దతు లభిస్తోంది. అయితే ట్రంప్‌నకు అత్యంత దగ్గరగా ఉండటం జేడీ వాన్స్‌కు స్పష్టమైన ప్రయోజనంగా కనిపిస్తోంది. ట్రంప్ లాగే వాన్స్ కూడా నేరుగా మాట్లాడే వ్యక్తి, వేగంగా ఆలోచించగల నాయకుడని పేర్కొన్నారు. మొత్తంగా చూస్తే.. 2028 రిపబ్లికన్ అధ్యక్ష రేసులో జేడీవాన్స్ ముందంజలో ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, పోటీ ఇంకాప్రారంభ దశలోనే ఉంది. రూబియో, డిసాంటిస్,క్రూజ్‌తో పాటు మరికొందరు నేతలు కూడా రేసులోకి వచ్చే అవకాశం ఉండటంతో ట్రంప్ తర్వాత రిపబ్లికన్ పార్టీ పగ్గాలు ఎవరి చేతుల్లోకి వెళ్తాయన్నది ఇప్పుడే చెప్పడం కష్టమే. ●

# బ్రిక్స్ సమ్మిట్లో ఇండియా పాత్ర మరింత కీలకం



రావులపాటి సీతారాంరావు


ఏడేళ్ల తర్వాత చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బ్రిక్స్ సమ్మిట్లో పాల్గొనటానికి భారత దేశానికి రావటం శుభ సంకేతంగా భావించవచ్చు! అక్టోబరు 2019లో ప్రధాని నరేంద్ర మోడీతో తమిళనాడులోని మామిల్లాపురంలో సరదా సమావేశం జరిగింది. ఈసారి జరిగే సమావేశం సానుకూలమే! ఇరు దేశాల మధ్య ఏప్రిల్ 2020లో సరిహద్దు ఉద్రిక్తతలు మళ్లీ మొదలయ్యాయి! జూన్‌లో గాల్విన్ వ్యాలీలో సంఘర్షణలు జరగటంతో రెండు దేశాలూ ఎడమొహం పెడమొహంగా వున్నాయి! ఖజాన్లో అక్టోబరు 24న బ్రిక్స్ సమావేశం సందర్భంగా ఇద్దరు నాయకులు కలుసుకున్న తర్వాత క్రమేపీ సంబంధాలు మెరుగుపడ్డాయి. తర్వాత ఇద్దరు నాయకులూ చైనాలో జరిగిన యస్.సి.ఓ సమ్మిట్లో టియాన్ జిన్లో గత సంవత్సరం ఆగస్టులో కలుసుకున్నప్పుడు 'క్రమేపీ ఇరుదేశాల సంబంధాలు సన్నిహితమవుతున్నాయని, మంచి వాతావరణం కనపడుతున్నదని' హర్షం వెలిబుచ్చటం గమనార్హం! అయితే బీజింగ్లో హుషిషింగ్, డైరక్టర్ సౌత్ ఏషియా ఇనిస్టిట్యూట్, ఇరుదేశాల సంబంధాలు వ్యూహాత్మకంగా 'రిస్క్' ను తగ్గించటానికే కానీ వ్యూహాత్మక పునర్నిర్మాణానికి కాదు అన్న అభిప్రాయం వెలిబుచ్చటంతో చన్నీళ్ల మీద వేణ్నీళ్లు చల్లినట్లయింది! 'చైనా భారత్ దేశాలు, అమెరికా ఇరాన్ యుద్ధ నేపథ్యంలో, మరింత మెరుగుపర్చుకొని దగ్గరకు రావటమే మేలని విశ్లేషకులుభావిస్తున్నారు. దీనివల్ల రెండు దేశాలు ఒత్తిడులు, ఇతర దేశాల యుద్ధాల నేపథ్యంలో తగ్గించుకోవటమే కాకుండా, ప్రపంచ శాంతి నెలకొల్పటానికి సరియైన మార్గదర్శకత్వాన్ని యిచ్చిన వారవుతారు గూడా! భారత్‌కు ఈ బ్రిక్స్ సమావేశం 'బ్రిక్స్' ఒరిజినల్ ఐడియాను వినియోగించుకొనే అవకాశం కల్పిస్తుంది! ప్రారంభంలో ఏవిధంగా కొన్ని ఆశయాలతో బ్రిక్స్ ఏర్పడిందో, నెరవేర్చకుండా దారి తప్పింది! ఢిల్లీ సమావేశంలో పునరాలోచనతో గాడితప్పిన ఆశయాల బండిని తిరిగి అసలు మార్గానికి మళ్లించే అవకాశం సద్వినియోగం చేసుకోవాలి! దృఢమైన సంకల్పంతో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా అభివృద్ధి మార్గంలో నడుస్తున్న దేశాలుగా,దగ్గ రకు 'బ్రిక్స్ సమ్మిట్'గా వచ్చాయి! ఈ సమ్మిట్ వల్ల నిజమైన ఆర్థికాభివృద్ధి తోపాటు దేశాలలో శాంతి సుస్థిరతను సాధించే ప్రయత్నంలో ఇండియా చాలా ఉత్సాహంగా 2012లో మొదటి సమ్మిట్‌ను నిర్వహించే దేశంగా ముందుకు వచ్చింది! 'గ్లోబల్ స్టెబిలిటీ, సెక్యూ రిటీ, ప్రోస్పరిటీ' లపై దృష్టి పెట్టా లని ఆశయ సాధనలో భాగంగా 'బ్రిక్స్' నిర్ణయించుకుంది. రష్యా అధ్యక్షుడు వాల్దిమిర్ పుతిన్ శుక్రవారం సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చినప్పుడు ప్రధాని మోడీ ఒకే కారులో ప్రయాణం చేశారు. దౌత్యమే సరియైన దారి అనివారు భావిస్తున్నారు. వివాదాల పరిష్కరంలో తోడుగా వారు ఉండటం తథ్యం. యుయన్ సెక్రటరీ జనరల్ కూడా సమ్మిట్‌లో పాల్గొంటున్నారు. పుతిన్ మోడీ ద్వైపాక్షిక సమా వేశంలో కీలక ప్రాంతీయ అంతర్జాతీయ పరిణామాలపై చర్చించారు. మాస్కోను సందర్శించడానికి మోడీ అంగీకరించారు. ఈ ఆహ్వానం మోడీ భారత్ రష్యాను విలువైన స్నేహదేశంగానే భావిస్తున్నదని అనటా నికి తార్కాణంగా నిలుస్తుంది.

సుస్థిరత, సహకారం బ్రిక్స్ లక్ష్యంగా బ్రిక్స్ కార్యాచరణ ప్రకటించింది. సంక్షోభాలను తట్టుకోవటమే ప్రథమ ప్రాధాన్యతగా ఈ సమ్మిట్ గుర్తించింది. ఈ సమ్మిట్ చాలా క్లిష్టపరిస్థితుల నేపథ్యంలో జరగబో తున్నది. ఎనర్జీ వ్యవసాయం సప్లయి చైన్ వెస్ట్ ఏషియా, ఉక్రెయిన్ యుద్ధాల వల్ల దాదాపు తెగిపోయింది. దానిని పునరుద్ధరించేందుకు పెట్టిన భారత మండపంలో చర్చలు ఆరంభించటం ముదావహం. అంతకు మునుపే షాంగై కోపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్లో ప్రధాని మోడీ, ఇరాన్ ప్రసిడెంట్ సమావేశం ఆగస్టు 31 నాడు జరిగింది! బయటకు విషయం పొక్కటం లేదు కానీ యు.యస్ డాలర్ మీద ఇతర దేశాలు ఆధారపడి ఆర్థికంగా కష్టాలపాలవుతున్నాయి. డాలర్ మారకం విలువ అంతర్జాతీయంగా ఇంతకు మునుపు అన్ని దేశాల కరెన్సీని అధిగమించి వుండేది! దానితో అమెరికా దేశం ఆర్థిక విషయాలల్లో ముఖ్యంగా ఎగుమతులూ దిగుమతుల సంబంధాలలో ప్రభావంతనకు అనుకూలంగా వుండేట్లు చూసుకొనేది. ఇప్పుడు కొన్ని దేశాలు ముఖ్యంగా చైనా, రష్యా, ఇండియా, యూరప్ దేశాల కరెన్సీ మాదిరి వారివారి దేశాల కరెన్సీలు ఆర్థిక వెసులుబాటు కోసం చెల్లించుకొనే ఒప్పందం దృఢపర్చుకొనే అవకాశం ఈ




నిజానికి భారత్ కొన్నిబలమైన దేశాలు, ఈ వెసులుబాటు కుదుర్చుకోవటానికి అంగీ కరించేందుకు కొంత తెర వెనుక ప్రయత్నాలు చేసినట్లు, అంతర్జాతీయ ఆర్థిక నిపు ణులు విశ్లేషిస్తున్నారు. 2018 బ్రిక్స్ సమ్మిట్ (సౌత్ ఆఫ్రికాలో జరిగింది) 'రిఫార్మ్ మల్టీ లేటరిలి జం'ను గురించిన ఆలోచన మోడీ వ్యక్తపరి చారు! 2019 బ్రిక్స్ సమ్మిట్ వర కల్లా కొన్ని దేశాలు విడుదలచేసిన డాక్యుమెంట్లలో ఆ వెసులుబాటు చేర్చబడింది కూడా! ఈ 'మల్టీ లేటరి లిజం' మల్టీ ఎలైన్మెంట్ ఆలోచనలను భారత్ మరింతగా ప్రభావితం చేసే విధంగా బ్రిక్స్ సమ్మిట్ చర్చలు దోహదం చేయటంతోపాటు దృఢమైన నిర్ణయాలు ప్రపంచ శాంతి ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడటానికి అనుకూల వాతావరణం కల్పించాలి!

సమ్మిట్ దేశాలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ముఖ్యంగా చమురు దిగుమతులు హార్మజ్ జల సంధి దగ్గర జరుగుతున్న గొడవల వల్ల చాలా దేశాలకు ఎన్నో కష్టాలు తెచ్చిపెట్టున్నాయి. మన దేశానికి ఈ పరిస్థితివల్ల ఆర్థిక పురోగతి కుంటుపడే అవకా శం మరింతగా పెరిగింది! బ్రిక్స్ ఏర్పాటు చేసిన అతిథి దేశంగా భారత్ ప్రపంచ స్థాయిలో తన పాత్ర ఏమిటో స్పష్టపరుచుకుంది. చైనా, ఇరాన్, రష్యా దేశాల నాయకులు కొత్తగా పేరు సందర్భంగా తీసుకో వచ్చు! ఫైనాన్స్‌కు సంబంధించిన అధికారులు 'బ్రిక్స్' సమ్మిట్ ముందు కలుసుకొని 'క్రాస్ బార్డర్ పేమెంట్స్' వెసులుబాటు కల్పించుకోవటం ద్వారా జాతీయ కరెన్సీలను కొన్ని దేశాలు బలోపేతం చేసుకోవాలని అనుకున్నట్లు తెలుస్తున్నది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా, ఈజిప్ట్, ఇథో పియా, ఇండోనేషియా, ఇరాన్, యు.ఏ.ఇ దేశాలు ట్రేడ్‌తో పాటు దౌత్య సంబంధాలు గ్లోబల్ సౌత్లో పెంపొందించుకొనే అవకాశాలు అభివృద్ధి చేసుకోవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాయి. దీనివల్ల 'క్రాస్ బార్డర్ పేమెంట్' కోరుకున్న రీతిలో మెరుగవుతుందని ఈ దేశాలు నమ్ముతున్నట్లు బహిర్గతమవుతున్నది. ఇప్పుడు దేశాల మధ్య చెల్లింపులు జరగాలంటే సంబంధిత బ్యాంకులలో దేశాలకు ఎకౌంట్లు వుండటం తప్పనిసరి! రెండు దేశాల మధ్య సంబంధిత బ్యాంక్‌లు లేకపోతే చెల్లింపులు అంతర్జాతీయ బ్యాంక్ ద్వారా చెయ్యాలి! చెల్లించే దేశం కరెన్సీని కన్వర్ట్ చేసి (డామినెంట్ కరెన్సీతో అంటే డాలర్స్ మార్చుకొని) తిరిగి కరెన్సీ పొందే దేశ కరెన్సీలో మార్చుకోవాలి. ఈ లావాదేవీలు చాలా కష్టతరంగా మారటమే కాకుండా ఎక్కువగా మారకం విలువ నిన్న మొన్నటి దాకా ఎక్కువగా వున్న డాలర్ మీద ఆధారపడాల్సిన స్థితి వుంటున్నది! ఒకవేళ ఈ మారకాల విషయాల్లో వచ్చే ఇబ్బందులను తొలిగించుకో వటానికి 'క్రాస్ బార్డర్ పేమెంట్' పద్ధతి గాడిలో పడితే ఆర్థిక వెసులుబాటు ఈ దేశాలకు ఏర్పడుతుంది! 2026లో జరుగుతున్న బ్రిక్స్ సమ్మిట్లో ఇలాంటి వెసులుబాట్లు కుదుర్చుకొనే అవకాశాలు ఎక్కువగా వున్నాయి! నిజానికి భారత్ కొన్నిబలమైన దేశాలు, ఈ వెసులుబాటు కుదుర్చుకోవటానికి అంగీకరించేందుకు కొంత తెర వెనుక ప్రయత్నాలు చేసినట్లు, అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2018 బ్రిక్స్ సమ్మిట్ (సౌత్ ఆఫ్రికాలో జరిగింది) 'రిఫార్మ్ మల్టీ లేటరిలిజం'ను గురించిన ఆలోచన మోడీ వ్యక్తపరిచారు! 2019 బ్రిక్స్ సమ్మిట్ వరకల్లా కొన్ని దేశాలు విడుదలచేసిన డాక్యుమెంట్లలో ఆ వెసులుబాటు చేర్చబడింది కూడా! ఈ 'మల్టీ లేటరిలిజం' మల్టీ ఎలైన్మెంట్ ఆలోచనలనుభారత్ మరింతగా ప్రభావితం చేసే విధంగా బ్రిక్స్ సమ్మిట్ చర్చలు దోహదం చేయటంతోపాటు దృఢమైన నిర్ణయాలు ప్రపంచ శాంతి ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడటానికి అనుకూల వాతావరణం కల్పించాలి! ●



# జిన్‌పింగ్ వెంటే 'అంకుల్ కై'

## భారత్‌కు వచ్చిన ఈ పొడగరి ఎవరు?

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత పర్యటనపై సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. ఆయనతోపాటు సూటుబూటూ ధరించిన ఎత్తయిన వ్యక్తిపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. ఆయనే కై క్వి. చైనాలో 'అంకుల్ కై'గా 'ఫేమస్ అయిన ఆయనను జిన్‌పింగ్‌కు నమ్మకస్తుడు. కుడిభుజంగా చెబుతుంటారు. అధ్యక్షుడి తర్వాత శక్తిమంతమైన నేతగా చూస్తున్నారు. ఆయన ఆ స్థాయికి ఎదిగిన తీరు చర్చనీయాంశమే? మామూలుగా తెరవెనక ఉండి రహస్యంగా పనులు చక్కబెట్టే కై క్వి.. కమ్యూనిస్ట్ పార్టీ పొలిటికల్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు. చైనా ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేసే జనరల్ ఆఫీస్ డైరెక్టర్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ కై క్వి ఎక్కువగా మీడియా కంట్లో పడుతున్నారు. గతేడాది ప్రధాని మోదీ ఎస్‌సీఓ సదస్సు కోసం చైనా వెళ్లారు. వారిద్దరి మధ్య భేటీ జరగడాన్ని కీలకాంశంగా పరిగణించారు. అదే యేడాది దక్షిణ కొరియాలో ట్రంప్-జిన్‌పింగ్ భేటీలో కూడా కనిపించారు. ఇక ఈ యేడాది చైనా పర్యటనకు వెళ్లినప్పుడు ట్రంప్‌ను మొదట పలకరించింది కూడా ఈయనే. ఎవరీ కై క్వి? 1966 నుంచి 1976 మధ్య నాటి కమ్యూనిస్ట్ పార్టీ ఛైర్మన్ మావో జెడాంగ్ ప్రారంభించిన సాంస్కృతిక విప్లవంలో జిన్‌పింగ్, కై క్వి ప్రస్థానం మొదలైంది. అప్పుడు మొదలైన వీరి స్నేహం విడదీయరానిదిగా మారింది. 2013లో జిన్‌పింగ్ చైనా అధ్యక్షుడు కాగా.. 2017 నుంచి కై క్వి అతివేగంగా ఉన్నతస్థానాలకు ఎదిగారు. బీజింగ్ కమ్యూనిస్ట్ పార్టీ చీఫ్‌గా నియమితులైన కొన్ని నెలల తర్వాత నేరుగా పొలిట్ బ్యూరో (పార్టీ రెండో అత్యున్నత నిర్ణయాధికార సంస్థ) సభ్యుడిగా ప్రమోషన్ పొందారు. మామూలుగా ఇలాంటి స్థానాలకు ఎదగాలంటే కనీసం ఐదేళ్లు పడుతుంది. 2022లో పార్టీకి చెందిన ఏడుగురు సభ్యుల పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా మారారు. అత్యున్నత స్థాయి నిర్ణయాలు తీసుకునే ఒక రాజకీయ శక్తి కేంద్రం అది. ఈ యేడాది ప్రారంభంలో పార్టీకి సెంట్రల్ ఐడియాలజీ స్కూల్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఒకే వ్యక్తికి ఇన్ని పదవులంటే.. అధికారమంతా ఒక దగ్గరే కేంద్రీకృతమైందని అర్థమవుతోంది.

# గ్లోబల్‌సౌత్ బలమైన వాణి వినిపించాలి

## 'రూల్ షేపర్'గా బ్రిక్స్ దేశాలు వ్యవహరించాలి

## సదస్సు ప్రారంభ సభలో ప్రధానిమోడీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** గ్లోబల్ సౌత్‌కు అంతర్జాతీయ నిర్ణయాల్లో మరింత బలమైన స్వరం ఉండాలని ప్రధానిమోదీ పిలుపునిచ్చారు. ఆర్థికంగా బలహీనమైన, అభివృద్ధి చెందుతున్న దేశాలను గ్లోబల్ సౌత్‌గా వ్యవహరిస్తారు. ఇతరులు రూపొందించే నిబంధనల్ని అనుసరించే రూల్ టేకర్‌గా కాకుండా, నిబంధనలను రూపొందించే రూల్ షేపర్‌గా ఉండాలని ప్రధాని పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ప్రారంభమయిన బ్రిక్స్ 18వ సమావేశాల్లో ప్రధాని నరేంద్రమోదీ సదస్సుకు అధ్యక్షత వహిస్తూ, కీలక ప్రసంగం చేశారు. ఈ మార్పుకు నాయకత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోదీ స్పష్టం చేశారు. సవాళ్లను ఎదుర్కోవడంలో గ్లోబల్ సౌత్ ముందు వరసలో ఉన్నప్పటికీ, అంతర్జాతీయ నిర్ణయాలు తీసుకునే విషయంలో మాత్రం వెనక వరసలో ఉందని అన్నారు. బ్రిక్స్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు , ప్రపంచ పాలనా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని మోదీ అన్నారు. ప్రస్తుత పాలనా వ్యవస్థను 'అధికార పిరమిడ్‌తో' పోల్చారు. ఇందులో అధికారం, నిర్ణయాధికారం పైస్థాయిలో కొన్ని దేశాలు వద్ద కేంద్రీకృతమై ఉంటుందని, దిగువ స్థాయిలో ఉన్న దేశాలు ఆ నిర్ణయాల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిని రూపొందించే అవకాశం మాత్రం వారికి రావడం లేదని వివరించారు. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచ పాలనలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు సమానమైన, ప్రభావ వంతమైన భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందని మోదీ తన ప్రసంగంలో చెప్పారు. 12, 13 తేదీల్లో జరిగే ఈ సమావేశాలకు బ్రిక్స్ సభ్యదేశాలతో పాటు బ్రిక్స్ అవుట్‌రీచ్ దేశాలు హాజరయ్యాయి. చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ వంటి నేతలు హాజరయ్యారు. బ్రిక్స్ కేవలం ఆర్థిక సహకార వేదికగా కాకుండా, ప్రపంచ వ్యవస్థలో సంస్కరణలు, గ్లోబల్ సౌత్ ప్రయోజనాలకు బలమైన వేదికగా మారాలని భారత వైఖరిని ప్రధాని మోదీ సభ్యదేశాధినేతల ముందు చెప్పారు. రాబోయే 20 ఏళ్ల కోసం కొత్త ప్రతిష్ఠాత్మక కార్యాచరణ అవసరమని మోదీ అన్నారు. ఇందు కోసం ప్రాతినిధ్యం, స్పందనాత్మకత, నిబంధనల రూపకల్పన ఆధారంగా 10 అంశాలతో రోడ్‌మ్యాప్ ప్రతిపాదించారు. ఇందులో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలను మోదీ ప్రస్తావించారు. భద్రతా మండలి సంస్కరణలు ఇకపై వాయిదా వేయడం సాధ్యం కాదని ఆయన అన్నారు. ప్రపంచ ఆర్థిక సంస్థల్లో ఓటింగ్ హక్కులు, నాయకత్వ స్థానాలు, విధాన ప్రాధాన్యతలు ప్రస్తుత ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా ఉండాలని మోదీ అన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే దేశాలకు ప్రపంచ నిర్ణయ ప్రక్రియలో తగిన పాత్ర ఉండాలని అన్నారు.



# ప్రధానిమోడీతో ఫొటో దిగేందుకు ప్రతినిధుల ఆసక్తి

## కోరినవెంటనే డెలిగేట్స్‌తో ఫొటో దిగిన ప్రధాని

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోడీకి అరుదైన గౌరవం లభించింది. మోడీతో ఒక గ్రూప్ ఫొటో దిగేందుకు విదేశీ ప్రతినిధులు ఎంతో ఉత్సాహం చూపారు. ఈ ఆసక్తికర ఘటన న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు వేదికగా కనిపించింది. భారత ప్రభుత్వం విడుదల చేసిన ఒక వీడియోలో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి. సదస్సు ముగిశాక, పలువురు విదేశీ డెలిగేట్లు ప్రధాని మోడీ వద్దకు వచ్చి, మేము ఒక ఫోటో దిగొచ్చా అని అడిగారు. అందుకు ప్రధాని నవ్వుతూ తప్పకుండా అని సమాధానమిచ్చారు. మరికొందరు అంటూ ఆయన్ను కోరారు. ఈ సమయంలో అక్కడే ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్.. డెలిగేట్లు ఫొటో దిగేందుకు వీలుగా పక్కకు జరిగి దారి ఇవ్వడం విశేషం. ప్రతినిధులందరూ ఫొటో కోసం సర్దుకుంటుండగా, ప్రధాని మోడీ అక్కడున్న మహిళా ప్రతినిధులను చూసి సరదాగా మీరు అదృష్టవంతులు, ఇంతమంది మహిళలున్నారు అని వ్యాఖ్యానించారు.

# అహంకారానికి, బెదరింపులకు తలొగ్గేది లేదు

## అమెరికాకు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ హెచ్చరిక




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్.. అమెరికాను మరోసారి హెచ్చరించారు. బెదరింపులకు పాల్పడే వారికి ఇరాన్ ఎన్నటికీ తలొగ్గని పెజెష్కియాన్ అన్నారు. మరోవైపు వైపు ప్రధాని నరేంద్రమోడీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌లు ఢిల్లీలో సమావేశమయ్యారు. బ్రిక్స్ సమావేశాల సమయంలో ఇరు దేశాధినేతల భేటీ ఆసక్తికరంగా మారింది. ఈ సమావేశంలో ఇద్దరు దేశాధినేతలు పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఒక స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 'బెదరింపులకు', 'అహంకారానికి' ఇరాన్ తలొగ్గదని, తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి దృఢంగా నిలబడుతుందన్నారు. బ్రిక్స్ కూటమి దేశాల బలం ఆర్థిక వ్యవస్థలకే పరిమితం కాలేదని.. వాణిజ్యం, పెట్టుబడులు, ఉమ్మడిగా నిధుల సమీకరణలో బ్రిక్స్ దేశాల సామర్థ్యాలు మరింత స్పష్టం అవుతున్నాయన్నారు. అలాగే భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రస్తుతం సంక్లిష్టంగా మారాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల సమయంలో ఇరాన్ అధ్యక్షుడి వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అలాగే భారత ప్రధాని నరేంద్రమోడీతో పెజెష్కియాన్ ఢిల్లీలో సమావేశం అయ్యారు. ప్రధానంగా ఇరు దేశాల సంబంధాల బలోపేతంపై చర్చించారు. అలాగే భారత ప్రధాని మోడీ, పెజెష్కియాన్ సమావేశంపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో స్పందించారు. భారత్-ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని తాను భావించడం లేదన్నారు. అమెరికా ఆంక్షలను తప్పించుకోవడంలో ఇరాన్‌కు ఇతర దేశాలు సహాయం చేయొద్దని మార్కో హెచ్చరించారు. అమెరికా దాడుల తర్వాత, రెండు అమెరికా నౌకలను ముంచేశామని.. అలాగే ఎనిమిది చమురు ట్యాంకర్లను ధ్వంసం చేశామని ఇరాన్ పేర్కొంది. అంతకుముందు, అమెరికా సైన్యం దాడి చేసి ఐదు ఇరాన్ ట్యాంకర్లను ధ్వంసం చేయగా, ఈ ఘటనలో లక్షల లీటర్ల ముడి చమురు కాలిపోయింది. అమెరికా, ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఓ కీలక ప్రకటన చేశారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ముగిసిన వెంటనే ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం ముగుస్తుందని చెప్పుకొచ్చారు.

# బ్రిక్స్ కూటమికి గ్రోత్ ఇంజిన్‌గా భారత్




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** ఒకప్పుడు బలహీనమైన బంధంగా విమర్శలు ఎదుర్కొన్న భారత్, నేడు అదే కూటమికి వృద్ధి ఇంజిన్‌గా మారింది. 2012లో ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరిగినప్పుడు, అసలు ఈ వర్ధమాన దేశాల కూటమిలో భారత్‌కు స్థానం ఉందా అనే ప్రశ్నలు తలెత్తాయి. కానీ పద్నాలుగేళ్ల తర్వాత 2026లో విస్తరించిన కూటమికి భారత్ మరోసారి ఆతిథ్యం ఇస్తున్న వేళ, పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు బ్రిక్స్ భవిష్యత్తును నిర్దేశించే కీలక శక్తిగా భారత్ అవతరించింది. 2012 నాటి పరిస్థితులను పరిశీలిస్తే, భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంది. 2012-13లో వృద్ధి రేటు 5 శాతం కంటే దిగువకు పడిపోయింది, ద్రవ్యోల్బణం ఆందోళనకర స్థాయిలో ఉంది, రూపాయి విలువపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ స్టాండర్డ్ పూర్స్ అయితే, భారత్ తన ఇన్వెస్ట్‌మెంట్‌గ్రేడ్ సార్వభౌమ రేటింగ్‌ను కోల్పోయే తొలి బ్రిక్ దేశంగా మారవచ్చని హెచ్చరించింది. బ్రిక్ అనే పదాన్ని సృష్టించిన ప్రముఖ ఆర్థికవేత్త జిమ్ ఓ నీల్ సైతం, ఆ నాడు బ్రిక్ దేశాల్లో పెట్టుబడులకు భారత్ అత్యంత ఆకర్షణీయం కాని దేశంగా పేర్కొన్నారు. కొందరైతే భారత్ స్థానంలో ఇండోనేషియాను చేర్చాలనే వాదనలు కూడా వినిపించారు. 2026 నాటికి ఈ చిత్రం సమూలంగా మారిపోయింది. ప్రస్తుతం భారత ఆర్థిక మూలాలు అత్యంత పటిష్ఠంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో దేశ వాస్తవ జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో అత్యంత వేగవంతమైన వృద్ధి రేట్లలో ఒకటి. ఇటీవలే, 2026 సెప్టెంబరులో జపాన్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్ సార్వభౌమ రేటింగ్‌ను ట్రిపుల్‌బిప్లస్ నుంచి ఏకేటగిరీకి కి పెంచుతూ స్థిరమైన అవుట్‌లుక్‌ను ప్రకటించింది. పటిష్ఠమైన వృద్ధి, మెరుగైన ద్రవ్య క్రమశిక్షణ, బలపడిన ఆర్థిక వ్యవస్థ, జీఎస్టీ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి సంస్కరణలు ఈ రేటింగ్ పెంపునకు కారణాలని ఆ సంస్థ వివరించింది. 2010లో దక్షిణాఫ్రికా చేరికతో బ్రిక్స్ కాస్తా బ్రిక్స్‌గా మారింది. ఆ తర్వాత ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ, ఇండోనేషియా వంటి దేశాలు కూడా ఇందులో భాగమయ్యాయి. దీంతో ఈ కూటమి ఆర్థిక, భౌగోళిక రాజకీయ ప్రాధాన్యం మరింత పెరిగింది. ఈ విస్తృత కూటమిలో భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కానప్పటికీ, దాని వృద్ధి వేగం, భారీ మార్కెట్, సాంకేతిక సామర్థ్యాలు, భౌగోళిక రాజకీయ విభేదాలకు అతీతంగా అన్ని వర్గాలతో సత్సంబంధాలు నెరపగల సామర్థ్యం ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఈ మార్పు అడిగే ప్రశ్నల్లోనే స్పష్టంగా కనిపిస్తోంది. 2012లో చర్చంతా అసలు బ్రిక్స్‌లో ఉండే అర్హత భారత్‌కు ఉందా అనే దానిపై కేంద్రీకృతమైంది. కానీ 2026 నాటికి,ఈ విస్తరించిన కూటమి భవిష్యత్తును భారత్ ఎంతవరకు నిర్దేశించగలదనే దానిపై దృష్టి సారించడం గమనార్హం.

# యేడేళ్ల తర్వాత భారత్‌కు జిన్‌పింగ్!న- వాణిజ్య పెట్టుబడులే భేటీలో కీలకం..

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ శనివారం న్యూఢిల్లీ చేరుకున్నారు. ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆయన భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. సుమారు 24 గంటల పాటు సాగే ఈ పర్యటనలో భాగంగా, ఆయన శనివారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో జరిపే ద్వైపాక్షిక చర్చల్లో ప్రధానంగా వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక అంశాలు చర్చకు వచ్చాయి. జిన్‌పింగ్ పర్యటన నేపథ్యంలో దేశ రాజధానిలో అపూర్వమైన భద్రతా ఏర్పాటు చేశారు. ఆయన బస చేస్తున్న హోటల్ పరిసర ప్రాంతాలను ఇప్పటికే నోఫ్లై జోన్‌గా ప్రకటించారు. బాంబ్ డిటెక్షన్, యాంటీ టెర్రర్ బృందాలతో పాటు అణు, రసాయన దాడులను గుర్తించే ప్రత్యేక దళాలను కూడా మోహరించారు. చైనాకు చెందిన భద్రతా సిబ్బంది కొద్ది రోజుల ముందే ఢిల్లీకి చేరుకుని, హోటల్ పరిసరాలను తమ పర్యవేక్షణలోకి తీసుకున్నారు. ఆయన పర్యటనకు పది రోజుల ముందే చైనా నుంచి ఒక కార్గో విమానం ఢిల్లీకి చేరుకుంది. ఈ విమానంలో జిన్‌పింగ్ ఉపయోగించే ప్రత్యేక హాంగ్‌కీ కారు, ఒక బ్యాకప్ వాహనంతో పాటు అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలను తీసుకువచ్చారు. శాటిలైట్ కమ్యూనికేషన్ పరికరాల వంటి వాటిపై భారత నిబంధనలు కచ్చితంగా వర్తిస్తాయని అధికారులు స్పష్టం చేశారు. జిన్‌పింగ్ ప్రయాణించే బోయింగ్ 7478 విమానం క్షిపణి నిరోధక వ్యవస్థలతో కూడిన ఒక మొబైల్ కమాండ్ సెంటర్‌గా పనిచేస్తుంది. బ్రిక్స్ సదస్సు భద్రత కోసం ఢిల్లీ వ్యాప్తంగా 15,000 మందికి పైగా పోలీసులు, 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. విమానాశ్రయం నుంచి సదస్సు వేదికైన భారత్ మండపం వరకు 700కు పైగా సీసీటీవీ కెమెరాలు, యాంటీడ్రోన్ వ్యవస్థలతో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 11 గంటలకు జిన్‌పింగ్ తన పర్యటనను ముగించుకుని తిరిగి వెళ్లనున్నారు.

# కాంగ్రెస్ పార్టీ పదవుల నుంచి తప్పుకున్న ఉత్తరాఖండ్ మాజీ సిఎం హారీష్ రావత్



**డెహ్రాడూన్, సెప్టెంబరు 12:** ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత హరీశ్ రావత్ పార్టీ పదవుల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. తన మాజీ సహాయకుడు, ప్రస్తుతం పిఎగా పనిచేస్తున్న చందన్ సింగ్ జీనా నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించిన మరుసటి రోజే హరీశ్ రావత్ ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. తన వల్ల కాంగ్రెస్ పార్టీ అవినీతికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంపై ఎలాంటి ప్రశ్నలు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే పదవుల నుంచి తప్పుకుంటున్నట్లు రావత్ తెలిపారు. ఈ మేరకు ఫేస్‌బుక్ పోస్టు ద్వారా తన నిర్ణయాన్ని వెల్లడించారు. 2016లో జరిగిన గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పరీక్షలో అక్రమాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ సహా పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ సోదాల్లో చందన్ సింగ్ జీనా నివాసం కూడా ఉందని ఈడీ పేర్కొంది.

# హఠాత్తుగా సముద్రం ఎండిపోయిందంటూ అర్జెంటీనాలో హల్‌చల్

## అదేమీ నిజం కాదన్న సముద్ర జలవనరుల నిపుణులు

**బ్యూనస్ ఏరీస్, సెప్టెంబరు 12:** అర్జెంటీనాలో రాత్రికి రాత్రే సముద్రం ఎండిపోయిందంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వార్తలు తీవ్ర కలకలం రేపాయి. ఇది అవాస్తవమని, ప్రకృతి వైపరీత్యం కాదని, కేవలం ఒక తాత్కాలిక సహజ ప్రక్రియ మాత్రమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అర్జెంటీనాలోని మార్ డెల్ ప్లాటా తీరంలో అట్లాంటిక్ మహాసముద్రం నీరు సుమారు 23 కిలోమీటర్ల మేర వెనక్కి తగ్గినట్టు వార్తలు వచ్చాయి. సముద్రం వెనక్కి తగ్గడం వల్ల, సాధారణంగా నీటిలో మునిగి ఉండే రెస్టింగా డెల్ ఫారో అనే భారీ శిలా ప్రదేశం పూర్తిగా బయటపడింది. తీరంలో నిలిచిపోయిన పడవలు, వెనక్కి వెళ్ళిన సముద్ర గర్భం దృశ్యాలను చూసి స్థానికులు, పర్యాటకులు విస్మయానికి గురయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, సముద్రం ఎండిపోయిందనే తప్పుడు ప్రచారం జోరందుకుంది. ఇది సునామీ హెచ్చరిక గానీ, సముద్రం శాశ్వతంగా ఎండిపోవడం గానీ కాదని నిపుణులు తేల్చిచెప్పారు. తీరం నుంచి సముద్రం వైపు బలమైన గాలులు వీయడం, అదే సమయంలో సముద్రపు పోటు తక్కువగా ఉండటం వల్ల నీరు తాత్కాలికంగా వెనక్కి వెళ్లిందని వివరించారు. కొన్ని గంటల వ్యవధిలోనే నీటిమట్టం తిరిగి సాధారణ స్థాయికి చేరుకుందని అర్జెంటీనా మీడియా వెల్లడించింది. సాధారణంగా భూకంపం సంభవించినప్పుడు నీరు వేగంగా వెనక్కి వెళ్లి, తిరిగి భారీ అలలతో విరుచుకుపడితే దానిని సునామీగా పరిగణిస్తారు. కానీ ఇక్కడ కేవలం వాతావరణ మార్పుల వల్లే నీరు వెనక్కి వెళ్లి, అనంతరం తిరిగి ప్రశాంతంగా యథాస్థితికి చేరుకుంది. కాబట్టి, సముద్రం అదృశ్యమైందంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని నిపుణులు స్పష్టం చేశారు.

# వచ్చే వారమే రష్యాపై ఆంక్షల బిల్లు.. భారత్‌కు టారిఫ్‌లు తప్పవా?



**వాషింగ్టన్, సెప్టెంబరు 12:** రష్యాపై ఆంక్షలు కఠినతరం చేసే బిల్లుపై అమెరికా ప్రతినిధుల సభ సోమవారం ఓటింగ్ చేపట్టేందుకు సిద్ధమైంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై టారిఫ్‌లు విధించేలా అమెరికా ప్రత్యేక బిల్లును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. 'లిండ్సే గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026'ను అమెరికా సెనెట్ గత నెలలో భారీ మెజారిటీతో ఆమోదించింది. ఈ బిల్లును డెమోక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది ట్రంప్‌నకు విస్తృతమైన అధికారాలను ఇస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే.. రష్యా నుంచి పెద్దఎత్తున ఇంధనం కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై టారిఫ్‌ల భారం పడే అవకాశం ఉంది. భారత్-అమెరికా వాణిజ్య సంబంధాలపైనా ప్రభావం పడొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉక్రెయిన్‌కు తాము అందించే మద్దతు విషయంలో వెనకడుగు వేయబోమని డెమోక్రటిక్ నేతలు పునరుద్ఘాటించారు. అయితే ఈ బిల్లు మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికన్లపైనా ధరల భారం పెరుగుతుందని హెచ్చరించారు. మరోవైపు రష్యా ఆంక్షల బిల్లును ఆమోదించాలని సెనెట్ డెమోక్రటిక్ సభ్యురాలు జీన్ షహీన్ కోరడం గమనార్హం.

పుతిన్ యుద్ధంతో ఉక్రెయిన్‌లోని అమాయక పౌరు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. క్రెమ్లిన్ ఆదాయాన్ని దెబ్బతీసే ఈ బిల్లును ఆమోదించి, పుతిన్‌ను చర్చలకు తీసుకురావాలని ఆమె కోరారు.



# 4500 యేళ్లనాటి పిరమిడ్‌లో గణిత సంకేతాలు..

## కొత్త పరిశోధన తెరపైకి తెచ్చిన సైంటిస్టు సెఫీ లెవీ

**కైరో, సెప్టెంబరు 12:** ఈజిప్టులోని గిజా మహా పిరమిడ్ మరోసారి చర్చలోకి వచ్చింది. 4,500 ఏళ్ల నాటి ఈ అద్భుత నిర్మాణంలో చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలకు సంబంధించిన గణిత సంకేతాలు దాగి ఉండొచ్చని ఓ కొత్త సిద్ధాంతం చెబుతోంది. స్వతంత్ర పరిశోధకుడు సెఫీ లెవీ ఈ వాదనను తెరపైకి తెచ్చారు. పిరమిడ్ ఎత్తు, పునాది, వాలుదిశల కొలతలను ప్రాచీన ఈజిప్టు గణిత పద్ధతులకు సంబంధించిన భిన్నాలతో లెవీ విశ్లేషించారు. కొన్ని లెక్కల్లో వచ్చిన సంఖ్యలు ఖగోళ చక్రాలకు దగ్గరగా ఉన్నాయని ఆయన చెబుతున్నారు. ఓ లెక్కలో 27.5 అనే సంఖ్య వచ్చిందని లెవీ తెలిపారు. ఇది చంద్రుడు భూమికి అత్యంత దగ్గరగా వచ్చే వరుస కక్ష్య బిందువుల మధ్య సగటు 27.55 రోజుల వ్యవధికి దగ్గరగా ఉందని ఆయన అంటున్నారు. మరో లెక్కలో 70 అనే సంఖ్య వచ్చింది. సూర్యకాంతి కారణంగా సిరియస్ నక్షత్రం కనిపించని దాదాపు 70 రోజుల వ్యవధితో దీనికి సంబంధం ఉండొచ్చని చెబుతున్నారు. గురు, శని, శుక్రుడు, అంగారక గ్రహాల కదలికలతోనూ కొన్ని లెక్కలు సరిపోతున్నాయని లెవీ వాదిస్తున్నారు. పై విలువలు, గోల్డెన్ రేషియో వంటి గణిత స్థిరాంకాలతోనూ పిరమిడ్ కొలతలకు సంబంధం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ నమూనాలు యాదృచ్ఛికంగా ఏర్పడ్డాయా, కావాలనే రూపొందించారా అన్నది పరిశీలించేందుకు 1 లక్ష కంప్యూటర్ నమూనాలను రూపొందించారు. వాటిలో 2.4 శాతం నమూనాల్లో ఇలాంటి పోలికలు కనిపించాయని లెవీ తెలిపారు. ఇది పిరమిడ్ కొలతలు ఉద్దేశపూర్వకంగా రూపొందించి ఉండొచ్చన్న వాదనకు బలం ఇస్తుందని ఆయన అభిప్రాయం. అయితే ఈ పరిశోధనకు ఇంకా శాస్త్రీయ సమీక్ష జరగలేదు. ప్రధానంగా, ఈజిప్టు పురావస్తు నిపుణులు ఈ వాదనను అంగీకరించలేదు. పిరమిడ్‌ను గణిత, ఖగోళ సంకేతాల కోసం నిర్మించారనే స్వతంత్ర ఆధారాలు కూడా ఇప్పటివరకు లేవు.

ఫారో ఖుఫు పాలనలో నిర్మించిన మహా పిరమిడ్‌ను సాధారణంగా ఆయన సమాధి సముదాయంలో భాగంగా భావిస్తారు. కానీ లెవీ మాత్రం ఇది ప్రాచీన జ్ఞానాన్ని శాశ్వతంగా భద్రపరిచే నిర్మాణం అయి ఉండొచ్చని అంటున్నారు.

ప్రాచీన ఈజిప్టు సృష్టి పురాణాల్లో చెప్పే బెన్‌బెన్ అనే ఆదిమ కొండతోనూ దీనికి సంబంధం ఉండొచ్చని ప్రతిపాదిస్తున్నారు.


# సంక్షిప్త వార్తలు

## బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించిన ఉత్తర కొరియా



**ప్యాంగ్యాంగ్, సెప్టెంబరు 12:** కొరియా ద్వీపకల్పంలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ కలిసి నిర్వహించిన "ఫ్రీడమ్ ఎడ్జ్" త్రైపాక్షిక సైనిక విన్యాసాలు ముగిసిన ఒక్క రోజుకే ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వారి విన్యాసాలను రెచ్చగొట్టే చర్యగా భావిస్తున్న ప్యోంగ్‌యాంగ్, తనదైన శైలిలో ప్రతిస్పందించింది. ఉదయం 5:20 గంటలకు ఉత్తర కొరియాలోని వోన్‌సాన్ ప్రాంతం నుంచి అనేక స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. అవి సుమారు 250 కిలోమీటర్లు ప్రయాణించి తూర్పు సముద్రంలో కూలిపోయాయి.

## ఈస్ట్‌వెస్ట్ చమురుపైప్‌లైన్‌పై ఇరాన్ దాడులు



**దుబాయి, సెప్టెంబరు 12:** సౌదీ అరేబియాలోని కీలకమైన ఈస్ట్‌వెస్ట్ చమురు పైప్‌లైన్‌పై పలు దాడులు జరిగాయి. దీంతో ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా పైప్‌లైన్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ దాడులు ఇరాక్ భూభాగం నుంచి డ్రోన్ల ద్వారా జరిగాయని సౌదీ విదేశాంగ శాఖ ఆరోపించింది. సౌదీ ఇంధన మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, రియాద్, మదీనా ప్రాంతాల గుండా వెళ్లే ఈ పైప్‌లైన్‌పై ఈ దాడులు జరిగాయి.

## బిన్‌లాడెన్ కుమారుడి విడియో విడుదల చేసిన అల్‌కాయిదా




**వాషింగ్టన్, సెప్టెంబరు 12:** ఒసామా బిన్ లాడెన్ కుమారుడు హమ్జా బిన్ లాడెన్ సజీవంగా ఉన్నాడా లేదా మరణించాడా అనే అంశంపై ప్రపంచవ్యాప్తంగా మరోసారి చర్చ మొదలైంది. అమెరికాపై జరిగిన 9/11 దాడుల 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అల్ ఖైదా ఉగ్రవాద సంస్థ విడుదల చేసిన తాజా వీడియో ఈ అనుమానాలకు తావిస్తోంది. కొన్ని ఏళ్ల క్రితమే హమ్జాను మట్టుబెట్టినట్లు అమెరికా ప్రకటించినప్పటికీ, గతంలో ఎప్పుడూ వెలుగులోకి రాని అతడి ఫుటేజీని అల్ ఖైదా ఇప్పుడు విడుదల చేయడం గమనార్హం.

## ప్రజ్వల్ రేవణ్ణ మొబైల్‌లో వందలాది పోర్న్ విడియోలు

**బెంగళూరు, సెప్టెంబరు 12:** మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ జైలు గదిలో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లో వందలాది పోర్న్ వీడియోలు ఉన్నట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిర్ధారించింది. మొత్తం 173 వీడియో ఫైళ్లు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వాటిలో ప్రజ్వల్‌కు సంబంధించినవిగా భావిస్తున్న మూడు అశ్లీల వీడియోలు ఉన్నట్లు సమాచారం. బెంగళూరు కేంద్ర కారాగారంలో ఆగస్టు 11న పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

## బార్బర్‌డైమ్ నాణేనికి వేలంలో రూ.10.4 కోట్లు రాబడి




**వాషింగ్టన్, సెప్టెంబరు 12:** ఒకప్పుడు కేవలం 10 సెంట్ల (సుమారు రూ. 8) విలువ కలిగిన ఒక చిన్న నాణెం, నేడు కోట్లాది రూపాయల విలువైన మహా సంపదగా మారింది. అమెరికాకు చెందిన అత్యంత అరుదైన 1894ఎస్ బార్బర్ డైమ్ నాణెం ఇటీవల జరిగిన వేలంలో ఏకంగా 12,50,500 డాలర్లకు (సుమారు రూ. 10.4 కోట్లు) అమ్ముడుపోయింది. సెప్టెంబర్ 1న స్టాక్స్ బోవర్స్ గ్యాలరీస్ నిర్వహించిన ఈ వేలంలో పురాతన నాణేల సేకరణకారులు దీనిని దక్కించుకోవడం కోసం తీవ్రంగా పోటీపడ్డారు. ఈ నాణేనికి ఇంత భారీ ధర పలకడానికి ప్రధాన కారణం అది అత్యంత అరుదైనది కావడమే.

# చిన్నపాటి ఉల్లంఘనలకు నేరపూరిత శిక్షలు రద్దు, జరిమానా విధింపు

## నాలుగువందల సాంకేతికపరమైన చిన్నపాటి నేరాలు తొలగింపు

## మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టిన ప్రజావిశ్వాసం సవరణ బిల్లు

## తెలంగాణ విశ్వాసం నిబంధనల సవరణ చట్టం బిల్లుకు ఆమోదం



**హైదరాబాద్,సెప్టెంబరు 12,ప్రభాతవార్త:** తెలంగాణలో వాణిజ్యసులభతరం చేయడానికి గతంలో నేరంగా భావించే నాలుగువందల పై చిలుకు చిన్నపాటి నేరాలను ఇక నుంచి జైలుశిక్షలకు బదులుగా చిన్నపాటి జరిమా నాలతో ఉల్లంఘనలు చేయకుండా కట్టడి చేస్తామని సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. జీవనాన్ని మెరుగుపరుస్తూ, వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి నిబద్ధత కలిగి ఉన్నదని తెలిపారు. రాష్ట్ర చట్టాలలో అనేక ప్రక్రియా పరమైన, సాంకేతిక, నియంత్రణకు సంబంధించిన నిబంధనలు పాటించకపోవుట వలన జైలు శిక్షను నిర్ణయిస్తున్న నేర సంబంధ నిబంధనలను కలిగి ఉన్నాయని ఆనిబంధనలు, అమలు పరచుటకు ఉద్దేశింప బడిన ప్పటికీ వివాదం, తరచుగా నివారిం చదగిన

శనివారం తెలంగాణ ప్రజావిశ్వాసం 2026 బిల్లు నిబంధనల సవ రణ బిల్లు ఆయన ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలి పింది. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రభు త్వం రాష్ట్రంలో నమ్మకంపై ఆధారపడిన పరిపాలనను ప్రోత్సహిస్తూ, పౌరుల సుఖమయ న్యాయపరమైన వివాదాలకు దారి తీసి న్యాయ స్థానాలపై భారం పడి, పెట్టు బడులు, ఆర్థిక కార్యకలా పాలకు నిరోధకమ వుతున్నదనీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిపాల నలో గొప్ప విశ్వసనీయతను పెంపొం దించాలనే దృష్టితో వివిధ కేంద్ర చట్టాల క్రింద ఉన్న చిన్న నేరములను నేరరహితం, హేతుబద్ధం చేయడానికి జన విశ్వాస్ (నిబంధనల సవరణ) చట్టం, 2023ను రూపొందించినది. అదేరీతిగా, కొన్ని రాష్ట్ర చట్టాలను సమీక్షించి, జైలు శిక్షల నిబంధనలకు బదులుగా ఆర్థిక జరిమానాలను విధించుట, సమకాలీన ఆర్థిక వాస్తవాలకు అనుగుణముగా జరిమానాలను పెంచడానికి, నిర్దిష్టమైన నేరముల రాజీ కోసం వీలు కల్పించి, కాలం చెల్లిన అనవసరమైన చట్టాలను రద్దు చేయుట అవసరమని గమనించామని, తదను గుణంగా, ఈ కింది చట్టాల కొన్ని నిబంధనలకు సవరణలు చేయాలని నిర్ణయించడమైనదని తెలిపారు. ప్రతిపాదిత సవరణలను కింది వాటి కొరకు ప్రధానంగా లక్ష్యంగా పెట్టుకున్నది.

స్వల్ప నేరాలకు విధించే జైలుశిక్షను డబ్బు సంబంధమైన జరిమానాతో భర్తీ చేయుట పరిపాలనా న్యాయ నిర్ణయ యంత్రాంగంను ప్రవేశపెట్టు ఉల్లంఘనల తీవ్రత వ్యవధి ఆధారంగా దశలవారీగా జరిమానాలను పొందుపరుచుట న్యాయపరమైన వివాదాలను తగ్గించుటకు కొన్ని నేరాలను రాజీ ద్వారాపరిష్కరించుట నియంత్రణ సామర్థ్యం, పారదర్శకతను మెరుగు పరుచుట, కాలం చెల్లిన అనవసరమైన చట్టాలను రద్దు చేయుట ముఖ్య లక్ష్యంగా ఈ బిల్లును రూపొందిచామని తెలిపారు.

### పోలీసులే గంజాయి పెడుతూ కేసులు పెడుతున్నారు: సిపిఐ సభ్యుడు కూనంనేని



మద్యం ఎంఆర్‌పి కంటే ఎక్కువ అమ్మినా ఆబ్కారీ వాళ్ల కేసులు పెట్టడం లేదని గుడుంబా విక్రయించేవాళ్లను వేధించడం పోలీసులే గంజాయిని పెట్టి కేసులు పెడుతున్నారని కూనంనేని సాంబ శివరావు తెలంగాణ విశ్వాసం బిల్లుకు ఆమోదం తెలుపుతూ ఆవేదన చెందారు.

అటవీచట్టం అన్యాయంగా మారిందని ఫారెస్టు అధికారులకు ఆయుధాలు ఇస్తే మరో ఆటవికరాజ్యంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విప్ ఆది శ్రీనివాస్, కౌసర్ మోహినోద్దీన్, పాయలశంకర్, పాల్వాయి హరీష్‌లు బిల్లును ఆమోదిస్తూ ప్రసంగించారు.

# కాలయాపన చేస్తూ మాక్ అసెంబ్లీ పెట్టి ప్రజాసమస్యలు విస్మరించారు

## బిఆర్ఎస్ తీరుపై ఎంపి చామల కిరణ్‌రెడ్డి కౌంటర్

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** కాలయాపన చేసే మాక్ అసెంబ్లీ పెట్టి ప్రజసమస్యలను విస్మరించారని, బిఆర్ఎస్ వాళ్లను ప్రజలు బఫున్లలా చూస్తున్నారని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కెసిఆర్ ఒకరోజు ముందు ఎల్పీ మీటిం గ్ పెట్టి పంచాయితీ పెట్టుకుని రండి అని చెప్పారని అందుకే స్పీకర్‌పై దూషణలు చేసి సభకు రాకుండా సస్పెండ్ అయ్యారని ఆరోపించారు. శని వారం ఆయన మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్ష నేత కెసిఆర్, బిఆర్ఎస్ ఎమ్మె ల్యే లకు అసెంబ్లీకి వచ్చి ప్రశ్నించే నైతికత కోల్పోయారని అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను తెలంగాణ తొలి సిఎం కెసిఆర్ ఉసిగొల్పారనీ అన్నారు. నల్ల టీషర్టుల పైన పేర్లు రాసుకుని రాకుండా అసెంబ్లీకి వచ్చి ప్రశ్నించవచ్చు కదానల్ల టీ షర్టులపై పేర్లు రాసుకుని వస్తే లోపలకు రానివ్వరని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు భావించారు అసెంబ్లీ గేటు వద్దకు వచ్చి పోలీసులతో పంచాయతీ పెట్టుకున్నారు అని అన్నారు. దళితులను,స్పీకర్ ను బిఆర్ఎస్ పార్టీ అవ మానించిందనీ చెప్పారు. మాక్ అసెంబ్లీ పెట్టి సిఎం, మంత్రులను ఇష్టం వచ్చినట్లు తిట్టారని ఆవేదన చెందారు. మాక్ అసెంబ్లీలో వెకిలి చేష్టలు చేశారనీ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సురభి నాటకంలో జాయిన్ కావాలనీ ఆయన సూచించారు.

# మీడియా పాయింట్

## పవర్‌పాయింట్ ప్రెజంటేషన్‌తో అబద్ధపు ప్రచారం

## ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ అసెంబ్లీ సమావేశం నిర్వహించవద్దు అన్న దురుద్దేశంతో బి.ఆర్.ఎస్ వ్యవ హరిస్తున్నది. వారిని సస్పెండ్ చేసేలా కేసీఆర్ బోధ చేశారు. విద్యా రంగ సమస్యలపై చర్చ జరుపుతామని స్పష్టత ఇచ్చినా గందరగోళం సృష్టించారు. దళిత వ్యతిరేక పార్టీ ప్రవర్తన ప్రజలు గమనించారు. హరీశ్‌రావు 22ఏపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. ప్రభు త్వం భూములు ఎక్కడైనా నిషేధిత జాబితాలో ఉంటాయి. 3.60 వేల ఎకరాలు మాత్రమే కోర్టు ఆదేశాల మేరకు నిషేధిత జాబితాలో పెట్టారు. ముఖ్యమంత్రి ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది. మాకు దురుద్దేశం ఉంటే స్వయంగా సీఎం ఇల్లు ఎలా నిషేధిత జాబితాలో ఉంటుంది? కోర్టు కేసులు, వివాదాలు ఉన్నవి మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయి.

### పదేళ్లు దోచుకుని..వీరప్పన్ కంటే మించిన ఘనులు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కెటిఆర్, హరీశ్‌రావు ఫ్రస్టేషన్లో ఉన్నారు. ప్రభుత్వంపై పిచ్చిపిచ్చి ప్రేలా పనలు చేస్తున్నారు. 22ఏ పై దుష్ప్రచారం చేస్తున్నారు. వీరప్పన్ కంటే మించిన ఘనులు మీరు. పదేళ్లు దోచుకుని దాచుకున్నారు. మచ్చ లేకుండా పాలన చేస్తుంటే మా ముఖ్యమంత్రిని వీరప్పన్తో పోలుస్తారా? ఏఏ భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయో అసెంబ్లీలో వివరిస్తాం. ప్రజా ఆస్తులు దశాబ్దాల తరబడి నిషేధిత జాబితాలో ఉన్నాయి. కోర్టు కేసులు, వివాదాలు ఉన్న భూములు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయి. భూ భారతి సహకారంతో సాంకేతికంగా భూ సమస్యలు వచ్చినా పరిష్కరిస్తూ వస్తున్నాం. బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అసెంబ్లీ ఆమోదించి పంపిన బీసీలకు 42 రిజర్వేషన్ అంశం ఇప్పటికి ఆమోదించలేదు.

### లక్షల కోట్లు మింగి.. నంగనాచి మాక్ అసెంబ్లీ నాటకాలు : విప్ అద్దంకి దయాకర్

ఏ భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయో తెలియక, తెలివి తక్కువతనంతో బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. ఫారెస్టు భూములు, దేవాదాయ శాఖ భూములు, ప్రభుత్వ భూములు, కోర్టు కేసులు ఉన్న భూములు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయి. నిషేధిత బి.ఆర్.ఎస్ పార్టీ కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని దుష్ప్రచారం చేస్తున్నా రు. 22ఏ పై వినాయక చవితి అనంతరం ఒకరోజు స్పెషల్ అసెంబ్లీ సెషన్ పెడదాం వచ్చే దమ్ము ఉందా? పెడితే మీ భూములు పెట్టాలి నిషేధిత జాబి తాలో కానీ మాకు దురుద్దేశం ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు ఎక్క డైనా నిషేధిత జాబితాలో పెడతారా?మీరు కొట్టేసిన భూములు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలి.

### 22ఎపై బావ, బామ్మర్ది పోటీపడి దుష్ప్రచారం : ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు

22ఎలో లోపాలు ఉన్నాయని, ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెం బ్లీలో చర్చకు రావాలి. బావ, బామ్మర్ది పోటీపడి మరి దుష్ప్రచారం చేస్తున్నారు. ఫారెస్టు, పోడు భూములు, యూనివర్సిటీ, ప్రభుత్వ, కోర్టు కేసులు ఉన్న భూములు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాలో ఉన్న కొన్ని భూములు క్రయ విక్రయాలు జరిగాయి. నిషేధిత జాబితాలో ఇప్పటికే ఇండ్లు ఉన్నాయి. ఆ విషయంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా దానిపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా ప్రజలు నమ్మరు.

# అసెంబ్లీకి వచ్చి మాట్లాడే ధైర్యం లేక తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ

## పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** 'అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై మాట్లాడే ధైర్యం లేకనే తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ పెట్టుకుని కాల యాపన చేస్తున్నారనీ టిపిసిసి క్రమశిక్షణకమిటీ చైర్మన్ ఎంపి మల్లు రవి ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపిమల్లు రవి మాట్లాడుతూ అసెంబ్లీలో చర్చ జరిగితే తమ పాలనలోని అవినీతి, అరాచకాల చిట్టా బయటపడుతుందనే భయమే దీనికి కారణం' అని ఘాటుగా విమర్శించారు. ప్రజల సమస్యలపై అసెంబ్లీలో నిలదీయకుండా బయట మాక్ అసెంబ్లీలు నిర్వహించడం ద్వారా బిఆర్ఎస్ నాయకులు తమ బాధ్యత నుంచి తప్పించుకోలేరని ఎంపి మల్లు రవి స్పష్టం చేశారు. గత పదేళ్ల పాలనలో చేసిన అవినీతి, అక్రమాలపై సమాధానం చెప్పాల్సిన సమయంలో తప్పించుకునేందుకు మాక్ అసెంబ్లీ పేరుతో కొత్త నాటకాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. ప్రజల తరఫున ప్రశ్నించాల్సిన అసెం బ్లీని వదిలేసి తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ పెట్టుకోవడం ఎందుకు? ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ డ్రామా కాదా? అసెంబ్లీకి వస్తే గత బిఆర్ఎస్ పాలనలోని అరాచకాలు, అవినీతి, అక్రమాల చిట్టా బయట పడుతుందనే భయంతోనే అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే ప్రజా సమస్య లపై చర్చించాల్సిన బాధ్యతను విస్మరించి, తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ పేరుతో బిఆర్ఎస్ నాయకులు కాలయాపన చేస్తున్నారని నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి తీవ్రస్థాయిలో విమర్శించారు.

# కొండా సురేఖకు కేబినెట్‌స్థాయి పదవితో హైకమాండ్ బుజ్జగింపులు

## ఆర్టీసి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చే అవకాశం!

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మంత్రి మండలి నుంచి వెనుకబడినతరగతుల వర్గానికి చెందిన మహిళను క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయడంతో దేశవ్యాప్తంగా ఈ అంశాన్ని ఎత్తి చూపుతూ భారతీయ జనతా పార్టీ రాజకీయ పాచిక విసరడంతో హైకమాండ్ ఇప్పుడు కొండసురేఖను బుజ్జగిస్తూ కాళ్ల బేరానికి వచ్చిందని కొండా అనుచరగణం చర్చించు కొంటు న్నారు. వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుచుకోవాలంటే కొండా సురేఖను తిరిగిపార్టీలో చురుకుగా భాగస్వామ్యం చేయాలని స్థానికంగా ఒత్తిడి వస్తుండటంతో అధిష్ఠానం ఆమెకు క్యాబినెట్ ర్యాంకు పదవి కట్టబెట్టడానికి చకచక పావులు కదుపు తున్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకొంటున్నాయి. ఆర్టీసి కార్పొరేషన్ చైర్మన్‌గా ఆమెను నియమించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు కొండా సురేఖ వ్యవహారంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది.

వరంగల్‌లో మున్నూరుకాపులు, పద్మశాలి ఓటర్లను ప్రభావితం చేసే నాయకత్వం లేదని అదిష్టానం గుర్తించడంతో ఆమెను బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. కుడాచైర్మన్‌గా గుండు సుధారాణికి పదవి ఇచ్చినా ప్రజాబలం కూడగట్టి పోలింగ్ బూత్‌వరకు కొండ దంపతుల వలే ఇరు సామాజికవర్గాలను వారు నడిపించలేరని అధిష్ఠానం అంచనాకు వచ్చిందని తెలుస్తోంది. ఆమెకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపు అందింది. వెంటనే బయలుదేరి రావాలని పార్టీ పెద్దల నుంచి ఆమెకు సందేశం అందినట్లు తెలుస్తున్నది. మంత్రివర్గం నుంచి తొలగించిగానే హైకమాండ్ రంగంలోకి దిగడం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్నది.

శుక్రవారం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, కొండా సురేఖతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని, అధిష్ఠానం అండగా ఉంటుందని ఆమెకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ సంభాషణ జరిగిన కొద్ది గంటల్లోనే ఢిల్లీ నుంచి పిలుపు రావడంతో ఆమె అనుచరగణంలో ఆనందం వెల్లివిరుస్తోంది. మంత్రి పదవి కోల్పోయి అసంతృప్తితో ఉన్న కొండా సురేఖను బుజ్జ గించేందుకే అధిష్ఠానం ఈ చర్యలు చేపట్టినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ క్రమంలో కొండా సురేఖకు కేబినెట్ స్థాయి పదవిని అప్పగించే యోచనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అధిష్ఠానం పిలుపు మేరకు కొండా సురేఖ ఢిల్లీ పర్యటన తర్వాత ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇది ఇలా ఉంటే ఆదివారం కొండా మురళి తన అనుచరులతో సమావేశం కానున్నా రు. మంత్రిపదవి ఇస్తేనే ఆయన చురుకుగా పార్టీ కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉందని చర్చకూడా జరుగుతోంది.

# పరిశుభ్రత నగర నాగరికత

## ప్రతి అర కిలోమీటరుకు వ్యర్థాల సేకరణ కేంద్రాలు

## మహిళా మరుగుదొడ్లు తప్పనిసరి: ఉత్తమ్ పద్మావతిరెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబరు 12,ప్రభాతవార్త:** పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి అర కిలోమీటరుకు వ్యర్థాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతీ రెడ్డి సూచించారు. కొత్తగా నిర్మించే షాపింగ్ కాంప్లెక్సులు, వాణిజ్య భవనాల్లో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లను తప్పనిసరి చేయాలని కోరారు. శనివారం రాష్ట్ర శాసనసభలో కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) బిల్లు-2026పై జరిగిన చర్చలో ఆమె మా ట్లాడారు. పర్యావరణ సుస్థిరత, వాతావరణ మార్పులు, లింగ సమానత్వం, సార్వత్రిక ప్రాప్యత, సమ్మిళిత పట్టణ రూపకల్పన, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలతో సమగ్ర పట్టణాభివృద్ధి విధానం అవసరమని పద్మావతీ రెడ్డి అన్నారు. ఘన వ్యర్థాల సేకరణ, తరలింపు, శాస్త్రీయంగా నిర్మూలనకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు.నగరంలోకి ప్రవేశించే వారికి కనిపించే పరిసరాలే తొలి అభిప్రాయాన్ని కలిగిస్తాయని చెప్పారు. పరిశుభ్రమైన రహదారులు, క్రమబద్ధమైన వ్యర్థాల నిర్వహణ, ప్రజలకు అందుబాటులో ఉండే పౌర సదుపాయాలు నగర అభివృద్ధికి ప్రధాన సూచికలని ఆమె అన్నారు. ప్రతి ఇంటి నుంచి ఘన, జీవ వ్యర్థాలతో పాటు నిర్మాణ శిథిలాలు, ఆసుపత్రుల నుంచి జీవవైద్య వ్యర్థాలు, హోటళ్లు, వీధి ఆహార కేంద్రాల నుంచి ఆహార వ్యర్థాలు వెలువడుతున్నాయని తెలిపారు. మహిళల అవసరాలకు పట్టణ ప్రణాళికలో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని పద్మావతి రెడ్డి సూచించారు. కొత్తగా నిర్మించే ప్రతి షాపింగ్ కాంప్లెక్స్, వాణిజ్య భవనం, ప్రజా వినియోగ భవనంలో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్డి తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

### 20శాతం ఆస్తిపన్ను పెంపు పేదలకు భారం: మాజీమంత్రి దానం నాగేందర్

ప్రధానపట్టణ ప్రాంతంలో ప్రతియేటా 20శాతం పన్నులు పెంపుచేయాలనే ప్రతిపాదన పేదలకు భారంగా మారుతోందని ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని హెచ్చరించారు. క్యూర్ అత్యున్నత మండలిలో ప్రజాప్రతినిధులకు కూడా భాగస్వామ్యం ఇవ్వాలని అదేవిధంగా65శాతం ఉన్న బిసిలకు 34శాతం ప్రాతినిధ్యం అందులో ఉండాలని కోరారు. ఎస్‌సిఎస్‌టి రిజర్వేషన్‌కల్పించాలని కోరారు. ఉపాధిహామి పథకం విలీనగ్రామాలకు వర్తింపచేయాలని సూచించారు. కొత్తగా వ్యవస్థ పరిధిలోకి వచ్చిన 24 గ్రామాల్లో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి పునాది వేయాలని అన్నారు.

# అక్రమ మైనింగ్‌పై కేంద్రస్థాయి విచారణ

## రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై రెండు నెలల్లో చర్యలు

## జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు

## రాష్ట్రానికి కేంద్ర గనుల శాఖ కార్యదర్శి ఉత్తర్వులు

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని కన్‌స్ట్రక్షన్ సంస్థకు జాతీయ మానవ హక్కుల కమిషన్ షాకిచ్చింది. రాజేంద్రనగర్ మానస హిల్స్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ తవ్వకాలు జరుపుతున్నారన్న ఆరోపణలపై ఒక మంత్రి కుటుంబానికి చెందిన ప్రైవేటు కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమ మైనింగ్‌పై కేంద్ర స్థాయిలో విచారణ జరపాలని ఆదేశాలు జారీచేసింది.

ఆ సంస్థపై రెండు నెలల్లో చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర గనుల శాఖ కార్యదర్శికి స్పష్టం చేసింది. అక్రమ మైనింగ్ వ్యవహారంపై కేసు దాఖలు చేసిన తెలంగాణ హక్కుల న్యాయవాదికి సమాచారం ఇవ్వాలని తెలిపింది. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర గనుల శాఖ ఆదేశించింది. దీనికి సంబంధించి లాయర్‌కు కూడా కేంద్ర గనుల శాఖ అధికారికంగా సమాచారం అందించింది.

కాగా రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని మానస హిల్స్ ప్రాంతంలో పర్యావరణ, గనులు, హెచ్‌ఎండీఏ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేకుండానే ఒక ప్రైవేటు కన్‌స్ట్రక్షన్స్ సంస్థ రాత్రింబవళ్లు మైనింగ్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నదని లాయర్ ఒకరు ఈ ఏడాది మార్చిలో ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమ మైనింగ్ ఆరోపణలపై తగినచర్యలు తీసుకోవాలని కేంద్ర గనుల శాఖను ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది.

ఎలాంటి స్టాట్యూటరీ అనుమతులు లేకపోయినా రెవెన్యూ, గనుల శాఖలు, హెచ్‌ఎండీఏ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మౌనం వహించడంపై కమిషన్ ప్రశ్నించింది. రాజేంద్రనగర్ స్థానిక నివాసితులను కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేసి, ఎనిమిది వారాలలోగా పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది.

# ఎమ్మెల్యేలకు అసలు విలువుందో లేదో అర్థంకాని దుస్థితి

## బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** రైటింగ్‌లో ఏదైనా ఆఫీసర్‌కు ఫిర్యా దు చేస్తే సమాధానం రాదు నాలాలు, ఖాళీజాగాలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమిం చినా నో రెస్పాన్స్.. వివిధ డిపార్టుమెంట్ల మధ్య సమన్వయం లేక వేసిన రోడ్లు ధ్వసమయ్యాయి, డ్రైనేజి మీద దృష్టిలేదు కాని గ్లోబల్‌సిటీ కలలు కంటున్నారు. కానీ లక్షల వేల కోట్లు ఎక్కడకు పోతున్నాయంటూ గోషామహల్ బిజెపి ఎమ్మెల్యే రాజసింగ్ ఆవేదనతో ప్రశ్నించారు. ప్రధాన పట్టణ ప్రాంత బిల్లుకు ఆయన మద్దతు ఇస్తూ మాట్లాడుతూ అనేక సూచనలు చేస్తూ విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు అసలు విలువ ఉందో లేదో అర్థంకావడం లేదని ఎమ్మెల్యే రాజాసింగ్ సంశయం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేలు సూచనలు చేసినా, ప్రజ సమస్యలను అధికారుల దృష్టికి తీసు కెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ఈ బిల్లును ప్రవేశ పెట్టడం చాలా మంచి పరిణామమని రాజాసింగ్ కొనియాడారు. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారాలంటే ముందు గల్లీలు బాగుపడాలని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ ఎమ్మెల్యేలందరితో కలిసి కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయాలని తాను సలహా ఇచ్చానని రాజాసింగ్ తెలిపారు. అయితే దురదృష్టవశాత్తూ కెసిఆర్ తన మాట వినలేదని, సమావేశం ఏర్పాటు చేయలేకపోయారని తెలిపారు. ఇప్పుడైనా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిటీ అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యేల బాధ్యతను గుర్తించి, హైదరాబాద్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

# పాడి రైతులకు అండగా నిలుస్తాం

## విజయ డెయిరీని మరింత బలోపేతం చేస్తాం: మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్, సెప్టెంబరు 12,ప్రభాతవార్త:** విజయ డెయి రీని మరింత బలోపేతం చేసి పాడి రైతులకు అండగా నిలు స్తామని పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శాసన మండలిలో శని వారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మె ల్సీలు ఎల్. రమణ, నెల్లికంటి సత్యం, బండ ప్రకాశ్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఎల్ ప్రభావంతో పాల సేకరణలో తాత్కాలికంగా స్వల్ప తగ్గుదల నమోదైందన్నారు. 2023 24లో రోజుకు సగటున 3.60 లక్షల లీటర్లు, 2024 25లో 4 లక్షల లీటర్లు, 2025 26లో 3.36 లక్షల లీటర్ల పాలను సేకరించినట్లు వివరించారు. విజయ డెయిరీ ఆధుని కీకరణ, నాణ్యమైన పాల ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ పెంచడంపై దృష్టి సారిస్తున్నామని తెలి పారు. పాల డిమాండ్, సరఫరా మధ్య వ్యత్యాసాన్ని తగ్గిస్తామని చెప్పారు. పశువైద్యశాఖలో 110 మంది వైద్యులు, 304 మంది కాంపౌండర్లను నియమించినట్లు వెల్లడించారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి పాడి గేదెల పంపిణీతో పాల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

### పాడి పరిశ్రమకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి: సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

పాడి పరిశ్రమకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు అందించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. వ్యవ సాయ రంగంలో పాడి పరిశ్రమ అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పాడి పరిశ్రమకు తగిన ప్రోత్సాహం అందించకపోవడంతో ఈ రంగం క్రమంగా క్షీణించిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి పాలను దిగుమతి చేసుకునే పరిస్థితి రావడం దురదృష్టక రమన్నారు. ఇతర రాష్ట్రాల్లో పాడి పరిశ్రమకు ప్రభుత్వాలు భారీగా ప్రోత్సా హకాలు అందిస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

### తెలంగాణను క్రీడా శక్తిగా తీర్చిదిద్దుతాం: మంత్రి వాకిటి శ్రీహరి

క్రీడలను విద్యతో అనుసంధానం చేసి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్ యూనివర్సిటీ (వైఐపిఇఎస్)ను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీలు బల్మూర్ వెంకట్ నర్సింగరావు, బి. మహేశ్‌గౌడ్, శ్రీపాల్ తదితరులు అడి గిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. వైఐపిఇఎస్ స్పోర్ట్ సైన్స్, స్పోర్ట్ మెడిసిన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, పరిశోధనతో పాటు ఆధునిక శిక్షణకు ప్రాధాన్యం ఇస్తా మని మంత్రి తెలిపారు.

### వరంగల్- నాగ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నాగ్ పూర్ మంచిర్యాల వరంగల్ ఖమ్మం విజ యవాడ గ్రీన్ హైవే నిర్మా ణాన్ని 2027 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేస్తా మని రాష్ట్ర రోడ్లు, భవ నాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సభ్యులు పోచంపల్లి శ్రీని వాస్, ప్రొఫెసర్ కోదండరాం అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఈ హైవే మొత్తం 310 కిలోమీటర్లు కాగా, అందులో 280 కిలోమీటర్లు తెలంగాణలోనే ఉందని మంత్రి తెలిపారు. భూసేకరణలో రైతులకు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### తెలంగాణ సాధనలో కళాకారులది కీలకపాత్ర : మంత్రి జూపల్లి కృష్ణారావు



తెలంగాణ సాధనలో కీలకపాత్ర పోషించిన కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సభ్యులు దాసోజు శ్రవణ్, విజయ శాంతి, అద్దంకి దయా కర్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధాన మిచ్చారు. రాష్ట్ర సాధన లో కీలకంగా వ్యవహరించిన కళా, సాహిత్య రంగాలకు చెందిన ఎనిమిది మంది స్ఫూర్తిప్రదాతలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

### పరిశ్రమలు తరలివెళ్లడం అబద్ధం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



తెలంగాణ నుంచి పరిశ్రమలు ఇతర రాష్ట్రా లకు తరలివెళ్తున్నాయన్న ప్రచారం అవాస్తవమని ఐటి, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ తెలిపారు. కొన్ని మీడి యా సంస్థలు కావాలనే ప్రభుత్వంపై దుష్ప్ర చారం చేస్తున్నాయని అన్నారు. శాసన మండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు పోచంపల్లి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పరిశ్రమలకు టిజిఐఐసి ద్వారా పారదర్శకంగా స్థలాలను కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి ఒక్క పరిశ్రమ తరలివెళ్తే పది పరిశ్రమలను తీసుకొచ్చే సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని అన్నారు. హైదరాబాద్ పాటు వరంగల్ ఐటి హబ్ అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. అలాగే తెలంగాణలో వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం అందిస్తున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ తెలిపారు. రాష్ట్రంలో సుమారు 47 ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్లకు స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. సుమారు 229 ఎకరాలకు సంబంధించి రూ.104 కోట్లు చెల్లించామని, తద్వారా 2 వేలకుపైగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు.

### మహిళల అభివృద్ధికి వెయ్యి రోజుల్లో రూ.70 వేల కోట్ల చేయూత: మంత్రి సీతక్క



మహిళల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. వెయ్యి రోజుల పాలనలో బ్యాంకుల సహకారంతో మహి ళ లకు రూ.70 వేల కోట్ల మేర ఆర్థిక చేయూత అందిం చినట్లు వెల్లడిం చారు. ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ గౌడ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధాన మిచ్చారు. కోటి మంది మహి ళలను కోటీశ్వరులను చేయ డమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, బస్సుల కొనుగోలు, సూక్ష్మ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, మహిళా రైతులకు డ్రోన్ల అందజేత వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.



గర్భిణి లక్ష్మికి వైద్యపరీక్షలు చేస్తున్న గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్

## అరుదైన రక్తస్రావ వ్యాధితో బాధపడుతున్న గర్భిణికి పునర్జన్మనిచ్చిన గాంధీ వైద్యులు

**హైదరాబాద్ (సికిందరాబాద్), సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** అత్యంత అరుదైన రక్త సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఓ నిండు గర్భిణికి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా ప్రసవం చేసి ప్రాణాలు నిలిపారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం ధర్మాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్ భార్య యడ్ల లక్ష్మి (21) పుట్టుకతోనే ఫ్యాక్టర్ 7 డెఫిషియెన్సీ (అలెగ్జాండర్స్ డిసీజ్) అనే అరుదైన రక్తస్రావ రుగ్మతతో బాధపడుతున్నారు. దాదాపు ఐదు లక్షల మందిలో ఒకరికి మాత్రమే వచ్చే ఈ సమస్య కారణంగా శరీరంలో రక్తం గడ్డకట్టడం కష్టమవుతుంది. గతంలో రెండుసార్లు గర్భస్రావమైన లక్ష్మి, మూడోసారి 37 వారాల 6 రోజుల గర్భంతో ఆగస్టు 21న గాంధీ ఆసుపత్రిలో చేరారు. రక్తం గడ్డకట్టే సామర్థ్యం లోపించడం వల్ల ప్రసవ సమయంలో రక్తస్రావమై ప్రాణాపాయం పొంచి ఉండటంతో వైద్యులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించారు. కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సహకారంతో అత్యవసరంగా 65 వయల్స్ రికాంబినెంట్ ఫ్యాక్టర్ 7 ఔషధాన్ని తెప్పించి చికిత్స అందించారు. వైద్య బృందం చేసిన శస్త్రచికిత్స ఫలించి సెప్టెంబర్ 11 సాయంత్రం 6:15 గంటలకు లక్ష్మి రెండు కిలోల బరువుతో కూడిన ఆరోగ్యకరమైన ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ప్రస్తుతం తల్లీ బిడ్డలిద్దరూ క్షేమంగా ఉన్నారని, క్లిష్టమైన ఈ కేసును విజయవంతంగా పూర్తి చేసినందుకు కుటుంబ సభ్యులు గాంధీ వైద్యులకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## క్యూర్ వ్యవస్థ మంచి ఆలోచన

### మరిన్నింటిని కలిపి విశ్వనగరంగా తీర్చిదిద్దాలి

### మొత్తం పాలన సెంట్రలైజ్డ్‌గా ఉండాలి

### శాసనసభలో సిపిఐ పక్ష నేత సాంబశివరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు (క్యూర్) మంచి ఆలోచన అని సిపిఐ శాసనసభా పక్ష నేత కె సాంబశివరావు వ్యాఖ్యానించారు. గ్లోబల్ సిటీగా రూపుదిద్దు కుంటుందని తెలిపారు. అసెంబ్లీలో క్యూర్ బిల్లుపై శనివారం జరిగిన చర్చ సందర్భంగా మాట్లాడుతూ గ్రేడర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను రద్దు చేసి సైబరాబాద్, మల్కాజిగిరి, హైదరాబాద్ కార్పరేషన్లుగా ఏర్పాటు చేయడంతో పాటు, క్యూర్ పరిధిలో మెదక్, సిద్దిపేట్ తదితర చుట్టుపక్కల వాటిని కూడా క్యూర్ పరిధిలోకి తెచ్చి విశ్వ నగరంగా చేయాలని సూచించారు. స్పష్టమైన ప్రణాళికతో క్యూర్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం పట్టణాలు, నగరాల్లోనే ఉన్నారని, హైదరాబాద్ మహానగరంలో జనాభా భారీగా పెరుగుతోందన్నారు. కోర్ రీజియన్‌లో ఉపాధి అవకాశాల నిమిత్తం వచ్చే వారికి పునరావాసం కల్పించాలని చెప్పారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించే వరకు పోరాటం ఆగదు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించే వరకు పోరాటం ఆగదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. శనివారం అబిడ్స్‌లో బిజెపి తెలంగాణ విమోచన కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విమోచనం జాతీయవాదుల పాత్ర సంస్మరణ సదస్సులో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఈ సంస్మరణ కార్యక్రమాన్ని విజయవంతంగా ఏర్పాటు చేసిన తెలంగాణ విమోచన దినోత్సవ కమిటీ బృందాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ.. నిజాం పాలన నుంచి విముక్తి లభించిన సెప్టెంబరు 17వ తేదీ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల భావోద్వేగాలు, అమరుల బలిదానాలతో ముడిపడి ఉన్న సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అసెంబ్లీ 16న మళ్లీ భేటీ

>> రోజుకు పొడిగించింది. శనివారం సభా కార్యక్రమాల అనంతరం అసెంబ్లీని ఈనెల 16వ తేదీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వాయిదా వేశారు. ఆ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 22ఏపై సభలో మాట్లాడనున్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వనున్న నేపథ్యంలో చర్చకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా.. ఎల్‌నినో ప్రభావంపైనా ఆ రోజు అసెంబ్లీలో లఘు చర్చ జరగనుంది. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, వ్యవసాయ రంగంపై పడే ప్రభావం తదితర అంశాలపై సభ్యులు చర్చించనున్నారు. కాగా, శనివారంనాడు సమావేశాల్లో 22ఏ అంశంపై చర్చ జరిగింది. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. మరోవైపు, ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ కారణంగానే సభా సమావేశాలను మరో రోజు పొడిగించినట్లు తెలుస్తోంది. కాగా శాసనమండలి సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

## దేశ రక్షణ సామర్థ్యాలు మరింత బలోపేతం

>> రీజనల్, కనెక్టివిటీని మెరుగుపరచాల్సిన అంశాన్ని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.. దీనిపై స్పందించిన రాజ్‌నాథ్, ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (జెయుఏ)ను అభివృద్ధి చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని, ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని తెలిపారు. గతంలో కూడా ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు సంబంధించి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య పలు సమావేశాలు జరిగాయని చెప్పారు. రక్షణ, పౌర విమానయాన అధికారులు 17 ఏప్రిల్, 2026 నాడు ఆదిలాబాద్ వియానాశ్రయ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంలో.. 2.75 కిలోమీటర్ల రన్ వే నిర్మాణం అవసరమని నిర్ణయించారు. దీంతోపాటుగా ఏఐఎఫ్ వద్ద 369.45 ఎకరాల భూమికి అదనంగా.. రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఇందులో.. ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, వెదర్ షెల్టర్స్, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్స్, ఆపరేషనల్ కాంప్లెక్స్, ట్రైనింగ్ ఫెసిలిటీస్, మెయింటెనెన్స్ ఇన్‌ఫ్రా ఫెసిలిటీస్ ఏర్పాటు చేస్తామన్నారు. పౌర సేవలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఎఐ)ఒక సివిల్ టెర్మినల్‌తో పాటు మెయినెటైన్స్ అండ్ రిపేర్ ఆపరేషన్స్ (ఎంఆర్‌ఓ) పెసిలిటీని ఏర్పాటు చేస్తుంది. వీటితో పాటు అక్కడ పనిచేసే ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి అవసరమైన నివాస, ఇతర మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తారు వివరించారు.

# 22-ఎపై మేం అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పని మంత్రి

### ఎంత బుకాయించినా చేసిన తప్పు నుంచి తప్పించుకోలేరు: మాజీమంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** తాము అడిగిన ఏ ప్రశ్నకూ మంత్రి పొంగులేటి సమాధానం చెప్పలేదని బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో స్పష్టత వస్తుందని అందరూ భావించారని, కానీ నిరాశే మిగిలిందని వ్యాఖ్యానించారు. తమను సస్పెండ్ చేసి.. పొంగులేటి అబద్ధాల ప్రవాహం పారించారని విమర్శించారు. తాము సభలో ఉంటే. అవినీతి, కుంభకోణాలు బయట పెడతామన్న కారణంతోనే సస్పెండ్ చేశారన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. భాజపా, బీఆర్‌ఎస్ ఒకటే అని చెప్పే చిల్లర ప్రయత్నం చేశారని తెలిపారు. ‘22ఏలో ఎన్ని ఎకరాలు పెట్టారో చెప్పాలని కోరితే పొంగులేటి నుంచి సమాధానం లేదు. 22ఏ అంశంపై ప్రశ్నించినందుకే నాపై వ్యక్తిగత దాడి చేశారు. తప్పుడు జాబితా అప్లోడ్ చేశామని చెప్పారు. తప్పు ఒప్పుకొని పొంగులేటి క్షమాపణలు చెబుతారని ఆశించాం. క్షమాపణ చెప్పకుండా మాపై ఎదురుదాడి చేసే ప్రయత్నం చేశారు. సీఎం రేవంత్రెడ్డి ఇంటిని 22ఏ నుంచి రాత్రికి రాత్రి తొలగించారు.. పేదల ఆస్తులపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. మంత్రి పొంగులేటి అబద్దాలు, అర్ధ సత్యాలు చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలపై పొంగులేటి బుకాయించే ప్రయత్నం చేశారు. ఎంత బుకాయించినా చేసిన తప్పు నుంచి తప్పించుకోలేరు. గతంలోనే నిషేధిత జాబితాలో ఉంటే మా హయాంలో రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి? గతంలో ఉన్న సమస్య అయితే పొరపాటు జరిగిందని సారీ ఎందుకు చెప్పారు?

నాదర్‌గుల్, వట్టినాగులపల్లి, ఖాజాగూడ, అబ్దుల్లాపూర్ మెట్ భూముల అంశంపై పొంగులేటి ఎందుకు మాట్లాడలేదు? తన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు నాపై ఎదురుదాడి చేశారు. కాంగ్రెస్ అవినీతి బయట పెట్టినందుకే నాపై బురద జల్లుతున్నారు. భూ భారతిలో రెండు తప్పులు జరిగినట్లు పొంగులేటి ఒప్పుకున్నారు. అంతేకాదు తన మామ భూకుంభకోణానికి పాల్పడ్డాడు అంటూ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన ఆరోపణలకు హరీశ్‌రావు ఇచ్చారు. మా మామ ఏదో భూ కుంభకోణం చేశాడని పొంగులేటి చెప్తున్నాడని, కానీ, అదంతా కట్టుకథ అని ఆయన పేర్కొన్నారు. ‘మా మామ హనుమంతరావు రిటైర్డ్ బ్యాంకు అధికారి. ఆయన చెక్ ఇచ్చి చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఎక్స్ సర్వీస్ మెన్ సత్యనారాయణకు 1995లో అప్పటి ప్రభుత్వం ఆ భూమి అలాట్ చేసింది. ఆ తర్వాత 2010లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే వివీది ఇచ్చింది. ఆ భూమిని అదే కాంగ్రెస్ ప్రభుత్వంలో మా మామ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఆ భూమి రూ.15 కోట్లు అని పొంగులేటి చెప్తున్నాడు, రూ.50 లక్షలు ఇచ్చి భూమి తీసుకో నువ్వే. మిషన్ భగీరథలో మా కుటుంబ సభ్యుల భూమి పోతే డబ్బులు ఇచ్చారు అన్నాడు. ఆ భూమి పోయింది గోదావరి సృజల స్రవంతి అనే కార్యక్రమంలో. అది కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలోనే. నీ కొడుకు బాగోతం, రేవంత్ రెడ్డి బాగోతం కప్పిపుచ్చడానికి నా మీద బురద చల్లుతున్నావు. ఇప్పుడు అధికారంలో ఉన్నది నువ్వే కదా, తప్పు చేస్తే చర్యలు తీసుకో అని హరీశ్‌రావు సవాల్ విసిరారు.

## 2023 నాటికి 22-ఎ జాబితాలో కోటి 2 లక్షల 52 వేల 690 ఎకరాలు

### తొలగించిన ప్రతి ఎకరాకు లెక్కలున్నాయ్: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** 22-ఎ నుంచి తొలగించిన ప్రతి ఎకరాకు లెక్కలున్నాయని, 2023 డిసెంబర్ నాటికి 22ఏ జాబితాలో ఉన్న భూములు వివరాలు సభ ముందు ఉంచుతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 2023 నాటికి 22ఏ జాబితాలో మొత్తం కోటి 2 లక్షల 52 వేల 690 ఎకరాలు ఉన్నాయని అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా సభకు తెలిపారు.

అటవీ భూములు- 42 లక్షల 61 వేల 532 ఎకరాలు,
అసైన్డ్ భూములు - 24 లక్షల 63 వేల 940 ఎకరాలు,
ఇతర ప్రభుత్వ భూములు- 29 లక్షల 35 వేల 554 ఎకరాలు,
ప్రైవేటు వ్యవసాయ భూములు- 3 లక్షల 95 వేల 852 ఎకరాలు,
ప్రైవేటు వ్యవసాయేతర భూమి- 1 లక్ష 95 వేల 812 ఎకరాలు ఉన్నాయని వివరించారు. 22ఏ నుంచి తొలగించి పేదలకు ఇచ్చాం.

ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి మొత్తం 1,02,05,250 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని పొంగులేటి సభకు వివరించారు. “22ఏలోని ప్రభుత్వ వ్యవసాయ భూములు: 96,36,777 ఎకరాలు. ప్రైవేటు వ్యవసాయ భూమి: 3,73,930 ఎకరాలు. వ్యవసాయేతర భూమి: 1,94,543 ఎకరాలు. ఇవి కాకుండా ఎండోమెంట్ భూములు 5,12,792 ఎకరాలు. బీఆర్‌ఎస్ దిగిపోయేనాటికి, ఇప్పటికి నిషేధిత జాబితాలోని భూమి 47,440 ఎకరాలు తగ్గింది. 23వేల ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు ఇచ్చాం. పాత జీవోల్లోని తప్పులను గుర్తించి... మరో 20వేల ఎకరాలను 22ఏ నుంచి తొలగించాం. 22ఏ నుంచి తొలగించిన మొత్తం 47,440 ఎకరాల్లో ప్రతి ఎకరాకు లెక్కలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో తొలగించిన 23వేల ఎకరాలకు లెక్కలు లేవని కమిటీ చెప్పింది. భువనగిరిలో 25 వేల ఇళ్లు 22ఏలో ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. ఆయన చెప్పినవి అసైన్డ్ భూముల్లో ఉన్న ఇళ్లు. ఇబ్రహీంపట్నం పరిధి రాందాస్‌పల్లిలో 1300 ఎకరాల గురించి హరీశ్ రావు మాట్లాడారు. ఆ భూమి దశాబ్దాలుగా నిషేధిత జాబితాలోనే ఉంది. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ అప్పుడు ఎందుకు పట్టించుకోలేదు అని పొంగులేటి ప్రశ్నించారు.

## రోజుకు 12.1 లక్షల క్యూబిక్ మీటర్ల ఒబి తొలగింపే లక్ష్యం : సింగరేణి సిఎండి

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తగినంత బొగ్గును అందించాల్సి ఉన్నందున దీని కోసం సవరించిన ఓవర్ బర్డెన్ లక్ష్యాలైన రోజుకు 12.1 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగిపే లక్ష్యంగా పనిచేయాలని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్నారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన సమావేశంలో సింగరేణి వ్యాప్తంగా 15 ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ తవ్వి తీసే పనులు నిర్వహిస్తున్న 19 ఆఫ్ లోడింగ్ సంస్థల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, దీనికి అనుగుణంగా సింగరేణి సంస్థ తన వంతుగా తగినంత బొగ్గును థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు సరఫరా చేసేందుకు ప్రణాళికలు అమలు జరుపుతోందని చెప్పారు. దీనికి అనుగుణంగా ఓపెన్ కాస్ట్ గనుల్లో సవరించిన ఓబీ తొలగింపు లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి ఆగస్టు నెల వరకు 1,205 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించే లక్ష్యాన్ని నిర్దేశించగా, 101 శాతంతో 1,221 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించడం జరిగిందన్నారు. అయితే మొత్తం 19 ఆఫ్ లోడింగ్ సంస్థలలో ఆగస్టు నెలాఖరు వరకు 8 ఆఫ్ లోడింగ్ సంస్థల వారు మాత్రమే 100 శాతం ఓవర్ బర్డెన్ లక్ష్యాలు సాధించారని, మిగిలిన వారు లక్ష్యాలు సాధిస్తూ సహకరించాలన్నారు. కాగా సెప్టెంబర్ నెలలో నిర్దేశిత రోజువారీ ఓబీ తొలగింపు లక్ష్యం 7.28 లక్షల క్యూబిక్ మీటర్లుగా భావించినప్పటికీ పెరుగుతున్న బొగ్గు డిమాండ్ కు అనుగుణంగా రోజువారీ లక్ష్యాన్ని 12.1 లక్షల క్యూబిక్ మీటర్లుగా నిర్ణయించామని దీనికి అనుగుణంగా లక్ష్యాలు సాధించాలని కోరారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాలు ఖచ్చితంగా సాధించాలని ఆదేశించారు.

జె.వి.ఆర్ ఓ.సి, మణుగూరు ఓ.సి, జి.డి.కె ఓ.సి, ఆర్.జి ఓ.సి3, ఆర్.జి ఓ.సి2, కె.టి.కె ఓ.సి2, శ్రీరాంపూర్ ఓ.సీలలో ఓబీ తొలగిస్తున్న కొన్ని ఆఫ్ లోడింగ్ సంస్థల వారు లక్ష్యాల సాధనలో కొంత వెనుకబడి ఉన్నారనీ, వెనుకబడిన లక్ష్యాల సాధనతో పాటు తాజాగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని కోరారు. కొత్త ఓపెన్ కాస్ట్ గనులకు సంబంధించిన ఓబీ తొలగింపు ఆఫ్ లోడింగ్ టెండర్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, ఎం. తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎబివిపి కార్యకర్తలపై పోలీసుల తీరు గర్హనీయం

### కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్రఆగ్రహం

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** ఎబివిపి కార్యకర్తలపై పోలీసుల తీరుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రజా స్వామ్య పద్ధతిలో నిరసన చేస్తే కాళ్లు చేతులు విరగ్గొడతారా? అంటూ ప్రశ్నించారు. అధికార పార్టీ నిరసనలకు రెడ్ కార్పెట్ వేసి ప్రతిపక్ష పార్టీ, విద్యార్థి సంఘాలపై అమానుషంగా ప్రవర్తించడం దుర్మార్గ అన్నారు. విద్యార్థులని చూడకుండా ఇష్టరీతిన గొడ్డున బాదినట్లు చావగొడతారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్‌కు పోయే కాలం దాపురించిందన్నారు. ప్రశ్నించే వాళ్లపై దాడులు చేస్తూ భయపెట్టాలని చూస్తుందన్నారు. అరెస్ట్ చేసిన ఏబివిపి నాయకులను బేషరతుగా విడుదల చేయాలన్నారు. కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంవల్ల అటు పై చదువులకు వెళ్లలేక, ఇటు ఉద్యోగాలు రాక అడ్డాకూలీలుగా మారుతున్న విద్యార్థులపట్ల మీకు కనికరం లేదా? తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జిఒ నెంబర్ 9ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## కేసులను కోర్టుల్లో ఎదుర్కొంటాం

>> చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటామని చెప్పారు. అయితే హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలపై ఏం చర్యలు తీసుకున్నారని రాష్ట్ర డీజీపీని ప్రశ్నించారు. ఈ చెత్త కేసును మేం కోర్టుల్లో ఎదుర్కొంటాం. కానీ హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సమయంలో మిస్ ఇంగ్లాండ్‌తో అభ్యంతరకరంగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకులపై ఆమె చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు ఏమయ్యాయి? అని కేటీఆర్ ప్రశ్నించారు. నిందితులను తెలంగాణ పోలీసులు ఇంకా కాపాడుతున్నారా? దీనిపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వద్ద సమాధానం ఉందా? అని ప్రశ్నించారు.. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

అసెంబ్లీ గేటు ముందు జరిగిన గందరగోళం నేపథ్యంలో ముఖ్యమంత్రి తన పోలీసులతో బీఆర్‌ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనని కేటీఆర్ ఆరోపించారు. 2025లో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలంటూ తీవ్ర ఒత్తిడి తెచ్చారని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై ఆరోపించారు. మేం పోటీలకు వచ్చామో, దేనికి వచ్చామో అర్థం కాలేదు. ఇవేం పోటీలు? అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

తనకు ఎదురైన అసౌకర్యంతో మిస్ వరల్డ్ 2025 పోటీల నుంచి మ్యాగీ అర్ధాంతరంగా వైదొలిగి ఇంగ్లాండ్‌కు వెళ్లిపోయారు. స్వదేశానికి చేరుకున్న తర్వాత ఆమె చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో రాజకీయ దుమారానికి దారితీశాయి. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. మ్యాగీ ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం సైతం సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామాలపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు.

## క్యాబ్ డ్రైవర్ అనుమానాస్పద మృతి

### హైదరాబాద్‌లోని బేగంపేటలో అదృశ్యమై పటాన్‌చెరులో లభించిన మృతదేహం

### మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు



రాజశేఖర్ (ఫైల్)


**హైదరాబాద్ (బేగంపేట) సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** బేగంపేటలో మిస్సింగ్ అయిన క్యాబ్ డ్రైవర్ పటాన్ చెరు పరిధిలో అనుమానాస్పద మృతి చెందిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన వెలుగులోకి రావడంతో సీబీఎన్‌నగర్‌లోని మృతుని నివాసం వద్ద కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుని సోదరి రజిత ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసారు. అయితే రాజశేఖర్ (25) అనుమానాస్పద స్థితిలో హత్యకు గురవడంతో కేసును అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇన్స్‌పెక్టర్ పి. సైదులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా పాతర్ల పాడు కు చెందిన రాజశేఖర్ (25) గడచిన 25ఏళ్లుగా రసూల్‌పురా పరిధిలోని సీబీఎన్ నగర్‌లో భార్య లీల, ఇద్దరు కుమార్తెలు 6, 4లతో కలిసి జీవిస్తు న్నాడు. క్యాబ్ నడుపు కుంటూ జీవిస్తున్నాడు. సెప్టెంబరు 11వ తేదీన తెల్లవారు ఝామున గం 2.30లకు మారేడు పల్లిలో చివరి ప్యాసింజర్ ను దింపిన రాజశేఖర్ ఆ తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. ఉదయం గం 4.30నిల సమయంలో అతని మొబైల్, వాహనం చివరగా సంగారెడ్డి ఆర్టీసీ కాలనీ సమీపంలో లోకేషన్ చూపించగా ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచాఫ్ అయింది.

మృతుని సోదరి రజిత ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. అయితే ముంబై జాతీయ రహదారి పటాన్ చెరు పోలీసు స్టేషన్ పరిధిలోని సంగారెడ్డి సమీపంలో రాజశేఖర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది పడి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. దీంతో ఈ కేసును హత్య కేసుగా మార్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పఠాన్ చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మరో వైపు మృతదేహం లభించిన ప్రదేశానికి సుమారు 50కిలో మీటర్ల దూరంలో కోహీర్ పోలీసుస్టేషన్ పరిధిలోని కంకోల్, బుధేరా టోల్ గేట్ దాటిన తర్వాత రాజశేఖర్ స్విఫ్ట్ కారును వదిలేసి వెళ్లినట్లు గుర్తించారు. కారు పైనే తాళాలు పెట్టి ఉండటం, పరిసరాల్లో ఖాళీ బీరు సీసాలు పడి ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు అతడిని హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన పై క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిస్తుంది. దర్యాప్తును వేగవంతం చేసినట్లు ఇన్స్‌పెక్టర్ తెలియజేసారు.

## మాజీమంత్రి హరీశ్‌రావు 100 ఎకరాలు కాజేశారు

### టిఆర్‌ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపణ

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ హయాంలో సిద్దిపేటలో ప్రొహిబిటెడ్ లిస్టులోని 100 ఎకరాల భూమిని హరీశ్‌రావు తన తండ్రి పేరు మీదకు బదలాయించుకున్నారని టిఆర్‌ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి దమ్ముంటే దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. 22ఏపై కాంగ్రెస్ ఇప్పుడు ఎన్ని అక్రమాలు చేస్తుందో అంతకంటే ఎక్కువ బిఆర్‌ఎస్ హయాంలో జరిగాయని చెప్పారు. తన వద్ద ఉన్న ఆధారాలను ప్రభుత్వానికి పంపుతున్నానని, చర్యలు తీసుకోవాలన్నారు.



## పశ్చిమాసియాలో శాంతి కోసం భారత్ కట్టుబడి ఉంది : రాష్ట్రపతి ముర్ము

### ముర్ముతో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో శాశ్వత శాంతి నెలకొల్పేందుకు భారత్ కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. ప్రాంతీయ సమస్యలు, ఘర్షణలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో రాష్ట్రపతి ముర్ము ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ లక్ష్యాలపై అమెరికా తాజాగా వైమానిక దాడులు చేయడంతోపాటు, కఠిన ఆంక్షల ద్వారా ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచేందుకు వాషింగ్టన్ ప్రయత్నాలు కొనసాగిస్తున్న సమయంలో ఈ భేటీ జరిగింది. భారత్‌లో తొలిసారి పర్యటిస్తున్న ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్‌కు రాష్ట్రపతి ముర్ము స్వాగతం పలికారు. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహించిన సమయంలో ఇరాన్ అందించిన సహకారాన్ని ఆమె ప్రశంసించారు. భారత్-ఇరాన్ దేశాల మధ్య ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలపై ఇరువురు నేతలు చర్చించారు. ముఖ్యంగా ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన సాంస్కృతిక, ప్రజా సంబంధాల గురించి వారు ప్రస్తావించినట్లు రాష్ట్రపతి భవన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. పశ్చిమాసియాలో శాశ్వత శాంతి కోసం భారత్ తన చిత్తశుద్ధిని మరోసారి స్పష్టం చేసిందని, అన్ని ఘర్షణలకు చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కారం కనుగొనాలని రాష్ట్రపతి ముర్ము పిలుపునిచ్చారని ప్రకటన తెలిపింది. పశ్చిమాసియాలో ప్రస్తుత ఘర్షణలు ఈ ఏడాది ఫిబ్రవరి చివర్లో ప్రారంభమయ్యాయి. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ ముందురోజు ప్రధానిమోడీతో కూడా భేటీ అయ్యారు.

## క్యూర్ రద్దు చేయాలి

### హైదరాబాదీయులకు వ్యతిరేకం

### రిమోట్ కంట్రోల్ వ్యవస్థకు శ్రీకారం

### నగరవాసులపై ఆస్తిపన్ను రెట్టింపు భారం

### మేయర్లు, కౌన్సిలర్లు అధికారాలు హరింపు

### రాజ్యాంగేతర సంస్థగా హైడ్రా

### అసెంబ్లీలో బిజెపి సభ్యుడు పాల్వాయి హరీశ్

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** హైదరాబాద్ ప్రజలకు వ్యతిరేకంగా కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు (క్యూర్) ఉందని, ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ డిమాండ్ చేశారు. మేయర్లు, కౌన్సిలర్ల అధికారాలను హరించే ఈ బిల్లును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. శాసనసభలో క్యూర్ బిల్లుపై శనివారం జరిగిన చర్చలో హరీష్ మాట్లాడుతూ క్యూర్ ద్వారా స్థానిక ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడిగా అభివర్ణించారు. దశాబ్దాల హైదరాబాద్ వ్యవస్థను రాత్రికి రాత్రే రద్దు చేసి మహానగరాన్ని మూడు ముక్కలు చేయడం సరికాదన్నారు. క్యూర్‌తో ఆస్తిపన్ను రెట్టింపు అయి సామాన్యులపై పెద్ద ఎత్తున భారం పడుతుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆస్తి పన్ను కింద ఇప్పుడు 13 వేల రూపాయలు కట్టే గృహ యజమాని క్యూర్ వ్యవస్థతో అది రెట్టింపు అయి 27 వేలకు చేరుతుందని ఆరోపించారు. క్యూర్ బిల్లుపై 15 వేల అభ్యంతరాలు వస్తే అందులో 13 వేలు ఆస్తిపన్నుకు సంబంధించినవే ఉన్నాయన్నారు. ప్రధానంగా కార్పొరేషన్ పాలకవర్గానికి ఉన్న అధికారాలను హరించి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. మేయర్లు, కార్పొరేటర్లు అధికారాలు కోల్పోయి ఉత్సవ విగ్రహాల్లా ఉండపోయే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు. క్యూర్ పరిపాలన అంతా ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పడే అపెక్స్ కౌన్సిల్ నియంత్రణలోకి వెళ్లిపోతుందని ఇది ఎంత మాత్రం సహేతకం కాదన్నారు. క్యూర్ పరిపాలన, విధానాపరమైన నిర్ణయాలు అంతా ముఖ్యమంత్రి కార్యాలయం చేతుల్లోకి వెళ్లి సర్వాధికారాలను చెలాఇస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రిమోట్ కంట్రోల్ వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇది ఆత్మహత్యా సదృశ్యం అని, స్థానిక సంస్థల అధికారాలకు గొడ్డలిపెట్టన్నారు. విపరీత ధోరణులకు ఆస్కారం కల్పించినట్లవుతోందని చెప్పారు. అంతేకాకుండా అధికార దుర్వినియోగం జరిగే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ క్యూర్ వ్యవస్థతో భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని, కోర్టుకు వెళితే బిల్లును కొట్టేయడం తప్పనిసరి అని తెలిపారు. మెట్రో వాటర్ వర్క్స్‌ను కూడా విభజించే ఆలోచన జరుగుతున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ప్రజలకు అధికారం కావాలి కాని, ప్రజలపై పెత్తనం వహించడం సరికాదని చెప్పారు. అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకోవడం స్థానిక ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. రాజ్యాంగ వికేంద్రీకరణపై దాడి జరగడంగా పేర్కొన్నారు. ఇక హైడ్రా రాజ్యాంగేతర సంస్థగా తయారయిందని విమర్శించారు. కోర్టులు మొట్టికాయలు వేసినా మారడం లేదని వ్యాఖ్యానించారు.

# 'మిలటరీ'లో తూతూ మంత్రంగా భద్రత

**- బొల్లారంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీలో వెలుగుచూసిన డొల్లతనం - ఉగ్రవాదులకు సమాచారం అందితే అంతే సంగతులు - రక్షణ శాఖకు హోం శాఖ నివేదిక - 55 మంది అధికారులపై చర్యలకు రక్షణ శాఖ సన్నద్ధం**

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** దేశ రక్షణ శాఖలో భద్రతా వ్యవస్థ డొల్లగా వుందని బొల్లారంలోని మిలటరీ ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీ తేటతెల్లం చేసింది. దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారం ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీ కేసులో విశ్రాంత సైనికుడు నిందితుడుగా తేలడం రక్షణ శాఖను షాక్కు గురిచేసింది. (బ్రిగేడియర్ (సివిల్ విభాగంలో ఐజి స్థాయి అధికారి) స్థాయి అధికారి పర్యవేక్షణ లో కొనసాగే మిలటరీ విభాగాలకు ఉప అధికారులుగా లెఫ్టినెంట్ కల్నల్ (సివిల్లో ఎస్పీ స్థాయి అధికారి) స్థాయి అధికారులు వుంటారు. ఈ క్రమంలో అనేక రక్షణ వ్యవస్థలు వుంటాయి. ఈ వ్యవస్థలను దాటుకుని చీమకూడా వెళ్లేందుకు వీలుండదు. బయటి వ్యక్తులు వచ్చేందుకు అవ కాశం అసలు వుండదు. సాధారణ విభాగాల్లోనే ఇంతటి రక్షణ వుంటే ఆయుధ గోదాముల వద్ద మరింత భద్రత వుంటుందనడంలో ఎలాంటి స ందేహం లేదు. ఇంతటి భద్రత వున్న మద్రాస్ రెజిమెంట్ విభాగం ఆయుధ గోదాము నుంచి ఒక విశ్రాంత సైనికుడు (ఇతన్ని గత జూన్ నెలలో బలవంతంగా పదవీ విరమణ చేయించారు) ఎకె 47 తుపాకులు, ఇన్సాస్ తుపాకి, పిస్టళ్లు, తుటాలు, రాత్రిల్లో చూడగలిగే బైనాకులర్స్ చోరీ చేసే యడం, రెండవసారి మళ్లీ రావడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. ఇంత జరుగుతున్నా అక్కడ పహారాకాస్తున్న సాయుధ గార్డులు ఒక్క రు కూడా గమనించలేదంటే భద్రత ఎంత డొల్లగా వుందో ఊహించుకోవచ్చు. అర్ధరాత్రి వేళ ఒంటరిగా బైక్పై వచ్చిన మల్లేష్ అలియాస్ రాజు అనే విశ్రాంత సైనికుడు ఆయుధాలను, మందుగుండు సామాగ్రిని దానిపైనే తీసుకువెళ్లాడు. అతను అక్కడ దాదాపు రెండు గంటల పాటు వున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అయినా కూడా ఎవరూ గమనించలేదు. ఈ సమయంలో అక్కడ సిసి కెమెరాలు పనిచేయలేదు. సిసి కెమె రాలు పనిచేయక పోవడం వెనుక మరో వింత కథ వెలుగు చూసింది. ఇక్కడ పనిచేసే సిబ్బంది రాత్రి ఎనిమిది లేదా తొమ్మిది గంటల తరువా త వెళ్లిపోయే సమయంలో లైట్లు, ఫ్యాన్లను ఆపివేసేందుకు స్విచ్ ఆఫ్ చేస్తారు. ఈ స్విచ్ ఆఫ్ చేస్తే సిసి కెమెరాలు కూడా ఆగిపోతాయి. దీ ని కనెక్షన్లు లైట్లు, ఫ్యాన్లకు వుండే కనెక్షన్కు అనుసంధానంగా వుంది. ఇలాంటి అపసవ్య వ్యవస్థ దేశంలో ఆ మాటకు వస్తే ప్రపంచంలో ఎక్క డా వుండక పోవచ్చు. ఈ విషయం విశ్రాంత సైనికుడు రాజుకు ముందుగానే తెలుసు. అతను ఇదే విభాగంలో గతంలో పనిచేసి వుండడంతో అక్కడి భద్రతా వ్యవస్థలోని అన్ని లోపాలు అతనికి తెలుసు. సరిగ్గా ఈ క్రమంలోనే అతను అతి సులభంగా అక్కడి నుంచి ఆయుధా రాలు, మందుగుండు సామాగ్రిని చోరీ చేయగలిగాడు. బొల్లారం మిలటరీ విభాగంలో దొంగతన చేసిన విశ్రాంత సైనికుడు వాటిని ఏం చేయాలో తే ల్చుకోలేక పోయాడు. తనను బలవంతంగా పదవీ విరమణ చేయించినందుకు పై అధికారులపై కక్షతో అతనీ ఈ నేరం చేశాడు. ఒకవేళ ఇక్కడి భద్రతా వ్యవస్థలోని డొల్లతనాన్ని ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులు తమకు అనుకూలంగా మలచుకుంటే దానికి బాధ్యులెవరనే దానికి రక్షణ శా ఖ అధికారులే సమాధానం చెప్పాలి.

**ఆయుధాల చోరీపై రక్షణ శాఖకు హోం శాఖ నివేదిక...55 మందిపై చర్యలకు రక్షణ సన్నద్ధం**

మరోవైపు బొల్లారంలో మిలటరీ ఆయుధాల చోరీపై హోం శాఖ రక్షణ శాఖకు ఒక నివేదికను అందజేసింది. ఆయుధాల చోరీ ఎలా జరిగింది ..? ఇందులో వెలుగుచూసిన వైఫల్యాలు, నిందితుడి వివరాలు అన్నీ వున్నాయి. ఈ నివేదికను రక్షణ శాఖ పరిశీలించి 55 మంది మిలటరీ అ ధికారులపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



'జాతీయ హిందీ దివాస్' వేడుకలను ప్రారంభిస్తున్న బి.మహేష్కుమార్గౌడ్, చిత్రంలో సచిన్ సావంత్, వి.హెచ్, రాజేష్ అగర్వాల్ తదితరులు

# హిందీ భాషను పరిరక్షించుకోవాలి:

## బి.మహేష్కుమార్గౌడ్ పిలుపు

**సైఫాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** హిందీ జాతీయ భాష అని, దీనిని అందరూ గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలంగాణ పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్కుమార్గౌడ్ చెప్పారు. సెక్యులర్ దేశమైన భారత దేశంలో అన్ని భాషలు, ప్రాంతాలు, కులాలు, మతాలకు సమానమైన గౌరవం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగుతోపాటు హిందీ, ఉర్దూ భాషలు కూడా మిస్సితంగా వాడుకలో ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్, హైదరాబాద్ హిందీ జర్నలిస్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం బషీర్బాగ్ ప్రెస్క్లబ్ లో జరిగిన 'జాతీయ హిందీ దివాస్'వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్య దేశంలో ఒక వర్గాన్ని వెళ్లగొట్టడమనేది సరికాదని, మార్వాడీ గోబ్యాక్ అని ఉద్యమం జరగడం బాధాకరమన్నారు. మర్వాడీలు కూడా తెలంగాణలో అంతర్భాగమేనని స్పష్టం చేశారు. ఐదేవల కాలంలో హిందీ చదివేవారి సంఖ్యతగ్గిపోవడం బాధాకరంగా ఉందని, హిందీభాష ప్రచారంతోపాటు దీన్ని ప్రజలకు మరింతగా చేరువ చేయ డంలో ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ మాట్లాడుతూ దేశంలో కొన్ని విచ్ఛిన్నకర శక్తులు మాటలు, కులాలు, భాష ప్రజల మధ్య చిచ్చు పెడుతు న్నారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హిందీ దేశ భాష అని ఇది అందరిని కలుపుతుందని, పరిరక్షించుకోవాలని సూచించారు. మైనార్టీ సెల్ ఛైర్మన్ రాజేష్ అగర్వాల్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో, తెలంగాణ రాష్ట్రంలో హిందీ భాష పరిరక్షణకు ప్రభుత్వాలే కృషి చేశాయని చెప్పారు. ఈ వేడుకల్లో బిసి సంక్షేమ శాఖ సలహాదారు వి.హనుమంతరావు, రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్అలీ, సెల్ నాయకులు రాజేష్గోయల్, ప్రకాష్రతి, ప్రదీప్సురానా, ప్రకాష్జైన్, హైదరాబాద్ హిందీ జర్నలిస్ట్స్ సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజయ్కుమార్శుక్ల, ఎం.ఎ.సర్వర్, కార్యదర్శి కన్నయ్యసింగ్, కోశాధికారి రమేష్, ముజిబ్ తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దుల్లో ఇళ్లు ఖాళీచేయిస్తున్నారని విషప్రచారం

## సోషల్మీడియా సందేశాలను నమ్మవద్దంటూ సైన్యం ప్రకటన

**శ్రీనగర్, సెప్టెంబరు 12:** జమ్మూకశ్మీర్లోని నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) సమీపంలో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయని, అక్కడి ప్రజలను ఇళ్లు ఖాళీ చేయమని సైన్యం ఆదేశించిందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని భారత సైన్యం తీవ్రంగా ఖండించింది. ఇదంతా నిరాధారమైన, తప్పుడు ప్రచారమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇండియన్ ఆర్మీ అధికారిక ఫ్యాక్ట్చెక్ విభాగం నేడు ఖిఎక్స్ఖి (ట్విట్టర్) వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. ఉత్తర కశ్మీర్లోని కుప్వారా, బారాముల్లా జిల్లాల్లోని ప్రధాన సైనిక స్థావరాల సమీపంలో నివసించే వారిని ఇళ్లు ఖాళీ చేయాల్సిందిగా ఆర్మీ కోరినట్టుగా కొన్ని నివేదికలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ వార్తలకు, నియంత్రణ రేఖ వద్ద ఉగ్రవాదుల కదలికలు పెరిగాయనడానికి సంబంధం ఉందంటూ కశ్మీరీ ఇంటెల్ ఖాతా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆర్మీ తెలిపింది. ఈ ఖాతా పాకిస్థాన్ ఆధారిత ప్రచార ఖాతా అని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే దీని లక్ష్యమని పేర్కొంది. నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయనడం, అసాధారణ స్థాయిలో సైన్యం మోహరింపు జరుగుతోందనడం పూర్తిగా అవాస్తవం" అని ఆర్మీ అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రచార ఖాతా ఐరోపా కేంద్రంగా పనిచేస్తూ, కశ్మీర్లోని పరిస్థితులపై తప్పుడు కథనాలను సృష్టించడానికి ప్రయత్నిస్తోందని వివరించారు. గతంలోనూ పలుమార్లు ఈ ఖాతా నుంచి ఇలాంటి నకిలీ వార్తలు వ్యాప్తి అయ్యాయని గుర్తుచేశారు. నిర్ధారణ లేని ఉగ్రవాద వాదనలు, ఆధారాల్లేని సైనిక మోహరింపు కథనాలు, ఊహాజనిత సంబంధాలను కలిపి తప్పుడు సమాచారాన్ని సృష్టిస్తున్నారని ఆర్మీ తన పోస్టులో పేర్కొంది. ఏదైనా సమాచారాన్ని ఇతరులకు చేరవేసే ముందు దానిని ధ్రువీకరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఇటువంటి వదంతులను నమ్మవద్దని, వాటిని వ్యాప్తి చేయవద్దని సైన్యం ప్రజలను కోరింది.

# 19 మంది చిన్నారులకు గుండె చికిత్సలు

## నిమ్స్లో ఐదో పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ క్యాంప్ విజయవంతం



చికిత్స నిర్వహించిన వైద్య బృందంతో డాక్టర్ రాహుల్ దేవరాజ్

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** నిమ్స్ లో నిర్వహించిన ఐదో పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ క్యాంప్లో 19 మంది చిన్నారులకు క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. సెప్టెంబర్ 6 నుంచి 12 వరకు జరిగిన ఈ శిబిరంలో యూకేకు చెందిన వైద్య నిపుణుల బృందం, ప్రముఖ పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమణ ధన్నపునేని నేతృత్వంలో నిమ్స్ వైద్యులతో కలిసి సేవలందించింది. శిబిరంలో వెయ్యి మందికిపైగా చిన్నారులకు వైద్య పరీక్షలు, సలహాలు అందించారు. శస్త్రచికిత్స అవసరమని గుర్తించిన చిన్నారులకు తదుపరి దశలో నిమ్స్ లో చికిత్స అందించనున్నారు. యూకే నిపుణులు రోగుల పడకల వద్దకు వెళ్లి వైద్య సూచనలు అందించారు. శిబిరంలో అందించిన సేవలను ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ తదితర ప్రభుత్వ పథకాల కింద ఉచితంగా అందించినట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద నిమ్స్ లో ఈసీఎంఓ సేవలు అందించడం ప్రత్యేకమన్నారు. హీలింగ్ లిటిల్ హార్ట్స్ సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరం 2023, 2024, 2025లో జరిగిన క్యాంపులకు కొనసాగింపుగా జరిగిందన్నారు.

శిబిరంలో పాల్గొన్న వైద్య నిపుణులను రాహుల్ దేవరాజ్ సన్మానించారు. కార్యక్రమంలో కార్డియోవాస్క్యులర్ అండ్ థోరాసిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎం. అమరేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలని స్వచ్ఛ కార్మికుల అసెంబ్లీ ముట్టడి



చలో అసెంబ్లీ ముట్టడికి ప్రదర్శనకు వెళుతున్న కార్మికులు

**సైఫాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** శ్రమశక్తిపై ఆధారపడి జీవిస్తున్న స్వచ్ఛ కార్మికులు ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేస్తూ శనివారం చలో అసెంబ్లీ ముట్టడికి యత్నం చేసిన వందలాది మంది కార్మికులను పోలీసులు విడతల వారిగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. తొలుత ఎల్బి స్టేడియం సమీపంకు అనేక మంది కార్మికులు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడే బందోబస్తులో ఉన్న పోలీసులు వారిని అసెంబ్లీ వైపు వెళ్ళనీయకుండా అడ్డుకున్నారు. కొద్ది సేపు ఉద్రిక్తత పరిస్ధితి ఏర్పడింది. అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఆదే విధంగా వివిధ ప్రాంతాల నుంచి అసెంబ్లీ వైపు వెళ్ళడానికి ప్రయత్నించిన కార్మికులను పోలీసులు అడుగడుగున అడ్డుకున్నారు. అంతకు ముందు మహిళా కార్మికులు లక్ష్మి, సరోజ, జయమ్మ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తూ జీవనం కొనసాగిస్తున్నామని చెప్పారు. చెత్త సేకరణ పనులను ప్రభుత్వ రాంకీ అప్పగించే ప్రతిపాదనతో తమకు ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్త సేకరణ బాధ్యతలను రాంకీ అప్పగించకుండా గతంలో వలే ప్రభుత్వం స్వచ్ఛా కార్మికులతోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా నగర పరిశుభ్రతకు పాటుపడుతున్న కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని, గతంలో వలే చెత్త సేకరణ అవకాశాన్ని తమకు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



మంత్రి పొన్నం ప్రభాకర్ను కలిసివినతి పత్రం అందిస్తున్న ఆటో సంఘాల జెఎసి నేతలు

# ఆటోల మీటర్ చార్జీలు పెంచాలి

**రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ను కలసిన ఆటో సంఘాల జెఎసి నాయకులు**


**ముషీరాబాద్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** ఆటో మీటర్ చార్జీలు 40 రూపాయలకు పెంచాలని, కిలోమీటర్కు 18 రూపాయలుగా ప్రకటించాలని తెలంగాన ఆటో రాష్ట్ర సంఘాల యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం తెలంగాణ ఆటో రాష్ట్ర సంఘాల యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నేతలు రవాణాశాఖామంత్రి పొన్నం ప్రభాకర్ను కలసి వినతి పత్రం అందచేశారు. ఈనెల 7వ తారీఖు ఆటో యూనియన్ నాయకులు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలుచేస్తామని మంత్రి ప్రకటించినట్లు వారు తెలిపారు. ఆటో కార్మికుల వెల్ఫేర్ బోర్డును విధి విధానాలు రూపొందిస్తున్నామని, అదే విధంగా ప్రభుత్వం ఒక యాప్ రూపకల్పన చేయటం జరుగుతుందని అన్నారు. జీవో నెంబర్ 263లో గల మిగిలిన ఆటో పర్మిటీస్ వెంటనే ఇస్తామని మంత్రి తెలిపారు. మంత్రిని కలసిన వారిలో జేఏసీ నాయకులు బి.వెంకటేశం, ఏ.సత్తిరెడ్డి, ముఖేష్గౌడ్, ఎంఎ సలీం, వి.ప్రవీణ్, ఎండి మజీద్, అజయ్బాబు, రాంకిషన్ పాల్గొన్నారు.

# చలో అసెంబ్లీ ముట్టడి చేపట్టిన ఎబివిపి విద్యార్థుల అరెస్టు

**సైఫాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** విద్యా రంగ సమస్యలను పరిష్కారించాలని, ఫీజుల రీయంబర్స్మెంట్, స్కాలర్షిప్ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమాన్ని శనివారం గన్పార్కు నుంచి అసెంబ్లీ వైపుకు దూసుకువెళుతున్న ఆనేక మంది ఎబివిపి విద్యార్థులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ఎబివిపి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు అరెస్టుకు పూనుకోవడంతో విద్యార్థులు, పోలీసుల మధ్య వాగ్వివాదం జరిగింది. తొక్కిసలాట జరిగి ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. దీంతో కరీంనగర్ జిల్లా నుంచి వచ్చిన విద్యార్థి రాకేష్కు ఊపిరి ఆడక స్పృహ తప్పి కిందపడిపోయారు. తోటి విద్యార్థులు, పోలీసులు అప్రమత్తమై ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం సమీప ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఎబివిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంబాబు, సహాయ కార్యదర్శి కల్యాణి తదితరులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థులకు ఫీజుల రీయంబర్స్మెంట్ బకాయిలను చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతున్నదని ఆరోపించారు. విద్యా సంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు ఆలివేలు, రాజు, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# హౌతీ యోధుల అధీనంలోకి పెరిమ్ ద్వీపం

**సనా, సెప్టెంబరు 12:** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. యెమెన్లోని బాబ్ అల్మందేబ్ జలసంధికి సమీపంలో ఉన్న పెరిమ్ ద్వీపంపై ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ యోధులు పట్టు సాధించినట్లు వచ్చిన నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ఈ ప్రాంతంపై హౌతీల నియంత్రణ ఏర్పడితే ప్రపంచంలోని ముఖ్యమైన సముద్ర వాణిజ్య మార్గాల్లో ఒకటైన బాబ్అల్మందేబ్ ద్వారా నౌకల రాకపోకలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతిదారుల్లో ఒకటైన సౌదీ అరేబియాకు ఈ పరిణామం పెద్ద సవాలుగా మారింది. ఇప్పటికే ఎర్ర సముద్రం, హోర్ముజ్ జలసంధి ప్రాంతాల్లో రవాణాకు అంతరాయాలు ఎదురవుతున్న నేపథ్యంలో పెరిమ్ ద్వీపంపై హూతీల పట్టు పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చే అవకాశం ఉంది. ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఏడెన్తో కలిపే బాబ్అల్మందేబ్ జలసంధి ప్రపంచ సముద్ర వాణిజ్యంలో అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకటి. యూరప్, ఆసియా, మధ్యప్రాచ్యాల మధ్య నౌకల రాకపోకలకు ఈ మార్గం ముఖ్యమైనది. ఈ ప్రాంతంలో సాయుధ సంఘర్షణలు పెరిగి నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడితే చమురు, గ్యాస్తో పాటు ఇతర సరుకుల రవాణాపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. హౌతీ యోధులు యెమెన్ ప్రభుత్వ దళాల నుంచి ఎర్ర సముద్ర తీరంలోని పలు వ్యూహాత్మక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పెరిమ్ ద్వీపంతో పాటు తీర ప్రాంతంలోని ధుబాబ్ నగరం కూడా ఉన్నట్లు సమాచారం. అంతకుముందు కీలకమైన మోచా పోర్ట్ నగరాన్ని కూడా హౌతీలు తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. దీనికి ప్రతిస్పందనగా సౌదీ అరేబియా యుద్ధ విమానాలు మోచా నగరంలోని విమానాశ్రయంపై దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని నివేదికలు చెబుతున్నాయి. హౌతీలకు, సౌదీ మద్దతు ఉన్న భద్రతా బలగాలకు మధ్య జరిగిన పోరులో సౌదీ అరామ్కోకు చెందిన ఈస్ట్వెస్ట్ ఆయిల్ పైప్లైన్ దెబ్బతిన్నట్లు సమాచారం. పైప్లైన్ ప్రాంతం నుంచి భారీగా నల్లటి పొగలు వెలువడినట్లు నివేదికలు పేర్కొన్నాయి. పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఈ పైప్లైన్ ద్వారా చమురు సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సౌదీ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈస్ట్వెస్ట్ పైప్లైన్ సౌదీ అరేబియా చమురు రవాణా వ్యవస్థలో కీలకమైనదిగా భావిస్తారు. ఇలాంటి కీలక మౌలిక సదుపాయాలపై దాడులు లేదా నష్టం జరిగితే దేశ చమురు ఎగుమతులపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇరాన్అమెరికా మధ్య కొనసాగుతున్న ఘర్షణల కారణంగా సౌదీ అరేబియా చమురు ఎగుమతులు భారీగా తగ్గినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. రోజుకు సుమారు 60 లక్షల బ్యారెళ్ల స్థాయి నుంచి 23 లక్షల బ్యారెళ్లకు ఎగుమతులు పడిపోయినట్లు సమాచారం. బాబ్అల్ మందేబ్, హోర్ముజ్ అనే రెండు కీలక జలమార్గాల్లోనూ నౌకల రాకపోకలు తీవ్రంగా దెబ్బతింటే ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థపై భారీ ప్రభావం పడే అవకాశం ఉంది.



# ఆర్టీసి డ్రైవర్ కుటుంబానికి రూ.42 లక్షల పరిహారం..

**నందిగామ సెప్టెంబర్ 12, ప్రభాతవార్తప్రతినిధి:** డ్రైవర్గా పనిచేస్తూ ప్రమాదంలో మృతి ఘటనలో దాదాపు ఏడేళ్ళ తరువాత ఆయన కుటుంబానికి అదనపు జిల్లా కోర్టులో న్యాయం జరిగింది. బాధిత కుటుంబానికి రూ.42 లక్షల ఆర్థిక భరోసా అందింది. 2019లో ఆర్టీసీ డ్రైవర్గా పనిచేస్తున్న శనగపాడు రమణ మృతి ఘటనకు సంబంధించి బాధ్యుల నుంచి ఎటువంటి పరిహారం అందలేదు. ఈ దశలో ఆయన కుటుంబ సభ్యులు న్యాయస్థానంను ఆశ్రయించారు. న్యాయస్దానం ఆదేశాల మేరకు రూ.42,00,000 పరిహారం అందజేశారు. ఈ వ్యవహారంపై నందిగామ 16వ అదనపు జిల్లా కోర్టులో ఎంవివోపీ.50/2019 కేసు విచారణ జరిగింది. కోర్టు ఆదేశాల మేరకు ఇరు పక్షాల కక్షిదారులు, న్యాయవాదుల సమక్షంలో నందిగామ 16వ అదనపు జిల్లా జడ్జి పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.42 లక్షల చెక్కును అందజేశారు. ఆర్టీసీ తరఫున న్యాయవాది చిరుమామిళ్ల శ్రీనివాసరావు సహకారం అందించారు.

# తల్లి మృతి.. తట్టుకోలేక కొడుకు బలవన్మరణం





మృతి చెందిన తల్లి బేతమ్మ, కొడుకు ప్రవీణ్

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** మండలంలోని మక్త లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ఓ కుటుంబంలో చోటుచేసుకున్న విషాద ఘటన తీవ్ర కలకలం రేపింది. కుటుంబ గొడవల నేపథ్యంలో భార్య నాగాధర్ బేతమ్మ (45) హైదరాబాద్లోని దుండిగల్ లో ఆత్మహత్యకు పాల్పడగా.. తల్లి మృతిని తట్టుకోలేక కుమారుడు నాగాధర్ ప్రవీణ్ (21) కూడా మండల పరిధిలోని కోలపల్లి గ్రామ శివారులో ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మక్త లక్ష్మాపూర్కు చెందిన నాగాధర్ శివయ్య, బేతమ్మ దంపతులు ఏడాది క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్కు వెళ్లి బౌరంపేటలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దంపతులు ఇద్దరూ వాచ్మెన్లుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శుక్రవారం కుటుంబంలో గొడవ జరిగిన అనంతరం బేతమ్మ ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. తల్లి మృతి విషయం తెలుసుకున్న కుమారుడు ప్రవీణ్ తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. తల్లి మరణాన్ని తట్టుకోలేక అదే రోజు రాత్రి సొంత గ్రామమైన లక్ష్మాపూర్ కు చేరుకొని, అక్కడినుండి కోలపల్లి శివారుకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కొద్ది గంటల వ్యవధిలోనే తల్లి, కుమారుడు మృతిచెందడంతో మక్త లక్ష్మాపూర్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు వేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

# నాడు ధరణి,నేడు భూభారతి రెండు వ్యవస్థలు ఒక్కటే

**అసెంబ్లీలో బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్రెడ్డి విమర్శలు**

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** నాడు ధరణి, నేడు భూభారతి రెండు వ్యవస్థలు ఒక్కటేనని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో లక్షల ఎకరాలను బీఆర్ఎస్ నేతలు కొల్లగొట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో చెప్పారని.. కానీ ఆ భూములను సీఎం రేవంత్రెడ్డి ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోట్లేదని ప్రశ్నించారు. శనివారం సాయంత్రం ఆయన అసెంబ్లీలో మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధ్యుల మీద ఏం చర్యలు తీసుకున్నారని నిలదీశారు.

గతంలో రిజిస్ట్రేషన్లు తప్పుడుగా జరిగినట్లే, భూభారతి తీసుకొచ్చాక కూడా రిజిస్ట్రేషన్లు అలాగే జరిగాయని ప్రస్తావించారు. ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్టుపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. అవసరం లేని భూములను 22ఏ లో చేర్చడంతోనే ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. బాధితులు కాళ్ల అరిగేలా తిరుగుతున్నారన్నారు.

# బ్రిక్స్లో ఉమ్మడి కరెన్సీ ప్రతిపాదన లేదు: విదేశాంగ శాఖ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** బ్రిక్స్ దేశాల మధ్య ఉమ్మడి కరెన్సీని ప్రవేశపెట్టే ప్రతిపాదన ప్రస్తుతం లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం స్పష్టం చేసింది. బ్రిక్స్ దేశాలు పరస్పర వాణిజ్య లావాదేవీలను ఆయా దేశాల స్థానిక లేదా జాతీయ కరెన్సీల్లో నిర్వహించే అంశంపైనే దృష్టి సారిస్తున్నాయని తెలిపింది. బ్రిక్స్ దేశాలు ఏకాభిప్రాయంతో న్యూఢిల్లీ డిక్లరేషన్ను ఆమోదించిన నేపథ్యంలో విదేశాంగ మంత్రిత్వ శాఖలో ఆర్థిక సంబంధాల కార్యదర్శి సుధాకర్ దలేలా ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం బ్రిక్స్లో ఉమ్మడి కరెన్సీని ప్రవేశపెట్టే ప్రతిపాదన ఏదీ లేదని దలేలా స్పష్టం చేశారు. సభ్య దేశాల మధ్య స్థానిక కరెన్సీల్లో వాణిజ్య లావాదేవీలను పరిష్కరించే అంశంపై కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయని, ఇది కొత్త పరిణామం కాదని తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యంలో లావాదేవీల వ్యయాన్ని తగ్గించేందుకు స్థానిక కరెన్సీల్లో చెల్లింపులు చేయడం ఆచరణాత్మక విధానమని భారత్ భావిస్తోందని దలేలా వివరించారు. ఇది ప్రస్తుతం ఉన్న అంతర్జాతీయ చెల్లింపులు, సెటిల్మెంట్ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కాదని, దానికి అనుబంధంగా పనిచేస్తుందని చెప్పారు. తద్వారా ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యాన్ని మరింత పెంచే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం బ్రిక్స్లో బ్రిక్స్ కరెన్సీని ప్రవేశపెట్టే ప్రతిపాదన లేదు. స్థానిక కరెన్సీల్లో వాణిజ్య సెటిల్మెంట్లపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. ద్వైపాక్షిక వాణిజ్యంలో లావాదేవీల ఖర్చును తగ్గించేందుకు స్థానిక కరెన్సీ సెటిల్మెంట్ ఒక ఆచరణాత్మక విధానం. ఇది ప్రపంచ చెల్లింపులు, సెటిల్మెంట్ వ్యవస్థకు అనుబంధంగా ఉండాలని దలేలా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బ్రిక్స్ దేశాల సమగ్ర 45 పేజీల ఢిల్లీ డిక్లరేషన్ పత్రాన్ని ఆమోదించినట్లు ప్రకటించారు.

# పుతిన్, జిన్పింగ్ చేతులు పట్టి కరచాలనంచేసిన ప్రధాని మోడీ

**తన ఇన్స్టాగ్రామ్లో ఫోటో పోస్టు బ్రిక్స్ప్రారంభం అని ట్యాగ్లైన్**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** దేశరాజధానిలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్పింగ్లు చేతులు పట్టుకున్న ఫొటోను ప్రధాని మోడీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆసియా దేశాల మధ్య ఉన్న బలమైన సంబంధాలకు ఈ చిత్రం ప్రతీకగా నిలిచింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, ఇండోనేషియా ప్రధాని ప్రబోవో సుబియాంటో కూడా ఈ ఫొటోల్లో కనిపించారు. బ్రిక్స్ సదస్సు 2026 ఢిల్లీలో ప్రారంభమైంది అంటూ ప్రధాని మోడీ ఇన్స్టాగ్రామ్లో పోస్ట్ చేశారు. కీలక ద్వైపాక్షిక సమావేశాల నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్లోబల్ సౌత్ దేశాలు ప్రపంచ నిర్ణయ ప్రక్రియలో నిర్ణయాత్మక పాత్ర పోషించాలి.

# సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనాలు

## మౌలిక సదుపాయాల నిధిలో మార్పులు

**రాష్ట్రాలకు అందించే ఆర్థిక సహాయంలో విధాన నిర్ణయం**

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త** రైతులకు ప్రయోజనాన్ని కలిగించే మౌలిక సదుపాయాల నిధి పకంలో కేంద్రం మార్పులు తీసుకువస్తోంది. ప్రధానంగా చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం ప్రయోజనాలు అందించడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు చేపట్టింది. వ్యవసాయ మౌలిక సదుపాయల నిధి కింద రాష్ట్రాలకు అందించే ఆర్థిక సహాయం విషయంలో మార్పులు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. వ్యవసాయ మౌలిక సదుపాయల నిధి పథకం కింద గల అర్హతను రాష్ట్ర ఏజెన్సీలు, ఏపీఎంసీలకు, జాతీయ, రాష్ట్ర సహకార సమాఖ్యలు, రైతు ఉత్పత్తి సంస్థల సమాఖ్యలు, స్వయం సహాయక బృందాల సమాఖ్యలకు విస్తరించడం జరిగింది. ఇప్పటి వరకూ 2 కోట్ల రూపాయల మేర రుణానికి సంబంధించిన నిబంధనల ప్రకారం ఈ పథకం కింద ఇచ్చే వడ్డీ సహాయాన్ని ఒక ప్రాంతంలో పని చేసే సంస్థకే ఇవ్వడం జరుగుతోంది. ప్రస్తుతం తీసుకురాబోతున్న మార్పుల ప్రకారం ఈ వడ్డీ సహాయాన్ని వివిధ ప్రాంతాల్లో పని చేసే అటువంటి అన్నిప్రాజెక్టులకు కూడా ఇవ్వడం జరుగుతుంది. అయితే ప్రైవేటు రంగ సంస్థ విషయంలో మాత్రం ఇటు వంటి ప్రాజెక్టులు 25కు మించి ఉండకూడదు. కానీ 25 ప్రాజెక్టు నిబంధన అనేది రాష్ట్ర సంస్థలు, జాతీయ సంస్థలు, రాష్ట్ర సహకార సమాఖ్యలు, ఎఫ్పిఓ సమాఖ్యలకు ఎస్హెచ్జి సమాఖ్యలకు వర్తించదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పథకానికి సంబంధించి ఏపీఎంసీల విషయంలో 2 కోట్ల రూపాయల వరకూ ఉండే రుణాలకు సంబంధించిన వడ్డీ సహాయాన్ని వివిధ మౌలిక సదుపాయల ప్రాజెక్టులకు ఇవ్వడం జరుగుతుంది. ఒకటే మార్కెట్ యార్డులోని కోల్డ్ స్టోరేజ్, సార్టింగ్, గ్రేడింగ్, అస్సేయింగ్ యూనిట్లు, సిలోస్ తదితర మౌలిక సదుపాయల ప్రాజెక్టుల కిందకు వస్తాయని తెలిపారు. కాగా లబ్దిదారులను తొలగించడం, చేర్చడానికి సంబంధించి స్ఫూర్తి.

# వినాయక నైవేద్యాలు

వినాయకచవితి పండుగను తెలుగు రాష్ట్రాల్లో కొంతమంది రెండు రోజులు జరుపుకుంటారు. ఒక రోజు నోము చేసుకుని తరువాతి రోజు వ్రత కథ చెప్పుకుంటారు. ఉండ్రాళ్లు, వడపప్పు, పానకం, చలిమిడి, పులిహోర, శనగలు, పాల తాలికలు, కుడుములు , శనగ గుగ్గిళ్లు ఇలా ఎన్నో రకాలను స్వామికి నైవేద్యంగా సమర్పిస్తారు.



## ఉండ్రాళ్లు



బియ్యప్పిండి: 1 కప్పు, నెయ్యి: కొద్దిగా ఉప్పు, చిటికెడు నీళ్లు : 1 కప్పు. ఉండ్రాళ్లలో నింప డానికి... పచ్చికొబ్బరి కోరు: 1 కప్పు కొబ్బరి పొడి: 1/2 కప్పు, వేయించిన గసాలు, కొద్దిగా యాలకుల పొడి: 1/2 స్పూను.

**తయారు చేసే విధానం :** కొబ్బరి, బెల్లం, యాలకుల పొడి, గసాలు కలిపి ఒక పాన్‌లో వేడి చేయ్యాలి. ఈ మిశ్రమం కాస్త ఉండకట్టే మాదిరి అయ్యేవరకు ఉంచి దించాలి. ఒక గిన్నెల్లో నీళ్లు తీసుకుని వేడి చెయ్యాలి. కప్పు నెయ్యివేసి మరిగిన తరవాత బియ్యప్పిండి కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు కట్టకుండా కలుపుతుండాలి. తక్కువ మంట పైన పిండిని ఉడికించి గట్టిపడిన తరువాత దీన్ని ఒక వెడల్పాటి పళ్లెంలోకి తీసుకుని చల్లార్చాలి. పిండిని నెయ్యి రాసుకున్న చేత్తో కలిపి చిన్న ఉండను తీసుకుని బాల్‌లాగా తయారుచేసి అందు లో కొబ్బరి పాకాన్ని కొద్దిగా ఉంచి మూసివేసి గుండ్రంగా ఉండ్రాళ్లలా చుట్టాలి. వీటిని వేడిగా/ చల్లారాక నేతితో కలిపి తింటే ఎంతో రుచిగా ఉంటాయి.

## ఆవిరి కుడుములు



**కావలసిన పదార్థాలు :** నానబెట్టిన బియ్యం రెండు కప్పులు, బెల్లం తురుం ఒకటిన్నర కప్పులు, కొబ్బరి ముక్కలు అర కప్పు, నెయ్యి నాలుగు చెంచాలు, యాలకుల పొడి చిటికెడు

**తయారీ విధానం:** నానిన బియ్యాన్ని మెత్తటి పిండిలా చేసుకోవాలి. కొబ్బరి ముక్కలను నేతిలో వేయించి పెట్టుకోవాలి. వెడల్పాటి గిన్నెలో బెల్లం తురుం వేసి ఒకటిన్నర కప్పుల నీటిని పోసి కలుపుతూ కరిగించాలి. ఆపైన బియ్యప్పిండిని కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు రాకుండా కలపాలి.తరువాత వేయించిన కొబ్బరి ముక్కలు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. అయిదు నిమిషాల తరువాత ఈ పిండిని పిడికిలితో తీసుకుని కుడుముల మాదిరి చేసి నెయ్యి రాసిన ఇడ్లీ ప్లేట్లలో ఉంచాలి. ఇడ్లీ పాత్రలో కొన్ని నీళ్లు పోసి ఈ ప్లేట్లు పెట్టి పావు గంటసేపు ఆవిరి మీద ఉడికించి దించాలి.

## పాల తాలికలు



**కావలసినవి :** గోధుమపిండి : 1/4 కప్పు, నీళ్లు: సరిపడినన్ని, యాలకులపొడి: చిటికెడు, బియ్యపిండి : ఒక కప్పు. **తయారు చేసే విధానం :** గోధుమ పిండి, చపాతీ పిండిలా కలుపుకొని సేమియాలా సన్నగా పొలికలు తయారు చేసుకొని వెడల్పాటి పళ్లెంలో వేసుకొని ఆరనివ్వాలి. ఒక గిన్నెలో రెండు కప్పుల నీళ్లు పోసి తాలికలు ఉడికించాలి. తరువాత పొడిగా చేసిన బెల్లం వేసి మరికొంతసేపు ఉడికించి, తర్వాత బియ్యప్పిండి నీళ్లల్లో కలిపి పాలు మరిగే నీళ్లల్లో ఉండలు కట్టకుండా వేసుకోవాలి. కొద్దిగా ఉడికిన తరువాత యాలకుల పొడి వేయాలి.

## పాకం పూరీలు



మైదాపిండి: ఒక కప్పు, ఉప్పు: తగినంత, నెయ్యి: పావు కప్పు, చక్కెర: ఒక కప్పు, యాలకుల పొడి: అర టీస్పూన్, నూనె: వేయించడానికి సరిపడా.

**తయారీ విధానం** ఒక గిన్నెలో మైదా, కొద్దిగా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ గోరువెచ్చని నెయ్యి వేసి బాగా కలిపి తగినన్ని నీళ్లు పోసి ముద్దలా కలిపి అరగంటపాటు పక్కన పెట్టాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి చక్కెర వేసి అరగ్లాసు నీళ్లుపోసి తీగపాకం వచ్చేవరకు కలపాలి. పాకం వచ్చాక యాలకుల పొడి వేసి బాగా కలపాలి. పిండిని కొద్దికొద్దిగా తీసుకుని పూరీలా ఒత్తి మధ్యలో నెయ్యి రాసి నాలుగు మడతలు వేసి మళ్లీ ఒత్తుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి, బాగా వేడయ్యాక.. అప్పటికే చేసి పెట్టుకున్న పూరీలను రెండువైపులా కాల్చి చక్కెరపాకంలో వేయాలి. ఒక నిమిషం చక్కెర పాకంలో నానిన తర్వాత తీసి ప్లేట్లో పెట్టుకుంటే నోరూరించే పాకం పూరీలు సిద్ధం. మైదా ఇష్టపడని వాళ్లు గోధుమపిండితోనూ చేసుకోవచ్చు

## గుగ్గిళ్లు



పెద్ద శనగలు అర కప్పు, అలసందలు అర కప్పు, పల్లీలు అర కప్పు, చిన్న శనగలు అర కప్పు, పచ్చి కొబ్బరి తురుం పావు కప్పు, ఎండు మిరపకాయలు రెండు, ఇంగువ చిటికెడు, ఉప్పు తగినంత, కరివేపాకు ఓ రెమ్మ, కొత్తిమీర తరుగు కొద్దిగా, ఆవాలు పావు చెంచా, నెయ్యి రెండు చెంచాలు

**తయారీ విధానం:** పెద్ద శనగలు, చిన్న శనగలు, పల్లీలను విడివిడిగా శుభ్రంగా కడిగి అవి మునిగే వరకు నీటిని పోసి ఎనిమిది గంటలు నానబెట్టాలి. అలాగే అలసందలను కూడా కడిగి నాలుగు గంటలు నాననివ్వాలి. తరువాత వీటన్నింటినీ ఉప్పు వేసి మరీ మెత్తగా కాకుండా ఉడికించాలి. ఆపైన నీటిని వంచేయాలి. స్టవ్ మీద కడాయి పెట్టి నెయ్యి వేసి కరిగించి అవాలు, ఎండు మిర్చి ముక్కలు, ఇంగువ, కరివేపాకు వేయాలి. తరువాత ఉడికించిన శనగలు, పల్లీలు, అలసందలు వేసి కలపాలి. ఉప్పు సరిచూసుకుని చివరగా పచ్చి కొబ్బరి తురుం, కొత్తిమీర తరుగు వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. □

# ఆహార భద్రతలో కీలకపాత్ర మహిళలే



**ఆహార భద్రత... ప్రతి వ్యక్తికీ తగినంత ఉత్పత్తిలో, సురక్షితమైన, పోషకాలతో కూడిన ఆహారం లభించే హక్కు దీన్లో ఆహారంతోపాటు నిల్వ, పంపిణీ, వినియోగం... ఇలా అన్ని అంశాలూ ఉంటాయి. వీటిని సాధించడంలో మహిళది కీలకపాత్ర. కానీ కష్టానికి తగ్గ ప్రతిఫలం, గుర్తింపు, ప్రోత్సాహం ఆ అన్నపూర్ణకు లభించడం లేదు.**

భారతదేశ జనాభాలో సుమారు 70 శాతం మంది మహిళలు గ్రామీణ ఉత్పత్తులను సమకూర్చారు. వీరిలో చాలా మంది వ్యవసాయ రంగంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. వ్యవసాయ శ్రామికశక్తిలో సుమారు మూడో వంతు మహిళల విత్తనాలు నాటడం, కలుపు తీయడం, కోత, విత్తన సంరక్షణ, పశుపోషణ, పంటల వంటి నిల్వ బాధ్యతల్లో మహిళలు చురుగ్గా పాల్గొంటు న్నారు. ఆహార ఉత్పత్తిలోనే కాదు, వినియోగం, పోషణ, కుటుంబ ఆరోగ్యంలో కూడా మహిళలదే ప్రధాన బాధ్యత. మహిళలు స్థానిక విత్తన వైవిధ్యాన్ని, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను పాటిస్తూ పర్యావరణ మార్పును కాపాడు తున్నారు. చిన్న స్థాయి కూరగాయలు, కమ్యూనిటీ సీడ్ బ్యాంకులు కుటుంబాలు, సమాజ స్థాయిలో ఆహార భద్రతను బలోపేతం చేస్తున్నారు. ప్రపంచ ఆహార సంస్థ(ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్‌ఎఫ్‌ఎఓ) ప్రకారం, మహిళలకు పురుషులతో సమాన స్థాయిలో వనరులు, సాంకేతిక పరి జ్ఞానం అందిస్తే, వ్యవసాయం ఉత్పాదకత 20-30 రెట్లు పెరిగే అవకాశం ఉంది. ఆహార భద్రత పరంగా మహిళల సహకారం ఎంతో ఉంటుంది, ఆ విధంగా వారు అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. భారత్‌లో మహిళల పేరుపై 13 వ్యవసాయ భూమి ఉంది. సాగుపై ఆసక్తి ఉన్నప్పటికీ సామాజిక నిబంధనలు వారిని చాలాచోట్ల గృహాపర మైన పనులకు పరిమితం చేస్తున్నాయి.

**ఆ ప్రోత్సాహం సరిపోతుందా? ...**

దేశ ఆహార భద్రతను బలోపేతం చేయాలంటే మహిళలకు వనరులు, విద్య, ఆరోగ్యం, నిర్ణయ శక్తి అందించాలి. వారు సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాల ద్వారా కలిసి పనిచేస్తే, సామూహిక శక్తి పెరుగుతుంది. వారి మాటకు విలువ వస్తుంది. మహిళలకు భూమి హక్కులు, రుణ సౌకర్యాలు, శిక్షణా కార్యక్రమాలు, పోషకాహార అవగాహన కార్యక్రమాలు అందించడం ద్వారా ఆహార ఉత్పత్తి, నిల్వ, పంపిణీ వ్యవస్థలు బలోపేతం అవుతాయి. తారలుగా మహిళలు ఆహార భద్రతకు వెన్నెముకగా నిలుస్తున్నారు. హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఫర్ బెటర్ ఫుడ్ అండ్ ఎ బెటర్ ఫ్యూచర్ 2025 ఆహార దినోత్సవ నినాదం. ఆహార భద్రతను సాధించడానికి ప్రభుత్వాలూ, ఎన్జీఓలూ, బోర్డులలూ... చేతులు కలపాలంటోంది ప్రపంచ ఆహార సంస్థ. అందులో మహిళలకూ చోటుండాలి. మహిళా సాధికారతకు సహకరించడం వల్ల ఆకలి, పేదరికం, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించవచ్చు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజం స్థిరమైన అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది. మహిళా సాధికారతతోనే ఆహార భద్రత, దేశాభివృద్ధి సుసాధ్యం. □

# పూజగది శుభ్రత ఇలా !



వాస్తు శాస్త్రం ప్రకారం పూజగదిని ఈశాన్యం ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల ధ్యానం, పూజ ప్రశాంతంగా సాగిపోతాయి. అంతేకాదు, ఇంట్లో ప్రసరించే సూర్యుడి లేలేత కిరణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఎక్కువ స్థలం ఉన్నట్లయితే ఇంటి మధ్యలో పూజగది ఉంటే మంచిది. స్థలం లేకుంటే వంటింట్లోనే ఈశాన్య దిక్కున పూజమందిరాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఎట్టి పరిస్థితిలో పడక గదుల్లో పూజగది ఉండకూడదు. పూజ గదిలో విగ్రహాలను ఈశాన్యం, తూర్పు లేదా పడమర దిక్కున పెట్టుకోవచ్చు. దీనికి కారణం సూర్యకిరణాలు ఉదయం ఈశాన్య, తూర్పు దిక్కు నుంచి, సాయంత్రం పడమర నుంచి ప్రసరిస్తాయి. ఇవి విగ్రహాల మీద పడి భక్తి భావనను పెంపొందిస్తాయి. విగ్రహాలను ఉత్తర దిక్కున పెడితే ప్రార్థించేవారు దక్షిణ ముఖంగా కూర్చోవలసివస్తుంది. ఇది వాస్తు రీత్యా మంచిది కాదు. దేవుడిగదిలో విరిగిన విగ్రహాలు, చిరిగిన చిత్రపటాలు ఉండకూడదు. అలాగే విగ్రహాలను ఒకదానికి ఎదురుగా ఒకటి పెట్టకూడదు. మనం విగ్రహాలను చూస్తూ పూజించాలే గానీ అవి ఒకదాన్ని మరొకటి చూస్తున్నట్టుగా ఉంచకూడదు. పూజ సామాన్లను గదిలో ఆగ్నేయ దిక్కున భద్రపరచాలి. అవి విగ్రహాలకు, మనం కూర్చోవడానికి అడ్డు లేకుండా చూడాలి. కొందరు మరణించిన పెద్దల మీది గౌరవ భావంతో వారి పొటలు పూజగదిలో పెడతారు. అది సరి కాదు. అవి మన దృష్టిని మరల్చడమే కాదు.. బాధాకరమైన విషయాలను జ్ఞాపకం తెచ్చే అవకాశం ఉంది. పూజగదిలో బంగారం, ధనం లాంటి విలువైన వస్తువులను దాచకూడదు. పూజగదిని సదా పరిశుభ్రంగా ఉంచాలి. ఆ గదికి తలుపులున్న ద్వారానే రెండు ఎంచుకోవాలి. గడప తప్పనిసరిగా ఉండాలి. గోడలకు తెలుపు, లేత పసుపు, లేతనీలం లాంటి లేత రంగులే వేయాలి. దీని వల్ల మనసు ప్రశాంతంగా ఉండి దేవుడిపై దృష్టి నిలుస్తుంది. □

తెర

# ఆదర్శ కుటుంబం టీజర్ విడుదల



వెంకటేష్ - త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో మరో వినోదాత్మక చిత్రం:విక్టరీ వెంకటేష్, స్టార్ రైటర్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం"ఆదర్శ కుటుంబం - AK47e టీజర్ తాజాగా విడుదలైంది. కుటుంబ నేపథ్యంతో కూడిన వినోదం, యాక్షన్, చమత్కారమైన సంభాషణలతో టీజర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంది. మధ్యతరగతి కుటుంబం.. ఆ కుటుంబంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు.. వాటి చుట్టూ అల్లుకున్న వినోదం.. ఇలా"ఆదర్శ కుటుంబం - AK47eప్రపంచాన్ని టీజర్ ఆసక్తికరంగా పరిచయం చేసింది. వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్‌తో అలరించగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ మార్క్ చమత్కారమైన రచన, పదునైన సంభాషణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదే సమయంలో టీజర్‌లోని ఎనర్జిటిక్ యాక్షన్ సన్నివేశాలు సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నారా రోహిత్, నివేదా పేతురాజ్, యువినా, రాజ్ ప్రజ్వల్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, ఉదయ్‌బీర్ సంధు, వెన్నెల కిషోర్, రఘుబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు."ఆదర్శ కుటుంబం - AK47e చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం త్రివిక్రమ్ శ్రీనివాస్ అందిస్తున్నారు. వెంకటేష్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా ఒక కంప్లీట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది.సంగీతం థమన్ ఎస్, ప్రొడక్షన్ డిజైన్ ఏ.ఎస్. ప్రకాష్, ఎడిటింగ్ నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ రవి కె. చంద్రన్.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ ప్రతిష్ఠాత్మక బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో పలు విజయవంతమైన, బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన ఈ సంస్థ నుంచి వస్తున్న మరో ఆసక్తికరమైన చిత్రంగా"ఆదర్శ కుటుంబం - - AK47e రూపొందు తోంది.టీజర్‌కు లభిస్తున్న స్పందనతో పాటు వెంకటేష్ కామెడీ టైమింగ్, త్రివిక్రమ్ మార్క్ రైటింగ్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్, యాక్షన్ అంశాలు, భారీ తారాగణం సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి.

# ప్యారడైజ్ కష్టపడి చేసిన సినిమా: నాని




న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్"ది ప్యారడైజ్. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సంద ర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో న్యాచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మీ అందరినీ కలిసి చాలా రోజులవుతుంది. ఎప్పుడూ నా కెరీర్‌లో ఒక సినిమాకి మరో సినిమాకి ఇంత గ్యాప్ రాలేదు. ఈ ప్రెస్ మీట్‌కి వస్తూ ఉంటే నా ఫస్ట్ సినిమాకి ఎంత నెర్వస్‌గా ఉన్నానో అంతే నెర్వస్‌గా ఉన్నానని అనిపించింది. మైక్‌లో మాట్లాడడం అలవాటు తప్పింది. ఫైనల్‌గా సెప్టెంబర్ 24న వస్తున్నాం. డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సినిమా మొదలైనప్పటి నుంచి మీడియా వారు చాలా సపోర్ట్ చేస్తున్నారు. సినిమా రిలీజ్ అయ్యే వరకు ఈ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. సినిమా నుంచి ఏది వచ్చినా సరే ఆడియన్స్‌లో బ్లాస్ట్ అవుతుంది. సాంగ్స్, టీజర్‌ను చాలా పాజిటివ్‌గా తీసుకుంటున్నారు. నా"సినిమ్మా అనేకంటే "జనం సినిమ్మా అనడం కరెక్ట్ అని నాకు అనిపిస్తుంది. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు నాని టీమ్ సమాధానాలు ఇచ్చారు.శ్రీకాంత్.. ఈ సినిమాలో చాలా ఇంటెన్స్ పదాలు ఉన్నాయి కదా.. సెన్సార్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నారు? ఇందులో చాలా అద్భుతమైన ఎమోషన్ ఉంది. ఆ ఎమోషన్ చూపిస్తే అందరూ కన్విన్స్ అవుతారు.

# ‘సీక్రెట్ సోల్జర్’18న విడుదల



నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా సీక్రెట్ సోల్జర్. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు.ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. యూనిక్ కాన్సెప్ట్, ఆకట్టుకునే ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో విడుదలైన టీజర్ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఖైనా పీస్‌గా మొదలైన ప్రయాణం"సీక్రెట్ సోల్జర్‌గా ఎలా మారింది? చైనా పీస్ పేరుతోనే టీజర్ రిలీజ్ చేశాను. అలాగే రెండు పాటలు కూడా విడుదల చేశాను. అదే పేరుతో చాలా మార్కెటింగ్ చేశాం. మార్చిలో సినిమా రిలీజ్ చేద్దామని సెన్సార్‌కు పంపించాను. సెన్సార్ నుంచి అభ్యంతరాలు వచ్చాయి. రివ్యూ కమిటీలు, ఈబీసీ చైర్మన్, మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్.. ఇలా అన్ని స్థాయిలు దాటుకుని లిస్టు పంపించారు. సెన్సార్‌లో దాదాపు 8 నెలలు ఈ సినిమా ఉన్నప్పటికీ, మేం ఏ ఆలోచనతో సినిమా తీశామో.. ఆ ఆలోచన విషయంలో ఎలాంటి ఇబ్బంది రాలేదు. మా డైరెక్టర్ విశ్వనాథ్ చాలా కష్టపడ్డారు. ఇందులో యాక్షన్ ఏ రేంజ్‌లో ఉంటుంది? ఇది స్పై డ్రామా. ఇందులో స్పై యాక్షన్ కూడా చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. ఈ కథ ఏమిటి? ఇండియాకి సంబధించిన ఓ కీలక ఇన్ఫర్మేషన్ లీక్ అయింది. ఆ సంఘటనకి నెల్లూరులో చాలా సాదాసీదాగా బతికే ఇద్దరు కుర్రాళ్లకి లింక్ ఏమిటి? ఆ సమస్యను పరిష్కరించగలిగారా లేదా? అనేది ఒక లైన్.

# ‘అలియాస్ రుక్మిణీ’ ఫస్ట్ షెడ్యూల్ పూర్తి



కోర్ట్ - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ అద్భుత విజయం తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునానిమస్ ప్రొడక్షన్స్, నితిన్ హీరో నటిస్తున్న ‘అలియాస్ రుక్మిణీ’ సరికొత్త ప్రాజెక్ట్‌తో వస్తోంది. తన తొలి చిత్రం దండోరాతో విమర్శకులను ఆకట్టుకున్న మురళీకాంత్ దేవసోత్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించారు. "అలియాస్ రుక్మిణి 10 రోజుల మొదటి షెడ్యూల్ చిత్రీకరణను పూర్తి చేసుకుంది. చిత్ర బృందం ప్రధాన తారాగణంతో కూడిన కొన్ని కీలక సన్నివేశా లను చిత్రీకరించింది. యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నాని ఈ చిత్రానికి జోమోన్ టి. జాన్ ఐఎస్‌సి సినిమాటో గ్రాఫర్‌గా పనిచేస్తుండగా, విజయ్ బల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్‌గా, సృజన అడుసుమిల్లి ఎడిటింగ్. తారాగణం: నితిన్, సాయి కుమార్, హర్ష వర్ధన్‌సాంకేతిక సిబ్బంది:సమర్పణ: నేచురల్ స్టార్ నానిప్రొడక్షన్ బ్యానర్: యూనానిమస్ ప్రొడక్షన్స్ రచన, దర్శకత్వం: మురళీ కాంత్ దేవాసోత్‌నిర్మాత: దీప్తి గంటాసినిమాటోగ్రఫీ: జోమోన్ . జాన్ ।శీదిసంగీతం: విజయ్ బుల్గానిన్‌ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా ఎడిటర్: సృజన అడుసుమిల్లిఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ప్రశాంత్ మండవకాస్ట్యూమ్ డిజైనర్: రేఖ బొగ్గరపుపబ్లిసిటీ డిజైనర్: భరణిధరన్‌మార్కెటింగ్: ఫస్ట్ షో పిఆర్‌ఓ: వంశీశేఖర్


# రామ్ పోతినేని చిత్రంలో సంయుక్త



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ప్రతిష్ఠాత్మక RAPO23లో ఎక్స్‌యిటింగ్ స్టార్ చేరారు. టాలెంటెడ్ హీరోయిన్ సంయుక్త ఈ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసిన మేకర్స్.. టాలీవుడ్ లక్కీ చార్మ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ బర్త్‌డే పోస్టర్ సంయుక్తకు టీమ్ తరఫున శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు.. ఆమె ఈ సినిమాలో భాగమైన విషయాన్ని అధికారి కంగా ప్రకటించింది. ఆమె చేరికతో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్యూరియాసిటీ పెరిగింది. RAPO23ను నియోనోయిర్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. RAPO23తో రామ్ పోతినేని దర్శకుడిగా తొలిసారి పరిచయం అవుతున్నారు. తన విజన్‌ను తెరపైకి తీసుకొచ్చే బాధ్యతను ఆయనే పూర్తిగా తీసుకున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మిస్తున్న ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.RAPO23కు సరిపోయేలా క్యాస్ట్, టెక్నికల్ టీమ్‌ను ఎంపిక చేయడంలో రామ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ తిరునావుక్కరసు (తిరు) విజువల్స్ అందిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం సమకూరుస్తుండగా, ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైనర్‌గా విక్రమ్ మోర్, పీటర్ హెయిన్ యాక్షన్ సీక్వెన్స్‌లకు కొరియోగ్రఫీ చేస్తున్నారు.

# ‘ఇడుపు కాయితం’ ‘శ్రీలత’ సాంగ్‌కు ప్రశంసలు:

**మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి, గీత రచయిత అలరాజు**



మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ.. శ్రీలత.. పాట మా ఫ్యామిలీ మెంబర్స్ కు బాగా నచ్చింది. వాళ్లు ఫోన్స్ చేసి పాట బాగుందని చెబుతున్నారు. ఇండస్ట్రీ నుంచి కూడా మా సాంగ్ కు రెస్పాన్స్ బాగుంది. పాట కంపోజిషన్, సౌండింగ్, లిరిక్స్ , ఇద్దరు సింగర్స్ పాడిన విధానం తమను ఆకట్టుకుందని చెబు తున్నారు. ఈ పాటలో నేను నటించాను. ఈ ఆలోచన బన్నీ వాస్‌ది. మీరు ఇన్ని సాంగ్స్‌కు మ్యూజిక్ చేశారు. మీరు ఎవరో ప్రేక్షకులకు తెలియాలి కదా అని ఈ సాంగ్‌లో నేను కూడా నటించేలా చేశారు. ఈ పాట కోసం డిస్కషన్స్ జరుగుతున్నప్పుడే సినిమాలోని కథలో భాగమవుతూ, ప్రమోషన్ కు కూడా ఉపయోగపడేలా ఉండాలని అనుకున్నాం. పాటలో క్యాచీ లిరిక్స్ కూడా కుదిరాయి. లిరిక్ రైటర్ అలరాజు మాట్లాడుతూ.. నేను ఇప్పటిదాకా దాదాపు 40 చిత్రాలకు సాంగ్స్ రాశాను. నేను రాసిన పాటల్ల మైల్స్ ఆఫ్ లవ్ మూవీలోని తెలియదే తెలియదే పాట మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఈ పాటను సిద్ శ్రీరామ్ పాడారు. బాపు సినిమాలో కంగారే పడకురా అనే పాట కూడా బాగా హిట్ అయ్యింది. ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. శ్రీలత పాట రిలీజ్ కాగానే కాసర్ల శ్యామ్ గారు మెసేజ్ పంపారు. లిరిక్స్ చాలా గొప్పగా ఉన్నాయి. కొన్ని లైన్స్ బాగున్నాయని అభినందించారు. ఈ పాట రాసేప్పుడు డైరెక్టర్ వంశీ రెడ్డి గారు కథతో సంబంధం లేకుండా ఈ పాట అందరికీ నచ్చేలా ఉండాలి. సినిమా చూశాక ఇంకా శ్రోతలకు కనెక్ట్ కావాలని చెప్పారు. మీరు ఇప్పుడు ఆడియో వింటుంటే నచ్చుతుంది. కానీ సినిమాలో చూసినప్పుడు నాలుగు రెట్లు ఎక్కువగా ఈ పాటను ఇష్టపడతారు. టైటిల్ రివీల్ చేసేందుకు ముందగానే ఈ పాట ఫైనల్ అయ్యింది. ఈ పాటలోని పదాలను పూర్తిగా ఫోక్ స్టైల్ లో కాకుండా అందరికీ కనెక్ట్ అయ్యేలా రాశాను.



## మహిళల ఆసియా కప్..
# ఫైనల్‌కు భారత్
### దక్షిణ కొరియా ఓటమి

**హులున్‌బుయిర్ (చైనా):** దక్షిణ కొరియాను ఓడించిన భారత్, మహిళల జూనియర్ ఆసియా కప్ 2026 ఫైనల్‌కు చేరింది. చైనాలోని హులున్‌బుయిర్ నగరంలో జరుగుతున్న మహిళల జూనియర్ ఆసియా కప్ 2026, భారత్ శనివారం దక్షిణ కొరియాను 5-1 తేడాతో ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. మ్యాచ్ ప్రారంభం ఉత్కంఠభరితంగా సాగడంతో, ఇరు జట్లు జాగ్రత్తగా ఆటను ప్రారంభించాయి. భారత్ 13వ నిమిషంలో ప్రతిష్టంభనను ఛేదించింది. ఈ దాడిలో మధు సిదర్ తుది మెరుగులు దిద్ది భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. రెండవ క్వార్టర్‌లో (17వ నిమిషం) పెనాల్టీ కార్నర్ లభించగా, సుప్రియ ముందుకు వచ్చి కొరియా రక్షణ శ్రేణిని దాటుకుంటూ ఒక కచ్చితమైన డ్రాగ్‌ఫ్లిక్‌తో గోల్ చేసి భారత్ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. నిమిషంలో మరోసారి ప్రతిఫలం లభించింది.

కొరియా పంపిన బంతి (21వ) భారత వింగర్‌కు చేరగా, ఆమె అందించిన క్రాస్‌ను సుఖ్‌వీర్ కౌర్ గోల్‌గా మలచి స్కోరును 3-0కి చేర్చింది. విరామం తర్వాత భారత్ దూకుడుగా ఆడి (33వ) తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. మరో పెనాల్టీ కార్నర్ లభించడంతో సుప్రియ తన రెండవ గోల్‌ను సాధించి భారత్‌ను 4-0 ఆధిక్యంలో నిలిపింది. చివరకు (41వ) ముందడుగుతో యూరి జియోంగ్ ఒక సెట్‌పీస్‌ను గోల్‌గా మలిచి కొరియా లోటును 4-1కి తగ్గించింది. ఆఖరి పావుగంటలో భారత్ తమ రక్షణ వ్యవస్థను పటిష్టం చేసుకుని, కొరియన్లకు పోటీలోకి తిరిగి వచ్చేందుకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా (56వ) మరో పెనాల్టీ కార్నర్ ద్వారా సుప్రియ తన హ్యాట్రిక్‌ను పూర్తి చేసి, 5-1 తేడాతో ఘన విజయాన్ని ఖాయం చేసింది.




## ప్రపంచ ఛాంపియన్‌షిప్..
# ఎయిర్ పిస్టల్‌లో భక్తికి కాంస్యం

**చాంగ్వాన్:** డబ్ల్యూఎస్‌పిఎస్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ 2026, 10మీ ఎయిర్ పిస్టల్ భక్తి శర్మ కాంస్యం గెలుచుకోవడమే కాకుండా జూనియర్ క్వాలిఫికేషన్ ప్రపంచ రికార్డును కూడా నమోదు చేసింది. చాంగ్వాన్‌లో జరుగుతున్న వరల్డ్ షూటింగ్ పారా స్పోర్ట్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో, శనివారం భారత క్రీడాకారిణి భక్తి శర్మ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్1 ఫైనల్‌లో 213.1 స్కోరు సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్‌లో సృష్టి కంటే ఒక స్థానం దిగువన ఆరో స్థానంలో నిలిచినప్పటికీ, భక్తి 565 స్కోరుతో కొత్త జూనియర్ ప్రపంచ రికార్డును నమోదు చేసింది. సృష్టి 566 స్కోరు సాధించింది. టీమ్ ఈవెంట్‌లో సృష్టి, భక్తి, సుమేధల ముగ్గురి సంయుక్త స్కోరు 1690తో భారత్ రజతం గెలుచుకుంది. ఇరాన్ 1707 స్కోరుతో కొత్త రికార్డు సృష్టించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. చైనా టీమ్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఇరాన్‌కు చెందిన నస్రీన్ షాహి సమఖౌన్, భక్తిని స్వల్ప తేడాతో ఓడించి రజత పతకాన్ని గెలుచుకోగా, ఆమె సహచరి ఫైజె అహ్మది 238.3 స్కోరుతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే ఫైనల్‌లో ఉన్న ఏకైక మరో భారతీయ క్రీడాకారిణి అయిన సృష్టి అరోరా ఐదవ స్థానంలో నిలిచింది. ఒకే ఒక్క పాయింట్ తక్కువ పడటంతో సుమేధా పాఠక్ టాప్ ఎనిమిది స్థానాల వెలుపల నిలిచారు. మరోవైపు, 2024 పారాలింపిక్స్ కాంస్య పతక విజేత రుబీనా ఫ్రాన్సిస్ 554 స్కోరు సాధించి, 18వ స్థానంతో ఈ పోటీలను ముగించారు

## వియత్నాం ఓపెన్..
# ఫైనల్‌కు ఇషా..
### తన్వి ఓటమి

**వియత్నాం:** భారత్ అథ్లెట్ ఇషారాణి బారువా స్వదేశానికి చెందిన రక్షితను ఓడించి వియత్నాం ఓపెన్ 2026 ఫైనల్‌కు చేరుకుంది. ఇదే సమయంలో వితిద్‌సర్న్ చేతిలో తన్వి శర్మ ఓడిపోయింది. ఇషా శనివారం ఇక్కడ తన తోటి క్రీడాకారిణి రక్షిత శ్రీ రామ్‌రాజ్‌ను సునాయాసంగా ఓడించింది. మూడో సీడ్ క్రీడాకారిణి 39 నిమిషాల్లో 21-10, 21-18 తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. ఇషా గత రౌండ్‌లో చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ చింగ్ పింగ్‌ను 21-15, 21-18 తేడాతో ఓడించగా, మొదటి రౌండ్‌లో బై లభించడంతో రౌండ్ ఆఫ్ 16లో మలేషియాకు చెందిన గో జిన్ వెయిని ఓడించింది. మరో సెమీఫైనల్‌లో టాప్ సీడ్ తన్వి శర్మ, థాయ్‌లాండ్‌కు చెందిన సరున్రాక్ విటిడ్సార్న్ చేతిలో 19-21, 20-22 తేడాతో ఓడిపోయింది. ఇక పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ జియా హెంగ్ టెహ్ చేతిలో 13-21, 8-21 తేడాతో ఓడిపోవడంతో హెచ్‌ఎస్ ప్రణయ్ కూడా సెమీఫైనల్ దశలోనే టోర్నమెంట్ నుండి నిష్క్రమించాడు.










## మహిళల ఆసియా కప్..
# నేడు భారత్, శ్రీలంక మహా సమరం
### ఎనిమిదో టైటిల్‌కై హర్మన్‌ప్రీత్ సేన దృష్టి

**దుబాయ్:** ఏడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్, దుబాయ్‌లో ఆదివారం రాత్రి 8 గంటలకు జరిగే 2026 మహిళల టీ20 ఆసియా కప్ ఫైనల్‌లో ఎనిమిదో టైటిల్‌ను సాధించేందుకు హర్మన్‌ప్రీత్ సేన పట్టుదలతో ఉంది. శ్రీలంకతో తలపడనున్న నేపథ్యంలో, మరోసారి షఫాలీ వర్మ, దీప్తి శర్మల ప్రదర్శనపై ఆశలు పెట్టుకుంది. రెండు అర్ధశతకాలతో సహా 168 పరుగులు చేసిన షఫాలీ ఖండాంతర టోర్నమెంట్‌లో భారత అత్యుత్తమ బ్యాటర్‌గానే కాకుండా, అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా కూడా నిలిచింది. స్మృతి మంధాన (154) సెంచరీ చేసి రెండుసార్లు సింగిల్ డిజిట్ స్కోర్లు కూడా చేసి నిలకడలేని ప్రదర్శన కనబరుస్తున్నప్పటికీ, షఫాలీ మాత్రం బ్యాటింగ్‌లో స్థిరత్వాన్ని కొనసాగించగలిగింది. మరీ ముఖ్యంగా, తన చుట్టూ ఉన్నవాళ్లు ఇబ్బంది పడిన ఆటలలో కూడా షఫాలీ తన స్ట్రోక్‌లను చాలా సునాయాసంగా ఆడింది. పొదుపుగా ఆడే శ్రీ చరణీ జట్టులో చేరడం, ప్రేమా రావత్ కూడా లయ అందుకోవడంతో అత్యంత ముఖ్యమైన స్పిన్ బౌలింగ్ విభాగానికి పటిష్టంగా ఉంది. 2024లో జరిగిన గత ఎడిషన్ ఫైనల్‌లో తమను 8 వికెట్ల తేడాతో ఘోర పరాజయం పాలు చేసిన పట్టుదల గల శ్రీలంక జట్టు పట్ల భారత్ అప్రమత్తంగా ఉండనుంది. కెప్టెన్ తన ఒడిదుడుకుల కెరీర్ పొడవునా ప్రదర్శించిన అదే పట్టుదలను అథపత్తు జట్టు కూడా కనబరుస్తోంది. సెమీఫైనల్‌లో ప్రతికూల పరిస్థితుల్లో పాకిస్థాన్‌పై విజయం సాధించడానికి వారు చూపిన పట్టుదలే ఇందుకు ఇటీవలి ఉదాహరణ. హర్షిత సమరవిక్రమ 36 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, మరో ఎండ్‌లో కవిషా దిల్హరి (33) అందించిన బలమైన సహకారంతో శ్రీలంక తిరిగి గాడిలో పడింది. ఇక క్లిష్టమైన ముగింపులో నీలక్షిక సిల్వా, కౌశిని నుత్యాంగన జోడి ప్రశాంతంగా, నిలకడగా ఛేజింగ్‌ను పూర్తి చేసింది. కాగా బలహీనమైన బంగ్లాదేశ్‌తో సెమీఫైనల్‌లో భారత్ 4 క్యాచ్‌లు జారవిడవడంతో ఫీల్డింగ్ ఇప్పటికీ ఒక ప్రధాన ఆందోళనగా మిగిలిపోయింది. అంతకుముందు, పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో, భారత్ మూడు క్యాచ్‌లను జారవిడిచి, తమ చిరకాల ప్రత్యర్థులను టీ20ఐ చరిత్రలోనే అత్యల్ప స్కోరుకే పరిమితం చేసింది. థాయ్‌లాండ్ పోరులో కూడా భారత్ రెండు క్యాచ్‌లను జారవిడిచింది, దీంతో ఇప్పటివరకు జరిగిన నాలుగు మ్యాచ్‌లలో జారవిడిచిన అవకాశాల సంఖ్య మొత్తం తొమ్మిదికి చేరింది. ఈ నేపథ్యంలో ఆదివారం భారత్, శ్రీలంక మధ్య జరిగే ఫైనల్ పోరు ఉత్కంఠత కలిగిస్తోంది.

# నేటి నుండి భారత్, అఫ్గాన్ టి20
### ఆధిపత్యం కోసం రెండు జట్లు దృష్టి

**న్యూఢిల్లీ:** భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య ప్రతిష్టాత్మక మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఈ నెల 13 నుంచి రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు అధికారికంగా అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు ఆతిథ్యం ఇస్తున్నప్పటికీ, మ్యాచ్‌లన్నీ ఢిల్లీ వేదికగానే జరగనున్నాయి. సీనియర్లతో పాటు యువ ప్రతిభతో కూడిన భారత జట్టు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి సిరీస్ సొంతం చేసుకోవాలని పట్టుదలతో ఉండగా, బలమైన అఫ్గాన్ జట్టు గట్టి సవాల్ విసిరేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఈ సిరీస్‌లో భారత జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహిస్తుండగా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. విధ్వంసకర ఓపెనర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజు శాంసన్‌లతో పాటు, బ్యాటింగ్ విభాగానికి ప్రధాన బలంగా నిలవనున్నారు. దీనికి వైభవ్ సూర్యవంశీ జతకానున్నాడు. మిడిలార్డర్‌లో శివం దూబే, నితీశ్ కుమార్ రెడ్డి వంటి పవర్ హిట్టర్లు జట్టుకు భారీ స్కోర్లు అందించే సత్తా కలిగి ఉన్నారు. బౌలింగ్ విభాగంలో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, లెఫ్టార్మ్ పేసర్ అర్షదీప్ సింగ్ భారత్‌కు ప్రధాన అస్త్రాలుగా మారనున్నారు. స్పిన్ విభాగంలో వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ ప్రత్యర్థిని కట్టడి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు ఇబ్రహీం జద్రాన్ నాయకత్వం వహిస్తున్నారు. భుజం గాయం కారణంగా చాలా కాలం పాటు జట్టుకు దూరమైన స్టార్ పేసర్ నవీన్‌ఉల్‌హక్ పూర్తి ఫిట్‌నెస్‌తో తిరిగి వచ్చాడు. అతని రాక ఆఫ్ఘనిస్తాన్ ఫాస్ట్ బౌలింగ్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ గుల్బదిన్ నైబ్ కూడా జట్టులోకి తిరిగి వచ్చాడు. గుల్బదిన్ నైబ్ మిడిల్ ఆర్డర్‌ను బలోపేతం చేయడంతో పాటు మంచి బౌలింగ్ ఆప్షన్‌గా నిలుస్తాడు. శీయ క్రికెట్‌లో సంచలనం సృష్టిస్తున్న యువ వికెట్ కీపర్‌బ్యాటర్ నూర్ రహ్మాన్‌కు తొలిసారిగా జట్టులో చోటు దక్కింది. అతను రహ్మానుల్లా గుర్బాజ్‌కు బ్యాకప్‌గా వ్యవహరిస్తాడు. ఆఫ్ఘనిస్తాన్ ప్రధాన బలం ఎల్లప్పుడూ వారి స్పిన్ బౌలింగే. ఈసారి కూడా రషీద్ ఖాన్, నూర్ అహ్మద్, ముజీబ్ ఉర్ రెహమాన్ వంటి సీనియర్ ఆటగాళ్లు భారత పిచ్‌లపై తమ స్పిన్ మాయాజాలాన్ని ప్రదర్శించడానికి సిద్ధంగా ఉన్నారు. అనుభవజ్ఞుడైన మహమ్మద్ నబీ కూడా జట్టులో సమతుల్యతను కాపాడటానికి కృషి చేస్తాడు.



# క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌లో సెబి సంస్కరణలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌లో లిక్విడిటీ, పారదర్శకత, ధరల నిర్ణయ ప్రక్రియను మరింత మెరుగుపరిచేందుకు భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డుసెబీ ఏడు ప్రతిపాదనలను చేసింది. సెబి కన్సల్టేషన్ పేపర్‌ను విడుదల చేసి, వాటిపై ప్రజల నుంచి అక్టోబర్ 3, 2026 వరకు అభిప్రాయాలను ఆహ్వానించింది. డెరివేటివ్ కాంట్రాక్టుల సెటిల్‌మెంట్ ధరను నిర్ణయించేందుకు సెబి రెండు మార్గాలను ప్రతిపాదించింది. మొదటి విధానంలో నిరంతర ట్రేడింగ్ సెషన్, క్లోజింగ్ ఆక్షన్ సెషన్ లో జరిగిన లావాదేవీలను కలిపి సెటిల్‌మెంట్ ధరను నిర్ణయిస్తారు. రెండో విధానంలో కనీసం ఏడాది పాటు నిరంతర ట్రేడింగ్ సెషన్ ఆధారంగానే సెటిల్‌మెంట్ కొనసాగించి, ఆ తర్వాత ముగింపు వేలం డేటాను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ముగింపు వేలం సమయంలో చూపిస్తున్న ఇండికేటివ్ ఇండెక్స్ విలువను తొలగించాలని సెబి ప్రతిపాదించింది. ఈ విలువను ఇండికేటివ్ ఈక్విలిబ్రియం ప్రైస్ ఆధారంగా నిర్ణయిస్తున్నారు. క్లోజింగ్ ఆక్షన్ సెషన్ సమయాల్లోనూ రెండు ప్రత్యామ్నాయాలను సెబి సూచించింది. నిరంతర వేలం వ్యవస్థకు అర్హత ఉన్న షేర్లలో మధ్యాహ్నం 3:30 గంటల వరకు ట్రేడింగ్ కొనసాగుతుంది. 3:31 నుంచి 3:40 గంటల వరకు సిఎఎస్ నిర్వహిస్తారు. అనంతరం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ 3:45 గంటల వరకు కొనసాగుతుంది. షేర్ల ట్రేడింగ్‌ను మధ్యాహ్నం 3:15 గంటలకు ముగించి, 3:15 నుంచి 3:25 గంటల వరకు సిఎఎస్ నిర్వహిస్తారు. అనంతరం ఎఫ్అండ్ఒ ట్రేడింగ్ 3:30 గంటలకు ముగుస్తుంది. ప్రస్తుతం సిఎఎస్ ప్రారంభానికి ముందు ఉన్న ఐదు నిమిషాల ట్రాన్సిషన్ సమయాన్ని కేవలం ఒక నిమిషానికి తగ్గించాలని సెబీ ప్రతిపాదించింది. రిఫరెన్స్ ధరకు ప్లస్ లేదా మైనస్ 1 శాతం పరిధికి వెలుపల ఉంచిన లిమిట్ ఆర్డర్లను వేలం ముగింపు సమయంలో ఆర్డర్ సమర్పించిన తర్వాత రద్దు చేసేందుకు అనుమతించకూడదని సెబీ ప్రతిపాదించింది. అయితే ధరను మరింత అనుకూలంగా మార్చే విధంగా వాటిని సవరించుకునే అవకాశం ఉంటుంది. సిఎఎస్‌లోకి సాధారణ, పూర్తిగా వెల్లడయ్యే లిమిట్ ఆర్డర్లుగా తీసుకెళ్లేందుకు అనుమతించాలని కూడా సెబి ప్రతిపాదించింది. లిస్టెడ్ సెక్యూరిటీల తుది ముగింపు ధరను నిర్ణయించడంలో సిఎఎస్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇదే ధర ఆధారంగా డెరివేటివ్స్ సెటిల్‌మెంట్ కూడా ప్రభావితమవుతుంది. అందువల్ల సిఎఎస్‌లో లిక్విడిటీ, పారదర్శకత, ధరల నిర్ణయ ప్రక్రియను మెరుగుపరచడమే ప్రతిపాదిత మార్పుల ప్రధాన ఉద్దేశమని సెబీ తెలిపింది. వివిధ వర్గాల నుంచి వచ్చే అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం ఈ మార్పులను సెబీ తుది రూపంలో ఖరారు చేసే అవకాశం ఉంది.

# ఫిన్‌టెక్ రంగంలోకి ఇండియాబుల్స్
### రూ.1,050 కోట్లతో 70% వాటా కొనుగోలు




**ముంబయి, సెప్టెంబరు 12:** ఫిన్‌టెక్ రంగంలోకి ప్రవేశించడంతో పాటు నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల కోసం టెక్నాలజీ సొల్యూషన్స్ వ్యాపారాన్ని విస్తరించే లక్ష్యంతో ఇండియాబుల్స్ ఫిన్‌టెక్ క్లౌడ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 70 శాతం వాటాను రూ.1,050కోట్లకు కొనుగోలుచేస్తోంది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో ఇండియాబుల్స్ నిర్ణయాన్ని వెల్లడించింది. ప్రతిపాదిత కొనుగోలుకు సంబంధించి ఫిన్‌టెక్ క్లౌడ్‌తో తుది ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ డీల్‌లో ఫిన్‌టెక్ క్లౌడ్ ఈక్విటీ విలువ రూ.1,500 కోట్లుగా నిర్ణయించారు. ఎన్‌స ఎల్‌టి ఆమోదించే స్కీమ్ ద్వారా ఈ కొనుగోలు ప్రక్రియ చేపట్టనున్నారు. ఫిన్‌టెక్ క్లౌడ్‌లో 70 శాతం వాటా కలిగిన షేర్‌హోల్డర్లతో కలిసి ఈ లావాదేవీని పూర్తి చేయనుంది. కొనుగోలు ప్రతిఫలంగా ఇండియాబుల్స్ గరిష్ఠంగా 21కోట్ల పూర్తిగా చెల్లించిన ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. దీనికి వర్తించే ధర నిర్ణయ నిబంధనలు సహా అన్ని నియంత్రణలు వర్తిస్తాయి. ఫిన్‌టెక్ క్లౌడ్‌అనేది లోన్‌సర్వీస్ ప్రొవైడర్. నియంత్రిత ఆర్థిక సంస్థలు, ముఖ్యంగా ఎన్బీఎఫ్‌సిలకు రుణాల ప్రారంభ ప్రక్రియ, అండర్‌రైటింగ్, రుణాల నిర్వ హణవంటి కార్యకలాపాల్లో టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలు, సేవలను అందిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఫిన్‌టెక్ క్లౌడ్ రూ.133.77 కోట్ల స్థూల ఆదాయాన్ని నమోదు చేయగా, పన్నుకు ముందు లాభం రూ.30.31 కోట్లుగా నమోదైంది. ఐదేళ్ల క్రితమే ఫిన్‌టెక్ క్లౌడ్ సంస్థ ఏర్పాటైంది. గత యేడాది సుమారు రూ.133.77 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఫిన్‌టెక్ క్లౌడ్ కొనుగోలు ద్వారా ఎన్‌బిఎఫ్‌సిలకు టెక్నాలజీ సొల్యూషన్స్ అందించే వ్యాపారం ద్వారా ఫిన్‌టెక్ విభాగంలోకి ప్రవేశించేందుకు అవకాశం లభిస్తుందని ఇండియాబుల్స్ తెలిపింది.

**వాణిజ్యం**

## ఇయు, భారత్ ఒప్పందంతో
# భారత్ కార్లకు భారీ ఎగుమతి అవకాశం



### మారుతి, టాటా, మహీంద్రాకు ప్రయోజనం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే భారత ఆటోమొబైల్ మార్కెట్లో పోటీ మరింత పెరగనుంది. ఎగుమతుల పరంగా మారుతి, టాటా, మహీంద్ర వంటిసంస్థలకు మేలుచేస్తుందని అంచనా. ఈ ఒప్పందం కింద యూరప్ కార్ల తయారీ సంస్థలకు భారత్‌లో ఐసిఇ, హైబ్రిడ్ కార్లను రాయితీ సుంకాలతో దిగుమతి చేసుకునేందుకు తొలి యేడాదిలో 1 లక్ష వాహనాల కోటా లభించనుంది. ఈ కోటా పదో యేడాదికి 1.60 లక్షల వాహనాలకు చేరుతుంది. 2025లో భారత్ ఇయు నుంచి కేవలం 17,191 కార్లను దిగుమతి చేసుకుంది. దీనితో పోలిస్తే తొలి యేడాది 1 లక్ష కార్ల కోటా దాదాపు ఆరు రెట్లు అధికం కావడం గమనార్హం. దీంతో దేశీయ కార్ల తయారీ దారులపై, ముఖ్యంగా ప్రీమియం విభాగంలో పోటీ పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో భారత్‌లో తయారయ్యే కార్లకు యూరోపియన్ మార్కెట్లో భారీ ఎగుమతి అవకాశం లభించనుంది. తొలి యేడాదిలో 2.50 లక్షల భారతీయ ఐసిఇ, హైబ్రిడ్ కార్లకు ఇయు కోటా కల్పించనుంది. పదో యేడాదికి 4 లక్షలకు పెరుగుతుంది. ఈ కోటాలోని వాహనాలపై సుంకం ఐదో యేడాది నుంచి పూర్తిగా సున్నా కానుంది. రూ.15 వేల యూరోల లోపు కార్లకు రక్షభారత్ తన సామూహిక మార్కెట్ కార్ల విభాగాన్ని రక్షించేలా రాయితీలను రూపొందించింది.

15 వేల యూరోల కంటే తక్కువ ధర ఉన్న ఐసిఇ, హైబ్రిడ్ కార్లకు ఎలాంటి సుంక రాయితీ ఉండదు. 15వేల నుంచి 35వేల యూరోల మధ్య ధర ఉన్న కార్లపై ప్రస్తుతం ఉన్న 110 శాతం ప్రాథమిక సుంకం తొలి యేడాదిలో 35 శాతానికి, ఐదో యేడాదికి 10 శాతానికి తగ్గుతుంది. 35వేల యూరోల కంటే ఎక్కువ ధర ఉన్న కార్లపై రాయితీ సుంకం తొలి ఏడాదిలో 30 శాతంగా ఉండి, ఐదో ఏడాదికి 10 శాతానికి చేరుతుంది. దీంతో పోటీ ప్రభావం చిన్న కార్ల కంటే ప్రీమియం, లగ్జరీ కార్ల విభాగంలోనే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. భారత్‌లో విడిభాగాల రూపంలో దిగుమతి చేసి స్థానికంగా అసెంబుల్ చేసే కంప్లీట్లీ నాక్‌డ్ డౌన్ వాహనాలకు కూడా ఎఫ్‌టీఏలో రాయితీలు ఉన్నాయి. ఐసిఇ, హైబ్రిడ్ సికెడి వాహనాలకు తొలి ఐదేళ్లలో యేడాదికి 75,000 యూనిట్ల కోటా ఉంటుంది.

పదో యేడాది నుంచి ఇది 50,000 యూనిట్లకు తగ్గుతుంది. ప్రస్తుతం 16.5 శాతంగా ఉన్న సికెడి దిగుమతి సుంకం తొలి ఏడాదిలో 13.75 శాతానికి, రెండో ఏడాదిలో 11 శాతానికి, మూడో ఏడాది నుంచి 8.25 శాతానికి తగ్గుతుంది. దీంతో యూరోపియన్ కంపెనీలకు పూర్తిగా తయారైన కార్లను దిగుమతి చేసుకోవడంతో పాటు, భారత్‌లో తక్కువ సుంకంతో కార్లను అసెంబుల్ చేసే అవకాశం కూడా లభిస్తుంది. ఎలక్ట్రిక్ వాహనాల విషయంలో భారత్ మరింత జాగ్రత్తగా వ్యవహరించింది. ఎఫ్‌టీఏ అమల్లోకి వచ్చిన తొలి నాలుగేళ్లలో యూరోపియన్ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు ప్లగ్‌ఇన్ హైబ్రిడ్లు తదితర కొత్త టెక్నాలజీ వాహనాలకు రాయితీ దిగుమతి కోటా ఉండదు. ఐదో యేడాదినుంచి రాయితీలు ప్రారంభమవుతాయి.

## హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో కొత్తగా
# ఇద్దరు పూర్తికాలపు డైరెక్టర్లు




**ముంబై, సెప్టెంబరు12:** హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ బోర్డు కీలక నిర్ణయాలు తీసుకుంది. వి. శ్రీనివాస రంగన్, జిమ్మీ టాటాలను మరోసారి పూర్తికాల డైరెక్టర్లుగా నియమించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని బ్యాంక్ శనివారం స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వెల్లడించింది. అదే సమయంలో బ్యాంక్ ఎండిసిఇఒ పదవికోసం ఇద్దరు అభ్యర్థుల పేర్లను కూడా సమర్పించింది. శ్రీనివాస రంగన్‌ను 2026 నవంబర్ 23 నుంచి 2027 నవంబర్ 22 వరకు పూర్తికాలపు డైరెక్టర్‌గా నియమించారు. జిమ్మీ టాటా నియామకం మూడు సంవత్సరాల కాలానికి ఉంటుంది. బ్యాంక్‌లో మరో అదనపు పూర్తికాలపు డైరెక్టర్ పదవిని సృష్టించేందుకు కూడా బోర్డు ఆమోదం తెలిపింది. బ్యాంక్‌లోని వివిధ విభాగాల మధ్య మరింత సమన్వయం, పర్యవేక్షణను మెరుగుపరచడంతో పాటు భవిష్యత్ వారసత్వ ప్రణాళిక కోసం బలమైన వ్యవస్థనుఏర్పాటు చేయడం ఈ నిర్ణయం ఉద్దేశ్యం. ఈ అదనపు పదవి భర్తీ అయిన తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో మొత్తం నలుగురు హోల్‌టైమ్ డైరెక్టర్లు ఉంటారు. కొత్త ఎండి సిఇఒతో సంప్రదింపులు జరిపిన అనంతరం ఈ అదనపు పదవిని భర్తీ చేయనున్నారు. శ్రీనివాస రంగన్‌శ్రీనివాస రంగన్ ప్రస్తుతం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆయన బ్యాంక్‌లో మానవ వనరులు, లీగల్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, ఎథిక్స్, ఫ్రాడ్ విజిలెన్స్ వంటి కీలక విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. రంగన్ ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి కామర్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. అలాగే ఐసిఎఐలో అసోసియేట్‌గా ఉన్నారు. జిమ్మీ టాటాజిమ్మీ టాటాగా అర్హత సాధించారు. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల్లో ఆయనకు 35 యేళ్లకు పైగా అనుభవం ఉంది. 1987లో స్ట్రాజిక్ కన్సల్టెంట్స్ సంస్థలో కన్సల్టెంట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. 1989లో చేరిన ఆయన అక్కడ విభాగానికి హెడ్‌గా పనిచేశారు.

# ఫారెక్స్ నిల్వల్లో రష్యాను వెనక్కినెట్టిన భారత్




**ముంబయి, సెప్టెంబరు 12:** భారతదేశ ఆర్థిక వ్యవస్థ మరో కీలక మైలురాయిని అందుకుంది. ఆర్బీఐ చేపట్టిన ప్రత్యేక పథకం కారణంగా దేశంలోకి డాలర్ల రాక రికార్డు స్థాయిలో పెరగడంతో, విదేశీ మారక నిల్వలు ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరాయి. దీంతో ఫారెక్స్ నిల్వలు కలిగిన దేశాల జాబితాలో రష్యాను అధిగమించి భారత్ ప్రపంచంలోనే నాలుగో స్థానానికి ఎగబాకింది. సెప్టెంబర్ 4తో ముగిసిన వారంలో భారత ఫారెక్స్ నిల్వలు ఏకంగా 44.9 బిలియన్ డాలర్లు పెరిగి, 785.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 75,07,796 కోట్లు) రికార్డు స్థాయికి చేరాయి. ఈ భారీ పెరుగుదలతో ఇప్పటివరకు నాలుగో స్థానంలో ఉన్న రష్యాను భారత్ వెనక్కి నెట్టింది. ప్రస్తుతం ఈ జాబితాలో చైనా, జపాన్, స్విట్జర్లాండ్ మాత్రమే భారత్ కంటే ముందున్నాయి. ఆర్బీఐ ఈ యేడాది జూన్ 8న ప్రవేశపెట్టిన ఫారెన్ కరెన్సీ నాన్‌రెసిడెంట్ (బ్యాంక్) డిపాజిట్ల స్పెషల్ స్వాప్ పథకానికి అనూహ్య స్పందన లభించడమే ఈ డాలర్ల వరదకు ప్రధాన కారణంగా నిలిచింది. ఈ పథకం ద్వారా కేవలం 11 వారాల్లోనే దేశంలోకి 73 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. నిర్దేశిత లక్ష్యం గడువు కంటే ముందే నెరవేరడంతో, ఆర్బీఐ ఈ పథకాన్ని సెప్టెంబర్ 30కి బదులుగా ఆగస్టు 31నే ముగించింది. అంతర్జాతీయంగా బంగారం ధరలు తగ్గడంతో దేశ పసిడి నిల్వల విలువ 2.59 బిలియన్ డాలర్లుతగ్గినా, డాలర్ల ప్రవాహం అధికంగా ఉండటంతో మొత్తం నిల్వలు భారీగా పెరిగాయి. విదేశీ మారక నిల్వలు ఇంత భారీగా పెరగడం దేశ ఆర్థికవ్యవస్థ పటిష్ఠతకు సంకేతమని, ఇది రూపాయి విలువలో హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు స్థిరీకరించేందుకు ఆర్బీఐకి మరింత బలాన్ని ఇస్తుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.